


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 128 | బుధవారం | 23-10-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

### రాష్ట్రంలో రెండు రోజులు వర్షాలు

రాష్ట్రంలో రెండు రోజులపాటు ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచే అవకాశముందన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు.

# కార్పొరేట్స్ గుప్పెట్లో మీడియా




ఎజెండాలకు అతీతంగా 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రజాచైతన్య కృషి

6వ వార్షికోత్సవ సభలో ప్రముఖ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

హిందుత్వవాదాన్ని, మతవిభేదాలను రెచ్చగొట్టడమే దేశంలో ప్రధాన స్రవంతి పత్రికలు–మీడియా లక్ష్యంగా మారిందని ప్రముఖ సంపాదకులు కె.రామచంద్రమూర్తి విమర్శించారు. మంగళవారం ''ప్రజాపక్షం'' దినపత్రిక ఆరవ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కమ్యూనిస్టు భావజాలం సజీవంగా ఉన్నంతకాలం దేశానికి హిందూమతోన్మాద ప్రమాదం ఉండదన్న ప్రముఖ పాత్రికేయుడు, కాలమిస్టు అనీస్‌జంగ్ అభిప్రాయాలను కె.రామచంద్రమూర్తి ఈ వార్షికోత్సవ వేడుకలలో పునరుద్ఘాటించారు. ప్రగతిశీల భావాలను ప్రతిబింబించే కమ్యూనిస్టుపార్టీలే మోదీకి పూర్తిస్థాయిలో హిందువుల ఓట్లు పడకుండా అడ్డుకున్నాయని గుర్తుచేశారు. దేశ ప్రధాన స్రవంతి మీడియా భ్రష్టుపట్టిందని, ఛానల్స్ అమ్ముడుపోయాయనీ, కార్పొరేట్‌శక్తుల గుప్పెట్లో తరువాయి 2లో



# ఎన్ఐసి చేతికి 'ధరణి'

డిసెంబరు 1 నుంచి భూ రికార్డుల నిర్వహణ బాధ్యత ఆ సంస్థదే

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ధరణి సమస్యల నుంచి త్వరలోనే ప్రజలకు విముక్తికల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులోభాగంగా ఇప్పటి వరకు విదేశీ సంస్థటెర్రాసిస్ చేతిలో ఉన్న ధరణి నిర్వహణా బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన (ఎన్ఐసి) జాతీయ సమాచార సంస్థకు అప్పగించింది. ఇక మీదట రాష్ట్రంలో వచ్చే డిసెంబర్ 1 వతేదీ నుంచి తెలంగాణలో భూ రికార్డుల నిర్వహణ బాధ్యతను ఎన్ఐసి నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం లోని పెద్దలు ఎలాంటి ముందు చూపు లేకుండా హడావుడిగా తొందరపాటు నిర్ణయాలతో తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఒరిస్సా రాష్ట్రంలో పనిచేసి విఫలమైన టెర్రాసిస్ అనే విదేశీ కంపెనీకి తరువాయి 12లో





# రష్యా – ఉక్రేన్ యుద్ధానికి శాంతియుత పరిష్కారం!

అన్ని రకాల సహకారం అందిస్తాం : ప్రధాని నరేంద్ర మోదీ

బ్రిక్స్ 16వ శిఖరాగ్ర సదస్సుకు రష్యా చేరుకున్న భారత ప్రధాని

**కజాన్ :** రష్యా – ఉక్రేన్ యుద్ధం శాంతియుత విధానంలో పరిష్కారం కావాలని, అందుకు భారతదేశం అన్ని రకాలుగా అవసరమైన సహకారాన్ని అందిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. బ్రిక్స్ 16వ శిఖరాగ్ర సదస్సు హాజరయ్యేందుకు రష్యా దేశంలోని కజాన్ నగరానికి మంగళవారం నాడు మోదీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. ఇరువురి మధ్య ఉక్రేన్ అంశంపైనే ఎక్కువ చర్చ జరిగినట్లు సమాచారం. త్వరితగతిన శాంతి పునరుద్ధరణ, ప్రాంతీయ స్థిరత్వం కోసం న్యూఢిల్లీ సంపూర్ణంగా మద్దతిస్తుందని పుతిన్‌తో సమావేశంలో మోదీ వెల్లడించారు. గడిచిన మూడు మాసాలలో రష్యాలో తాను రెండవసారి పర్యటించడం ద్వారా ఇరు దేశాల మధ్య సన్నిహిత సమన్వయం, లోతైన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. రష్యా, ఉక్రేన్ ఘర్షణ విషయంలో తాము తరచు మాట్లాడుకుంటున్నామని తెలిపారు. సమస్యలు శాంతియుత పద్ధతిలో పరిష్కారం కావాలని మోదీ పునరుద్ఘాటించారు. అన్ని అంశాలను చర్చించేందుకు తమకు అవకాశం లభించిందన్నారు. గత జూలైలో ఇరువురి మధ్య మాస్కోలో జరిగిన వార్షిక సదస్సు ద్వారా అన్ని రంగాలలో సహకారం బలోపేతం అయిందన్నారు. బ్రిక్స్‌కు రష్యా అధ్యక్షత వహించడం పట్ల పుతిన్‌ను మోదీ అభినందించారు. బ్రిక్స్ సదస్సలో పాల్గొనేందుకు అందమైన కజాన్ నగరంలో పర్యటించడం తనకు గొప్ప ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ నగరంలో భారత్‌కు చారిత్రక సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కజాన్‌లో భారతదేశ నూతన కాన్సులేట్‌ను ప్రారంభించడం ద్వారా బంధం మరింత బలపడుతుందన్నారు. పుతిన్ మాట్లాడుతూ రష్యా, భారత్‌ల మధ్య వ్యాపారంలో మంచి పరిస్థితులు ఉన్నాయన్నారు.



# చెంగిచియాన్, హాన్ నదుల తరహాలో మూసీ పునరుజ్జీవం

దక్షిణ కొరియాలో నదులను పరిశీలించిన రాష్ట్ర మంత్రులు

ప్రజాపక్షం/హైదరాబాద్

కాలుష్యానికి గురైన హాన్ నదిని దక్షిణ కొరియా ప్రభుత్వం శుభ్రపరచి, పునరుద్ధరించింది. ప్రక్షాళన తర్వాత శుభ్రంగా మారిన హాన్ నది ఇప్పుడు సియోల్ నగరానికి ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా మారింది. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో నాలుగు రోజుల పర్యటన నేపథ్యంలో రెండవ రోజు రాష్ట్ర మంత్రులు, అధికారులు, జర్నలిస్టులు ఆ దేశంలోని చెంగిచియాన్ నది, హాన్ నదుల పునరుజ్జీవ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న నదులు వాటి ప్రక్షాళన, అనంతరం చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే వనరుల పునర్వినియోగంపై రివర్ ఫ్రంట్ అధికారులతో చర్చించారు. సియోల్‌లో నీటి సరఫరా, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న హాన్ నది సియోల్ నగరంలోనే 40 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. పునరుజ్జీవ కార్యక్రమంలో ప్రైవేట్ అభివృద్ధి పనులను నియంత్రించి, పారిశ్రామిక వ్యర్థాలను తగ్గించి, పర్యాటక ప్రదేశాలుగా నది పరిసరాలను అభివృద్ధి చేయడం వంటి చర్యలు సియోల్ నగరపాలక సంస్థ చేపట్టింది. ప్రక్షాళన తర్వాత శుభ్రంగా మారిన హాన్ నది ఇప్పుడు సియోల్ నగరానికి ఒక ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా మారింది. ఈ క్రమంలో దశల వారీగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని, పరీవాహకంలో నివసించే ప్రతి పేదవాడికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. అందరినీ ఒప్పించి, మెప్పించి తరువాయి 2లో

# ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడు దారుణ హత్య






ప్రజాపక్షం /జగిత్యాల రూరల్

జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు అతి కిరతంగా హత్యకు గురయ్యాడు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మరు గంగారెడ్డిని (58) గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. మంగళవారం ఉదయం గ్రామంలో బైటకు వచ్చి ఇంటికి వెళ్ళే క్రమంలో గంగారెడ్డిని కారుతో వెనుక నుంచి ఢీకొట్టి కింద పడగానే కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారని స్థానికులు తెలిపారు. కుటుంబసభ్యులు గంగారెడ్డిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాత పడ్డాడు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్న గంగారెడ్డి హత్య జగిత్యాల జిల్లాలో కలకాలం రేపింది. విషయం తెలుసుకున్న జీవన్‌రెడ్డి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరువాయి 2లో

## తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నా

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీలో నా స్థానం ప్రశ్నార్థకంగా మారిందని ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో శాసన, మండలిలో ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం గళమెత్తానని అందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బహుమతిగా తాన అనుచరుడిని కోల్పోవడమేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సరైన సంఖ్యాబలమున్నా బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ఏమిటని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కరీంనగర్ పట్టభద్రుల ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆక్షేపించారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో పార్టీ ఫిరాయింపులను నిలువరించాలని ప్రయత్నించారని చట్టసభల ప్రజా ప్రతినిధులు తరువాయి 2లో




# సమన్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలం

శ్రామిక దళితుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

కూనంనేని సాంబశివరావు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

తరతరాలుగా అణిచివేత, అంటరానితనం, వివక్షకు గురవుతూ, దోపిడి పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన అశేష శ్రామిక దళితుల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా అణగారిన వర్గాలైన దళితుల అభ్యున్నతికి భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులను వారు నేటికీ పొందలేకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెనకబడ్డ వర్గాల హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని,సామాజిక న్యాయం కోసం అవిశ్రాంత ఉద్యమాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో అఖిల భారత దళిత హక్కుల పోరాట సమితి ( ఎఐడిఆర్ఎం) 2వ జాతీయ మహాసభల సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. కె. ఏసు రత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ్మ, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మేడ్చల్ జిల్లా కార్యదర్శి డిజె.సాయిలుగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతీ మనిషికీ ఓటు హక్కు కల్పించడం మహత్తరమైందని, తరువాయి 2లో




# టాలీవుడ్ నిర్మాత శివరామకృష్ణ అరెస్ట్

నకిలీ పత్రాలతో 84 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా

సుప్రీంకోర్టు తీర్పుతో వెలుగు చూసిన వైనం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ప్రయత్నించిన టాలీవుడ్ నిర్మాత శివరామకృష్ణతో పాటు ఆర్కియాలజీ విభాగం సీనియర్ అసిస్టెంట్ కొత్తిని చంద్రశేఖర్‌తో పాటు బిల్డర్ లింగంగౌడ్‌ను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. తరువాయి 12లో

# దోపిడీ కేంద్రాలుగా డయాగ్నోస్టిక్ సెంటర్లు

అవసరం లేకున్నా స్కానింగ్‌కు డాక్టర్ల సిఫార్సు

రూ. 1200 స్కానింగ్‌కు రూ.5వేలు వసూలు

పేదలను నిలువు దోపిడీ చేస్తున్నా పట్టని అధికారులు



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

వరంగల్‌లోని డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లు దోపిడీ కేంద్రాలుగా మారాయి. హాస్పిటల్ లు, వైద్యులు, డయాగ్నోస్టిక్ కేంద్రాలు కలిసి ప్రజలను నిలువునా దోచుకుంటున్నాయి. రోగుల అనారోగ్యం ఆసరాగా తీసుకుని డబ్బు వేట సాగిస్తూ అందినకాడికి దండుకొని భారీగానే వెనకేస్తున్నారు. పలు రకాల రోగాలతో వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగుల వద్ద నుంచి స్కానింగ్, ఎక్స్ రే ,ఇతర పరీక్షల పేరుతో వేలల్లో వసూలు చేస్తూ దోపిడీ దందాను అడ్డగోలుగా కొనసాగిస్తున్నారు. ఈ వసూళ్ల విషయంలో ఎవరిని అడగాలో, ఎవరు నియంత్రిస్తారో తెలియక అడిగినంత సమర్పించుకుని జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే వారు అనారోగ్యం కారణంగా డాక్టర్ చెప్పిన పరీక్షలు చేయించుకోకుంటే ఆసుపత్రి గడప కూడా తొక్కనివ్వరని రోగులు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. వైద్య పరీక్షల రిపోర్ట్ ఆధారంగానే మందులు రాస్తామని చెబు తుండడంతో డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ చెప్పిన చార్జీ చెల్లించి పరీక్షలు చేసుకొని వెళ్లాల్సిన తరువాయి 2లో




# ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి దశల వారీ నిరసనలు

నవంబర్ 7 నుండి జిల్లా సదస్సులు

ఉద్యోగుల జెఏసి తీర్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దశలవారీగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ ,కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ల వరకూ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రాలను అందజేయనున్నారు. జనవరి 3 నుంచి తరువాయి 2లో



బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్' 16వ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి మంగళవారం రష్యా చేరుకున్న చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్. కజాన్‌లో జరిగే మూడు రోజుల సమావేశంలో ఆయన పాల్గొంటారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయి. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న లడఖ్ సరిహద్దుపై ఇరు దేశాలు ఒక అవగాహనకు వచ్చిన నేపథ్యంలో, వీరి భేటీ ప్రాధాన్యతను సంతరించుకోనుంది. కాగా, బ్రిక్స్ కూటమిలో మరో ఐదు దేశాలు, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునెటెడ్ అరబ్ ఎమిరేట్స్, కూడా చేరాయి. మంగళవారం ప్రారంభమైన బ్రిక్స్ సమావేశం ఈనెల 24వ తేదీ, గురువారం వరకూ కొనసాగుతుంది.

ప్రపంచం

# పాకిస్తాన్ న్యాయ వ్యవస్థపై ప్రభుత్వ పెత్తనం?




**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ ప్రధాన న్యాయమూర్తి నియామకాన్ని ఖరారు చేసే అవకాశాన్ని పార్లమెంటు ప్రత్యేక కమిటీ (ఎస్‌పిసి) ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయ వ్యవస్థపై ప్రభుత్వ పెత్తనం పెరుగుతుందనే అనుమానాలకు తాజా పరిణామాలు తావిస్తున్నాయి. కొత్త ప్రధాన న్యాయమూర్తి ఎంపిక కోసం ఏర్పాటైన సమావేశాన్ని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తాహెరిక్ ఎ ఇన్సాఫ్ (పిటిఐ) బహిష్కరించింది. ఆ సమావేశానికి హాజరుకావడం లేదని మంగళవారం ఉదయం ఒక ప్రకటనలో తెలిపింది. పాకిస్తాన్ పార్లమెంటు 26వ రాజ్యాంగ సవరణను ఆమోదించడం ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చకు కారణమైంది. రాజ్యాంగం 175ఎ అధికరణను పార్లమెంటు సవరించింది. సీనియారితో సంబంధం లేకుండా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక చేసే అధికారాన్ని ఎస్‌పిసికి అప్పగించింది. ఇప్పటి వరకూ అమల్లో ఉన్న రాజ్యాంగ నిబంధనల ప్రకారం, సుప్రీం కోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తికి ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలి. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖాజీ ఫయెజ్ ఇసా ఈనెల 25న రిటైర్‌కానుండగా, ఆయన స్థానంలో అందరికంటే సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ మన్సూర్ అలీ షాను నియమించాలి. కానీ, తాజా రాజ్యాంగ సవరణను అనుసరించి ప్రధాన న్యాయమూర్తి పదవికి ముగ్గురు సీనియర్ల పేర్లను ప్రతిపాదిస్తే, వాటిలో ఒక పేరును ఎస్‌పిసి ఎంపిక చేస్తుంది. ఈ క్రమంలోనే జస్టిస్ మన్సూర్ అలీ షాతోపాటు, మరో ఇద్దరు సీనియర్లు జస్టిస్ మునీబ్ అఖ్తర్, జస్టిస్ యాహ్యా అఫ్రిదీ పేర్లను పదవీ విరమణ చేయనున్న ప్రధాన న్యాయమూర్తి ఫయెజ్ ఇసా ప్రతిపాదించారు. ఈ ముగ్గురి నుంచి పార్లమెంటరీ కమిటీ ఒక పేరును ఖరారు చేస్తుంది. ఇలావుంటే, రాజ్యాంగ సవరణ జరగడానికి పూర్వం ప్రధాన న్యాయమూర్తిగా నియమితుడైన వ్యక్తి తన రిటైర్మెంట్ వయసు వరకూ ఆ పదవిలో కొనసాగేవారు. కానీ, సవరణల నేపథ్యంలో, అత్యధికంగా మూడు సంవత్సరాలు మాత్రమే పదవిలో కొనసాగే అవకాశం ఉంది. రిటైర్మెంట్ వయసు మూడు సంవత్సరాలలోపు ఉంటే, నిర్ణీత సమయానికే రిటైర్ అవుతారు. ఒకవేళ మూడేళ్ల కంటే ఎక్కువ సర్వీస్ ఉంటే, బాధ్యతలు స్వీకరించిన తర్వాత మూడేళ్ల వరకే పదవిలో ఉంటారు. ఇలావుంటే, ఈ రాజ్యాంగ సవరణను ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. పిటిఐ ఇప్పటికే ఈ రాజ్యాంగ తీర్మానానికి వ్యతిరేత వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంపికకు సీనియారిటీని పరిగణలోకి తీసుకోకపోవడం, ఎంపిక బాధ్యతను పార్లమెంటరీ కమిటీకి అప్పగించడం, సర్వీసును గరిష్టంగా మూడు సంవత్సరాలుగా నిర్ధారించడం వంటి రాజ్యాంగ సవరణలపై విమర్శలు పెరుగుతున్నాయి. '

## మూసీ పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ పునరుజ్జీవనం చేపడతామని సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి అన్నారు. మూసీ పునరుజ్జీవనం అనేది ఆచరణ సాధ్యమైన ప్రాజెక్టు అన్నారు. బాధితులకు సాయంపై ప్రభుత్వం ముందే ఆలోచించిందన్నారు. సిఎం చేసే పనుల ఫలితాలపై ప్రతిపక్షాలు భయంతో ఉన్నాయన్నారు. పేదల ఇష్టానికి వ్యతిరేకంగా తాము ఏ ఒక్క పనీ చేయట్లేదన్నారు. గత ప్రభుత్వమే పేదలపై ఉక్కుపాదం మోపిందని బిఆర్‌ఎస్‌పై మండిపడ్డారు. 1600 కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. మూసీ బాధితులకు ఆర్థికంగా రూ.2 లక్షల సాయం చేస్తామని, పరీవాహక ప్రజల పునరావాసానికి అండగా ఉంటామన్నారు. ఏ ఒక్కరికీ నష్టం కలిగించే పని ప్రభుత్వం చేయదని స్పష్టం చేశారు. సియోల్‌లో నగరం నడిబొడ్డు నుండి ప్రవహించే చెంగిచియాన్ నది హైదరాబాద్ మధ్యలో ప్రవహించే మూసీ లాగా మురికిమయంగా ఉండేదని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నదిని సియోల్ నగర పాలక సంస్థ ప్రక్షాళనతో అత్యంత సుందర నగరంగా సియోల్ మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తలపెట్టిన మూసినది ప్రక్షాళనతో హైదరాబాదు నగరం మరో సియోల్‌గా మారనుందన్నారు. చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే పునర్వినియోగం ప్లాంట్లను తెలంగాణ ప్రభుఉత్వం నెలకొల్పుతుందని వివరించారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తుకి మూసీ నది ప్రక్షాళన ప్రతిష్టాత్మకంగా సిఎం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. మూసీ నదికి పునర్జీవం పోస్తే హైదరాబాద్ మహానగరం కూడా సియోల్ నగరంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## దశల వారీగా నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

4వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలని, భోజన విరామ సమయంలో ప్లకార్డులను ప్రదర్శించాలని 21న రాష్ట్ర వ్యాప్తంగా మౌన ప్రదర్శనలు నిర్వహించాలని జెఎసి తీర్మానించింది. హైదరాబాద్‌లోని టిఎన్‌జిఒ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ ,కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశనంతరం జెఎసి ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ మీడియాకు వివరాలను వెల్లడించారు. ఈ నెల 28 న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిరి కలిసి జెఎసి కార్యాచరణను, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేయాలని, నవంబర్ 2న అన్ని జిల్లా జెఎసిల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లకు కూడా వినతిపత్రాలను అం దజేయాలని, నవరంబర్ 6న జెఎసి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించాలని, నవంబర్ 7 నుంచి డిసెంబర్ 27 వరకు ఉమ్మడి జిల్లాల స్థాయిలో 'ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధన సదస్సు'లను నిర్వహించాలని జెఎసి నిర్ణయించినట్టు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస్ తెలిపారు. జనవరి 3 నుండి 4 వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు, భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు, జనవరి 21 న రాష్ట్ర వ్యాప్తంగా మౌన ప్రదర్శన, 23 న రాష్ట్ర వ్యాప్తంగా బైక్ ర్యాలీలు,30న రాష్ట్ర వ్యాప్తంగా మానవహార కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ఉద్యోగుల వరకు తీవ్ర ఒత్తిడి వస్తున్న నేపథ్యంలోనే నిరసన కార్యారరణను ప్రకటిస్తున్నామని వివరించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం హయాంలో మొదటి రోజున వేతనాల చెల్లింపు, 2018 సంవత్సరం తర్వాత ఉద్యోగుల బదిలీలను చేపట్టడం,ఉపాధ్యాయుల పదోన్నతులు, నియామకాలు, కొన్ని పెండింగ్ బిల్లులు క్లియరెన్స్,317 జిఒ సమస్యల పరిష్కారానికి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయడం లాంటి ఉద్యోగ అనుకూల విధానాలను జెఎసి స్వాగతిస్తుందని వారు తెలిపారు.

**పెండింగ్ సమస్యలను పరిష్కరించండి**

పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలను వెంటనే విడుదల చేయాలి, బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని, 2022 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేయాలని, ఇకుబేర్ వ్యవస్థను రద్దు చేస్తూ, ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ద్వారా బిల్లులను క్లియర్ చేసే పాత విధానాన్ని పునరుద్ధరించాలని జెఎసి తీర్మానించింది. ధరల పెరుగుదల ప్రకారం 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండవ పిఆర్‌సి సిఫార్సులను అమలుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జిఒ 317ను సమీక్షించి,బాధితులకు న్యాయం చేయాలని, వెబ్‌సైట్ ద్వారా వచ్చిన అన్ని ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో జెఎసి కో ఛైర్మన్లు వి. రవీందర్ రెడ్డి ,జి. సదానందం గౌడ్, జి. జ్ఞానేశ్వర్, ,పి. నాగిరెడ్డి, ఎం. మణిపాల్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, కె. లక్ష్మ య్య,చంద్ర మోహన్, చంద్రశేఖర్ గౌడ్ ,తిప్పర్తి యాదయ్యతో పాటు జెఎసి నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు హాజరయ్యారు.

## దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుని గంగారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు.

**హత్యపై విచారణ చేసి నిందితున్ని కఠినంగా శిక్షించాలి : పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్**

ఎంఎల్‌సి జీవన్ రెడ్డి అనుచరుడు గంగారెడ్డి హత్యపై పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. హత్య విషయం తెలియగానే జీవన్‌రెడ్డికి ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్న ఆయన హత్య ఘటనపై విచారణ చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడు హత్యకు గురి కావడంతో ంఎల్‌సి జీవన్ రెడ్డి తీవ్ర మనస్థాపానికి గురి అయ్యారన్నారు.ఎంఎల్‌సి జీవన్ రెడ్డి బాధలో ఉండి అలా తన ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. పోలీసులతో కూడా తాను మాట్లాడి హత్యకు సంబంధించిన సమాచారం తీసుకున్నానన్నారు.హత్య చేసిన నిందితుడు పోలీసులకు లొంగిపోయాడని తెలిపారు. సీనియర్ మంత్రిగా శ్రీధర్ బాబు ఈ విషయాన్ని పరిశీలిస్తున్నారని మీడియాకు తెలిపారు.

## డయాగ్నోస్టిక్స్ సెంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

దుస్థితి నెలకొంది. స్కానింగ్ పరీక్షల ధరల విషయంలో ఏమాత్రం మార్పు ఉండదు కనుక అడిగింది చెల్లిస్తేనే వైద్య పరీక్షలు చేస్తారని, పీజు ఎంతో చెప్పే వారికి వారు చెప్పిందే తడువుగా పీజు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఇటీవల నగరంలోని డయాగ్నోస్టిక్స్ సెంటర్ ల అడ్డగోలు దందాను పొలిటికల్ వైబ్స్ ఛానల్ స్టింగ్ ఆపరేషన్ లో మొత్తం బట్టబయలు చేసింది. వైద్య పరీక్షల కోసం వెలితే కాస్త పీజు తగ్గించమని అడిగితే కిందా మీద చూసి కుదరదని కటువగా చెప్పి ఇష్టమైతే చేయించుకోండి లేదంటే వెళ్ళండి అని చెప్పే డయాగ్నోస్టిక్స్ పనికిమాలిన దందా ఊ స్టింగ్ ఆపరేషన్ లో బయట పడింది. ఊరు పేరు లేని ఆసుపత్రి పేరుతో ఫలానా డాక్టర్ రెఫర్ చేశారని చెపితే చాలు డాక్టర్ కమీషన్ గూర్చి, డయాగ్నోస్టిక్స్ కు మిగిలే దాని గూర్చి డయాగ్నోస్టిక్స్ ప్రతినిధులు పూసగుచ్చినట్లు చెబుతూ అడ్డంగా బుక్కైయ్యారు.ఫలానా స్కానింగ్ కావాలి అని అడిగితే ఐదు వేలు అవుతుందని చెప్పిన డయాగ్నోస్టిక్స్ ప్రతినిధులు అందులో డాక్టర్ కు కొందరు 3800 కమిషన్ అంటూ ఇంకొందరు 3000 కమిషన్ అంటూ ఆఫర్ ల మీద ఆఫర్లు ఇచ్చారు. ఈ కమిషన్ ఎప్పుడు ఇస్తారు?అని అడిగితే కొందరు నెల వారిగా అంటే,ఇంకొందరు వెంటనే ఫోన్ పే చేస్తామంటే ఇంకొందరు ఆసుపత్రికి నేరుగా వచ్చి నగదు పువ్వుల్లో పెట్టి అప్పగిస్తామని చెప్పారు. కాగాచిన్న జ్వరం తో వెళ్లినా టెస్టులు చేయించడం తప్పనిసరి అన్నట్లు కొందరు వైద్యులు మారిపోయారు. అవసరం ఉన్న లేకున్నా ఎడాపెడా టెస్టులు రాస్తూ రోగి జేబు గుల్ల చేస్తున్నారు. ఇదేదో రోగి ఆరోగ్యంగా ఉండాలనే సద్దుదేశంతో కాకుండా కేవలం డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ నుంచి వచ్చే కమిషన్ల కోసం ఇలా అనవసర టెస్టులు రాస్తున్నారని పొలిటికల్ వైబ్స్ ఛానల్ స్టింగ్ ఆపరేషన్ ద్వారా స్పష్టం ఐయింది. కొన్ని డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ డాక్టర్ల కు ఇచ్చే కమిషన్లు "అసలు కంటే కొసరు ఎక్కువ" అన్నట్లు ఉన్నాయిస్కానింగ్ కు ఐదు వేల రూపాయలు చెప్పిన ఓ డయాగ్నోస్టిక్స్ సెంటర్ ప్రతినిది అందులో రెఫర్ చేసిన డాక్టర్ కు 3800 కమిషన్ అని చెప్పాడు అంటే కేవలం స్కానింగ్ పీజు 1200అన్నట్లుకు వీటిలో రోగి వద్ద నుంచి అదనంగా 3800 వసూలు చేసి డాక్టర్ ను డయాగ్నోస్టిక్స్ ప్రతినిధులు ప్రసన్నం చేసుకుంటున్నారన్నది స్పష్టం అయింది. రోగి డాక్టర్ ను సంప్రదించిన ఖర్మానికి మనకు తెలియకుండానే మన జేబు నుంచి కమిషన్ పేరుతో 3800 లాగేస్తున్నట్లు తేలింది. ఇలా కాసుల కోసం డాక్టర్లకు ఆఫర్స్ ఇస్తూ ఆ డబ్బులు రోగుల వద్ద నుంచి ముక్కు పిండి వసూలు చేస్తూ తమ దోపిడీ దందా ను డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ యధేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. హన్మకొండ నగరంలో ఉన్న రాడార్, సూర్య, స్టార్(కనెక్ట్) లాంటి డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ ఈ దందా లో అగ్ర భాగాన నిలిచినట్లు చెబుతున్నారు. అంతేకాదు తాము గొప్ప అని చెప్పుకునే కొన్ని డయాగ్నోస్టిక్స్ సంస్థలు సైతం పి ఆర్ ఓ లను నియమించుకొని మరి కమిషన్ దందా కొనసాగిస్తున్నట్లు తెలిసిందిమీకింత మాకింత అనే ట్యాగ్ లైన్ తో రోగులను దోచుకుంటున్నట్లు తెలిసింది.ఇంత జరుగుతున్నా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా జనం జేబులు కొల్లగొడుతున్న వైద్యులు, ఆసుపత్రులు, డయోగ్నస్టిక్ సెంటర్ లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వాలు విఫలం

(మొదటి పేజీ తరువాయి)

అయితే సమ న్యాయం చేయడంలో మాత్రం ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆయన మండిపడ్డారు. దేశవ్యాప్తంగా దళిత సామాజిక న్యాయంకోసం, విద్యా, వైద్య వ్యాపారాన్ని రద్దు చేయాలని, అవినీతికి వ్యతిరేకంగా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలని అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం పోరాడడం అభినందనీయమన్నారు. 2025 జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైదరాబాదులో నగరంలో జరగనున్న అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం 2వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులకు కనీస రక్షణ కూడ లేకుండ పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రధాని అయిన తర్వాత దేశంలోసుమారు రెండు లక్షల దాడులు జరిగినట్టు కేంద్ర సామాజిక న్యాయ శాఖ ప్రకటించిందని తెలిపారు.. ప్రతీ చిన్న విషయంలోను దళితులనే టార్గెట్ చేయడం బీజేపీ పాలనలో పరిపాటిగా మారిందని, దేశాన్ని విస్మయానికి గురి చేసిన గిరిజనుడిపై మూత్ర విసర్జన, మణిపూర్లో ఇద్దరు గిరిజన యువతులను వివస్త్రలుగా చేసి ఊరేగించిన ఘటన వంటివన్నీ ఇందులో భాగమే అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులపై ఇప్పటికి ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం దుర్మార్గమన్నారు. అదే సనాతన ధర్మం అంశంలో మాత్రం దాడులు తిప్పి కొట్టాలంటూ దేశ ప్రజలను రెచ్చగొట్టడుతున్నారని మండిపట్టారు. ఈసమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారూపాక అనిల్ కుమార్, తాళ్లపల్లి లక్ష్మ ణ్, సలిగంటి శ్రీనివాస, కే రత్నకుమారి, కె. సహదేవ్, ఎ.రాజ్ కుమార్, జె.కుమార్, కె. రాజరత్నం, టి.రామకృష్ణ, బి.లక్ష్మీ పతి, ఉష్రశీ,దేవి పోచన్న తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్‌లో మత సామరస్యాన్ని కాపాడుకుందాం**

హైదరాబాద్ మహానగరంలో మతసామరస్యాన్ని కాపాడుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సికిందరాబాద్ దేవాలయంలో విగ్రహం ధ్వంసం చేసిన ఘటన అత్యంత విచారకరమన్నారు. ఘటన చోటు చేసుకుని వారం రోజులు దాటినా ఇంకా ఉద్రిక్తతలు కొనసాగడం దురదృష్టకరమని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనకు కారణమైన వారితో పాటు వారి వెనుక శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మతాల మధ్య విద్వేషాలు పెరగకుండా అన్ని మతాల పెద్దలు చొరవ చూపాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు. మత మౌఢ్యంతో వ్యవహరించే వారు ఏ మతస్తులైనా వదిలిపెట్టవద్దని ప్రభుత్వానికి సూచించారు. అన్ని మతాల వారితో శాంతి కమిటీలు వేసి ప్రజల్లో సామరస్యం పెంపొందించే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గడిచిన రెండు దశాబ్దాలకుపైగా హైదరాబాద్ నగరంలో హిందూ ముస్లింలు సామరస్యంతో మెలుగుతున్నారని, దీనిని ఎప్పటికీ ఇలాగే కొనసాగేలా మత పెద్దలు, మేధావులు కృషి చేయాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

## తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నా

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ పిరాయిస్తే సభ్యత్వం రద్దు చేస్తామని కాంగ్రెస్ అధినేత రాహుల గాంధీ సైతం పేర్కొన్నారని, అందుకు భిన్నంగా తెలంగాణలో 65 మంది, కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, సిపిఐ ఎంఎల్ఎ ఒకరున్నా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన బిఆర్‌ఎస్ పార్టీ ఎంఎల్‌ఎలను కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు తీసుకుంటున్నారో అర్థం కావడంలేదని, దాంతో స్థానికంగా కరుడు కట్టిన కాంగ్రెస్ కార్యకర్తలు ఇబ్బందులు ఎదురువుతున్నాయని జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు జాబతాపూర్ మాజీ సర్పంచ్ మారు గంగారెడ్డి దారుణహత్యకు గురికాగా హత్యను నిరసిస్తు జగిత్యాల ఓల్డ్ బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి 4 గంటలపాటు బైఠాయించి నిరసన తెలిపారు. ఎంఎల్‌సికి మద్దతుగా ప్రభుత్వ విప్ ధర్మపురి ఎంఎల్ఎ అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ నిరసనలో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ నిరసన చేస్తున్న ఎంఎల్‌సి వద్దకు వచ్చి నిందితుడిని పట్టుకున్నామని తెలపడంతో నిరసన విరమించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నా నాలబై ఏండ్ల రాజకీయ, ప్రజా జీవితంలో ఇటువంటి సంఘటన చూడలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటే కాంగ్రెస్ కార్యకర్త హత్యగావింపబడడం చూస్తుంటే బిఆర్‌ఎస్ రాజ్యమా... కాంగ్రెస్ రాజ్యం నడుస్తుందా తెలియడంలేదన్నారు. గత మూడు నెలలుగా తాను మానసిక క్షోభ అనుభవిస్తున్నానని పదేళ్లు ప్రతిపక్షంలో ఉండి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన పార్టీ ఫిరాయింపుల ప్రోత్సాహంతో కార్యకర్తలకు న్యాయం చేయలేకపోతున్నారని జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాలో కేవలం జగిత్యాల నుండి నేనొక్కడినే కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎంఎల్‌ఎగా ఎన్నికయ్యానని అలాగే 2019లో పట్టభద్రుల ఎంఎల్‌సి గా శాసన మండలిలో కాంగ్రెస్ పార్టీ పక్షాన ఒక్కడినే ఎన్నికై శాసనసభ, మండలిలో ప్రభుత్వం వ్యతిరేక విధానాలను ఎండగడుతూనే పార్టీ క్యాడల్‌లో జోష్ నింపారని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు తుదకు తాను సైతం మూడు నెలలుగా నైరాశ్యంలోకి వెళ్లామని నేడు కరుడు కట్టిన కాంగ్రెస్ నాయకుడైన గంగారెడ్డి మృతితో కుటుంబ సభ్యుడిని కోల్పోయానని భావోద్వేగంతో మాట్లాడారు. ఒకదశలో గంగారెడ్డి హత్య విషమం గురించి వివరాలు తెలుసుకుందామని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి ఫోన్ చేయగా తాన 40 ఏండ్ల రాజకీయానికి కాంగ్రెస్ పార్టీ మంచి బహుమతి ఇచ్చిందని, మీ పార్టీకి , మీకు ఓ దండం ఇకనైనా బతక నివ్వండి అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోను కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని పార్టీలోనే కొనసాగుతానని అధిష్టానానికి తన ఆవేదన మాత్రమే తెలుపుతున్నాని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జీవన్‌రెడ్డి పోలీసులను డిమాండ్ చేశారు.

## కార్పొరేట్స్ గుప్పెట్లో మీడియా

(మొదటి పేజీ తరువాయి)

చిక్కుకున్న మీడియా పెరుగుతున్న ధరలు, మైనారిటీల అణచివేత, వివక్ష, మణిపూర్‌లో ఎడతెగనిహింస వంటి సమస్యలను వదిలిపెట్టేసిందని విమర్శించారు. వార్తా ప్రచురణ, సమస్యలను ప్రతిబింబించడంలో ఒకప్పుడున్నస్వేచ్ఛను పత్రికాసంపాదకులు క్రమంగా కోల్పోవడంవల్ల పత్రికలు ప్రజాసమస్యలకు దూరమవుతున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఇష్టాగోష్ఠి చేసిన ప్రముఖ పాత్రికేయులు దేశాన్ని పట్టిపీడిస్తున్న ప్రధానసమస్యలపై ప్రశ్నించకుండా వ్యక్తి ఆరాధన పెంచేవిధంగా ప్రశ్నలు వేయడమే ఇందుకు ఒక ఉదాహరణ అని, ఆ సమయంలోనే మోదీ తనను తాను దైవాంశ సంభూతుడుగా అభివర్ణించుకున్నారని గుర్తుచేశారు. మహిళల సమస్యలపై మోదీని నిలదీసిన వైట్‌హౌస్ రిపోర్టర్ సబ్రినా సిద్ధిఖీని ఆ తర్వాత కాషాయసైన్యం వేధింపులకు గురిచేసిందని గుర్తుచేశారు. పార్టీలవారీగా విడిపోయిన పత్రికలు ప్రజాసమస్యలను ప్రతిబింబించడంలేదని విమర్శించారు. ఈ పూర్వరంగంలో 'ప్రజాపక్షం' దినపత్రిక మతోన్మాదానికీ, ఎజెండాలకు అతీతంగా అన్నిరకాల వార్తలూ ప్రచురిస్తూ ప్రగతిశీలభావాలను ప్రతిబింబిస్తూ ప్రజాచైతన్యంకోసం కృషి చేస్తోందన్నారు. 'ప్రజాపక్షం' పత్రిక భావజాల ఔచిత్యం, చెల్లుబాటు ఈనాటికీ, ఏనాటికీ కూడా చెక్కుచెదరదన్నారు. వ్యక్తులు నడిపే యూట్యూబ్ ఛానళ్ళకు లక్షలాదిమంది వీక్షకులు తయారయ్యారన్నారు. ఒక మంచి పత్రికను నడిపేందుకు ప్రజా విరాళాల సేకరణ తప్పుకాదని, 'ప్రజాపక్షం' వంటి పత్రికలు ఆర్థిక పరిపుష్ఠి సాధించి ముందుకు సాగాలని కె.రామచంద్రమూర్తి ఆకాంక్షించారు. నవచేతన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నాగోల్ బండ్లగూడలోని 'గిరిప్రసాద్ భవన్'లో మంగళవారం సాయంత్రం ''ప్రజాపక్షం'' దినపత్రిక ఆరవ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షుడు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో సిపిఐ జాతీయ సమితి కార్యవర్గసభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడా వెంకటరెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సిపిఐ తెలంగాణ రాష్ట్రసమితి కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ఆత్మీయ అతిథులుగా హాజరై ప్రసంగించారు. 'ప్రజాపక్ష' దినపత్రిక సంపాదకులు మక్కెన సుబ్బారావు ముఖ్యఅతిథి కె.రామచంద్రమూర్తిని సభకు పరిచయం చేశారు. 2018లో ప్రారంభమైన 'ప్రజాపక్షం' పత్రికను కంటికి రెప్పలా కాపాడుతున్న పార్టీ నాయకత్వానికీ, సిబ్బందికీ ఆయన శుభాకాంక్షలూ, అభినందనలూ తెలియజేశారు.

నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి, కోశాధికారి వి.రత్నాకరరావు, జనరల్ మేనేజర్ ఎన్.మధుకర్, అడ్వర్టయిజ్‌మెంట్ జిఎం వి.మదన్, పత్రిక కార్యనిర్వాహక సంపాదకుడు బొమ్మగాని కిరణ్ కుమార్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు. 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రకటనల విభాగం జనరల్ మేనేజర్ వి.మదన్ తొలుత సభకు స్వాగతం పలికారు. బొమ్మగాని కిరణ్ కుమార్ వందన సమర్పణ చేశారు. 'ప్రజాపక్షం'ఆరవ వార్షికోత్సవం సందర్భంగా ప్రజానాట్యమండలి గాయకుడు పల్లె నర్సింహ రచించిన ప్రత్యేకగీతాన్ని ఆయన ఆలపించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఈటి నర్సింహ, కార్యవర్గసభ్యులు రవీంద్రాచారి, ప్రేమపావని (ఎఐటియుసి), సదానంద్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి (ఎస్‌టియు), నళిని (ప్రజానాట్యమండలి), వి.చెన్నకేశవరావు (సి.ఆర్.ఫౌండేషన్), కె.వి.ఎల్ (ఐప్సో), సిపిఐ హైదరాబాద్ నగర కార్యదర్శి ఛాయాదేవి తదితరులు హాజరయ్యారు.

**సత్కారాలు**

'ప్రజాపక్షం' దినపత్రిక ఆరవ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ముఖ్య అతిథి కె.రామచంద్రమూర్తిని నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్ బాడీ సభ్యులు తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఆత్మీయ అతిథి కె.శ్రీనివాసరెడ్డిని గవర్నింగ్ బాడీ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ సత్కరించగా, కూనంనేని సాంబశివరావును గవర్నింగ్ బాడీ సభ్యులు కలవేన శంకర్ సత్కరించారు. మరో గవర్నింగ్ బాడీ సభ్యురాలు ఎన్.జ్యోతి చాడా వెంకటరెడ్డిని శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. అదేవిధంగా 'ప్రజాపక్షం' పత్రిక సంపాదకులు మక్కెన సుబ్బారావును గవర్నింగ్ బాడీ సభ్యులు వి.ఎస్.బోస్, బి.ఎస్.ఆర్ మోహన్‌రెడ్డిలు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

**పాత్రికేయులకు బహుమతులు**

'ప్రజాపక్షం' దినపత్రిక అభ్యున్నతికి కృషి చేసిన పాత్రికేయులకు ఈ వార్షికోత్సవం సందర్భంగా నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సూర్యాపేటకు చెందిన ప్రజాపక్షం పత్రిక పాత్రికేయులు తోట నర్సయ్యకు ముఖ్యఅతిథి కె.రామచంద్రమూర్తి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ప్రథమ బహుమతిగా నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. రంగారెడ్డిజిల్లాకు చెందిన ప్రజాపక్షం ప్రతినిధి సిహెచ్.జంగయ్యను కూడా రామచంద్రమూర్తి శాలువా,జ్ఞాపికలతో సత్కరించి ద్వితీయ బహుమతిగా నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. కాగా దినపత్రికల్లో గ్రామీణ పాత్రికేయులు రాసిన ఉత్తమ వార్తలు, కథనాలకు ప్రోత్సాహకాలను కూడా అందజేశారు. మంచిర్యాలజిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన 'ప్రజాపక్షం' పాత్రికేయుడు సతీశ్‌ను ఆత్మీయ అతిథి కూనంనేని సాంబశివరావు శాలువా,జ్ఞాపికలతో సత్కరించారు. ప్రథమ బహుమతిగా నగదు పురస్కారాన్ని అందజేశారు. భూపాలపల్లిజిల్లా చిట్యాల పాత్రికేయుడు ఐలయ్యను చాడా వెంకటరెడ్డి శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ద్వితీయ బహుమతిగా నగదు పురస్కారాన్ని అందజేశారు. వికారాబాద్‌జిల్లా ప్రజాపక్షం పత్రిక ప్రతినిధి రవీందర్‌ను పత్రిక సంపాదకుడు మక్కెన సుబ్బారావు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. తృతీయ బహుమతిగా ఆయనకు నగదు పురస్కారాన్ని అందజేశారు.

### వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారు : కె.శ్రీనివాసరెడ్డి

కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోరే 'ప్రజాపక్షం' వంటి భావజాల పత్రికకు మార్కెట్ వ్యవస్థలో ప్రోత్సాహం ఉండదని, శ్రేయోభిలాషుల ప్రోత్సాహంతోతప్ప ఆర్థికబలంతో ఇలాంటి పత్రికలు నడవడంలేదన్నారు. సిద్ధాంతానికి కట్టుబడి జర్నలిస్టులు స్వేచ్ఛగా పనిచేయగలిగేది ఇలాంటి పత్రికలలోనేనన్నారు. పత్రికలపై పాఠకులు, ఇతరులు చేసే ఫిర్యాదులను పరిశీలించేందుకు, సమస్యల పరిష్కారానికి స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన దేశ అత్యున్నతమైన చట్టబద్ధ సంస్థ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) ప్రమాణాలను కేంద్ర ప్రభుత్వం దిగజార్చిందని విమర్శించారు. సెంట్రల్ అక్రెడిటేషన్ కమిటీ ఎంపిక ప్రక్రియను ఉల్లంఘించారని, లౌకికవాదాన్ని ప్రశ్నించేవారు తయారయ్యారన్నారు. 1952లో ఏర్పడిన వర్కింగ్ జర్నలిస్టుల చట్టానికి అనుగుణంగా ఉన్న వేతన వ్యవస్థ విధానాన్ని తొలగించారని, వర్కింగ్ జర్నలిస్టుల చట్ట ప్రత్యేకతను నీరుగార్చి లేబర్ కోర్టుకు తెచ్చి మెడికల్ రిప్రజెంటేటివ్‌ల స్థాయికి దిగజార్చారని విమర్శించారు. పదేళ్ళుగా దేశంలో శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలను క్రమపద్ధతిలో అర్థం చేసుకోడానికి కూడా అవకాశం లేని రీతిలో నిర్వీర్యం చేశారని, ఇక న్యాయవ్యవస్థను కూడా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ దశలో పత్రికలు గతంలో లాగా కాకుండా ఎంతో సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. ముఖ్యంగా దేశ యువతరాన్ని లక్ష్యంగా చేసుకుని వామపక్ష ప్రగతిశీల భావాలను అన్వయింపజేసే వార్తలను, వార్తాకథనాలను వ్యాప్తిలోకి తీసుకురావాలని అప్పుడే పత్రిక ఆశయం సిద్ధిస్తుందని కె.శ్రీనివాసరెడ్డి కోరారు.

### ప్రతివ్యక్తీ శాస్త్రీయ దృక్పథంగల పత్రికలు చదవాలి : కూనంనేని

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, మతం పేరుతో మారణహోమం జరగకూడదంటూ అవినీతిని, మతోన్మాదం ముప్పును వెలుగులోకి తెచ్చి సమాజమంటే 'ఇలా' ఉండాలని తెలియజెప్పే 'ప్రజాపక్షం' వంటి పత్రికలు ఇంకా మిగిలే ఉన్నాయని అన్నారు. చాలా పత్రికలలో పనిచేసే సిబ్బంది వామపక్ష భావజాలం ఉన్నవారేననీ, వారు లేకపోతే రాజ్యహింస పేట్రేగి ఇంకా కొనసాగుతుందన్నారు. సాయిబాబాకు జరిగిన అన్యాయాన్ని చీకటిలో కాంతిరేఖలా ప్రజాపక్షం వంటి పత్రికలే వెలుగులోకి తెచ్చాయన్నారు. ఏ మతం వారైనా ప్రజల్లో రాజ్యాంగస్ఫూర్తిని నింపేవి పత్రికలేనన్నారు. ప్రతి ఒక్కరూ ఒక గంటసేపు పత్రికలు ముఖ్యంగా శాస్త్రీయదృక్పథంగల వామపక్ష పత్రికలను అధ్యయనం చేయాలని, అప్పుడే ప్రతివ్యక్తీ సమాజానికి వెలుగురేఖగా మారతారన్నారు. ప్రతి మనిషిలో ఉండే ప్రశ్నించే గుణానికి దిశ,దశ,సైద్ధాంతిక మార్గాన్ని ఇచ్చేది 'ప్రజాపక్షం' పత్రికేనన్నారు. పత్రిక లేకపోతే విజ్ఞానవ్యాప్తి జరగదని, విజ్ఞానం లేనివారు సమాజంలో అభ్యుదయవాదులుగా మనజాలలేరన్నారు. స్వయంగా తాను 'విశాలాంధ్ర' పత్రిక అధ్యయనం ద్వారా ఒక కార్యకర్తగా, నాయకుడుగా ఎదిగానన్నారు.'ప్రజాపక్షం' పత్రికలో రాసే ప్రతివాక్యం, ప్రతి వార్తా, ప్రతి కథనం ప్రజలకోసమేనని, ఆస్తులు అమ్ముకుని ఎన్నో త్యాగాలు చేసి మన పెద్దలు 'విశాలాంధ్ర' వంటి వామపక్ష ఉద్యమ పత్రికలను నడిపించారని, ప్రజాపక్షం పత్రిక అదేతీరుగా అభివృద్ధి చెందుతుందన్నారు.

**ప్రతిబింబించాలి : చాడ**

'ప్రజాపక్షం' పత్రిక గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను ప్రతిబింబించాలని, పత్రికకు మరింత పదును పెట్టాలని, అందుకోసం ఇంకా విశేషమైన కృషి జరగాలని చాడ వెంటకరెడ్డి అన్నారు. పాలకవర్గం పట్టుదల, సిబ్బంది సంకల్పశుద్ధివల్ల పత్రిక నిలదొక్కుకుని ముందుకు కొనసాగుతోందన్నారు. నవచేతన విజ్ఞాన సమితి, పత్రిక ఆవిర్భావంకోసం పార్టీ నాయకులు చేసిన కృషిని ఆయన గుర్తుచేశారు. ఒక క్రియాశీల కార్యాచరణ ద్వారా తిరుగులేని 'ప్రజాపక్షం'గా పత్రికను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

## కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జైళ్ల శాఖ డిజిపి సౌమ్యమిశ్రా

కొత్త చట్టాలపై శిక్షణా కార్యక్రమం



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** మారిన చట్టాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని జైళ్ల శాఖ డిజిపి సౌమ్యమిశ్రా పేర్కొన్నారు. మంగళవారం చంచల్‌గూడలోని జైళ్ల శాఖ ప్రధాన కార్యాలయంలో న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సహకారంతో తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 'జైలు సంబంధిత విషయాలపై కొత్త క్రిమినల్ చట్టాలకు సంబంధించి జైలు అధికారుల సెన్సిటైజేషన్ 2023' అనే అంశంపై మూడు రోజుల శిక్షణా కోర్సును సౌమ్యమిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌమ్యమిశ్రా మాట్లాడుతూ.. తెలంగాణ జైళ్ల శాఖ తమ సిబ్బంది జ్ఞానం, నైపుణ్యాలను నిరంతరం పెంపొందించడానికి కృషి చేస్తుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా కొత్త చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ఉండేలా ఒక ముఖ్యమైన దశ అని అన్నారు. నవీకరించబడిన చట్టాలపై జైలు అధికారులు బాగా ప్రావీణ్యం కలిగి ఉండవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'ఇటీవలి సంస్కరణలు క్రిమినల్ లాలో మన న్యాయ వ్యవస్థను వేగంగా మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా చట్టాలను మార్చడం జరిగిందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం గురువారం వరకు కొనసాగుతుందన్నారు. శిక్షణా కోర్సు కోసం వివిధ రాష్ట్రాల నుండి మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ నుండి జైలు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత 2023 (భారత శిక్షాస్మృతి, 1860 స్థానంలో), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023 (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 స్థానంలో), భారతీయ సాక్ష్య అధినియం 2023 (భారత సాక్ష్యాధారాల చట్టం, 1872 స్థానంలో)పై అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. కొత్త చట్టాలకు అనుగుణంగా ఖైదీల హక్కులను నిర్ధారించడంపై జైలు అధికారులకు ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ అధికారులతో పాటు, న్యాయనిపుణులు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రాంగణంలోకి మూడు నెలల్లో..

## అందుబాటులోకి శాసనమండలి భవనం

మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అసఫ్ జాహీల నిర్మాణ శైలితో ఉన్న అసెంబ్లీ పాత భవనాన్ని అదే నిర్మాణ కౌశలంతో అద్భుతంగా పునరుద్ధరిస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. వచ్చే మూడు నెలల్లో అసెంబ్లీ పాత భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, ఎక్కడా చారిత్రక వైభవానికి ఇబ్బందులు లేకుండా భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆగాఖాన్ ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. స్పీకర్ చాంబర్‌లో మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాష్‌తో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలోని హెరిటేజ్ భవనమైన పాత అసెంబ్లీ భవన పునర్నిర్మాణంపై ఇద్దరు మంత్రులు సమీక్షించారు. భవనాన్ని పునర్నిర్మిస్తున్న ఆగాఖాన్ ప్రతినిధులు, రోడ్లు, భవనాల శాఖ అధికారులు, అసెంబ్లీ సెక్రెటరీ నర్సింహాచార్యులు సమావేశంలో పాల్గొన్నారు. భవనానికి కావల్సిన ఎలక్ట్రిఫికేషన్ వ్యవస్థ, ప్లంబింగ్ పనులపై టెండర్లు పిలవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశంలో పాల్గొన్న రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందనకు ఆదేశాలు జారీ చేశారు. ఆగాఖాన్ ట్రస్ట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.2కోట్ల నిధులను సమావేశం నుంచే ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి అప్పటికప్పుడే విడుదల చేయించారు. బిల్లుల కోసం ప్రజోపయోగమైన పనులు ఆపొద్దని అధికారులకు మంత్రి సూచించారు. అసెంబ్లీ హెరిటేజ్ భవనం అందుబాటులోకి వస్తే శాసనమండలిని అసెంబ్లీ భవన ప్రాంగణంలోకి మార్చవచ్చని, పార్లమెంట్ తరహాలో వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు అసెంబ్లీ మరింత చెరువ అవుతుందని ఆయన తెలిపారు. పార్కింగ్, సెక్యూరిటీ సిబ్బందికి ప్రత్యేక గదులను నిర్మించాల్సిన అవసరం ఉందని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రత్యేకంగా ఒక ఎస్‌ఇ స్థాయి అధికారిని నియమించి పనులు వేగంగా కొనసాగే విధంగా, అలసత్వానికి తావులేకుండా పర్యవేక్షించాలని స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందనకు ఆదేశాలు జారీ చేశారు. లోక్‌సభ, రాజ్యసభలో ఉన్నట్టుగానే అసెంబ్లీ భవన ప్రాంగణంలోనే సెంట్రల్ హాల్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. అసెంబ్లీకి అవసరమైన నెట్‌వర్కింగ్ సేవలను అందించేందుకు కావాల్సిన ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే ఆమోదం తెలుపుతానని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

'ముత్యాలమ్మ' ఘటనను

## ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది

ప్రజలు సంయమనంతో ఉండాలి : మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్‌లోని దేవాలయంలో 'ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం' ఘటనను రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ అన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే నిందితుడిని అరెస్టు చేశామని గుర్తుచేశారు. నిందితునికి చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సర్కారు చేతల ప్రభుత్వమని, మాటల ప్రభుత్వం కాదని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ గంగా జమునా సంస్కృతికి విఘాతం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ఎవరూ దేవాలయాలపై రాజకీయాలు చేయవద్దని మంత్రి సురేఖ విజ్ఞప్తి చేశారు. దైవాన్ని మతాల ప్రాతిపదికన విభజించవద్దని హితవు పలికారు. చారిత్రకమైన హైదరాబాద్ నగరం మత సామరస్యతకు, సర్వమతాల సంరక్షణకు ఆలవాలంగా ఉండి, గంగా జమునా తెహజీబ్‌ను కాపాడుకుంటూ వస్తుందని మంత్రి సురేఖ అన్నారు. ఈ ఘటనలో కొంతమంది అల్లరి మూకలు చేరి, మతసామరస్యతకు భంగం కలిగేలా చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయం చేయడం సరికాదన్నారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా చర్యలు చేపట్టిందని అన్నారు. సంఘటన జరిగిన వెంటనే అక్కడికి దేవాదాయ శాఖ అధికారులను పంపించి సమగ్ర వివరాలు సేకరించినట్టు మంత్రి తెలిపారు. ఘటన జరిగిన వెంటనే నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. మిగతా పార్టీల మాదిరి తాము గుడులపై, ప్రజల నమ్మకాలపై రాజకీయాలు చేయదలుచుకోలేదని మంత్రి స్పష్టం చేశారు. బుధవారం దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శించాలని ఆదేశించినట్టు మంత్రి సురేఖ వెల్లడించారు. ఇటువంటి ఘటనల పట్ల దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంయమనం పాటించాలని, హైదరాబాద్ నగర మత సామరస్యాన్ని కాపాడాలని మంత్రి సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు.

## మీడియా తీరు మారుతుంది

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా మారాలి

ప్రజాపక్షం వార్షికోత్సవ సభలో పువ్వాడ

**ప్రజాపక్షం / ఖమ్మం :** ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా తీరు మారిందని ప్రజా సమస్యల ప్రస్థావన స్థానే స్వవిషయాలు మీడియా ఎజెండాగా మారుతున్నాయని సిపిఐ సీనియర్ నాయకులు, శాసన మండలి మాజీ సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతూ ప్రజా అనుకూల కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకు రావాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. ప్రజాపక్షం ఆరవ వార్షికోత్సవ సందర్భంగా పువ్వాడ సిపిఐ నాయకులు ప్రజాపక్షం బాధ్యులతో కలిసి మంగళవారం గిరిప్రసాద్ భవన్‌లో కేక్ కట్ చేశారు.




ఈ సందర్భంగా ప్రజాపక్షం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో పువ్వాడ మాట్లాడుతూ ఒక ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజాపక్షం పత్రికను స్థాపించాల్సి వచ్చిందన్నారు. వామపక్ష గొంతుకగా ప్రజాపక్షం పనిచేస్తుందని పత్రిక నిర్వహణ కష్టతరమమైన నేటి పరిస్థితుల్లోను ప్రజాపక్షాన్ని నిర్వహిస్తున్నామని పువ్వాడ తెలిపారు. రాజకీయ రంగంతో పాటే మీడియా రంగంలోను పలు మార్పులు వచ్చాయని ఇటువంటి పరిస్థితుల్లో నికరంగా ప్రజల పక్షాన నిలబడిన ఏకైక పత్రిక ప్రజాపక్షమన్నారు. సభలో నవచేతన విజ్ఞాన సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రజాపక్షం ప్రారంభమైన కొద్ది రోజులకే కరోనా ప్రారంభమైందని అయినా పాఠకుల మద్దతుతో ప్రజాపక్షం నిలదొక్కుకున్నదన్నారు. ప్రజల సమస్యలే ప్రజాపక్షానికి వార్తలని ఆ వార్తల ద్వారా ప్రజాపక్షం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కార్పోరేషన్‌లో సిపిఐ పక్ష నాయకులు బిజి క్లైమెంట్, పోటు కళావతి, ప్రకటనల విభాగం మేనేజర్ టికె ప్రసన్నన్, టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల వెంకటేశ్వర్లు, కనకం సైదులు, ప్రజాపక్షం బాధ్యులు పి. సత్యనందబాబు, కె. ప్రసాదరావు, కె. శ్రీనివాసరావు, కృష్ణార్జున్, బి. అశోక్, శ్రీకాంత్, జోషి, రాంబాబు, రమేష్, ఆంజనేయులు, ఈశ్వర్, పవన్, నరేష్, ఉపేందర్, నాగబాబు, రాజు, మోహన్, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరాటాలకు, అస్తిత్వ ఉద్యమాలకు

## కొమురం భీమ్ గొప్పస్ఫూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంధకారపు అణచివేత పొరలను చీలుస్తూ ఉదయించిన ఆదివాసీ వీరుడు కొమురం భీమ్ అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నేడు కొమురం భీమ్ జయంతి సందర్భంగా సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంత్రి సురేఖ కొమురం భీమ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఆత్మగౌరవ పోరాటాలకు, అస్తిత్వ ఉద్యమాలకు కొమురం భీమ్ గొప్ప స్ఫూర్తినిచ్చాడని మంత్రి సురేఖ తెలిపారు. కొమురం భీం ఇచ్చిన జల్, జంగల్, జమీన్ నినాదమే తెలంగాణలోని సబ్బండవర్గాలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమించేలా ప్రేరణనిచ్చాయని మంత్రి అన్నారు. కొమురం భీమ్ త్యాగాలకు గుర్తుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుకు పూర్వమే పెదవాగు నదిపై కొమురం భీమ్ పేరుతో ప్రాజెక్టును చేపట్టి, ఆయన త్యాగాలను గుర్తించిందని మంత్రి సురేఖ గుర్తుచేశారు. కొమురం భీమ్ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ గొప్ప పోరాటం చేసి, నియంతృత్వాన్ని తుదముట్టించి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. కొమురం భీమ్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తున్నదని మంత్రి సురేఖ తెలిపారు.





పిడుగుపాటుకు

## తండ్రి, కూతురు మృతి

**ప్రజాపక్షం / కామేపల్లి :** పిడుగుపాటుకు తండ్రి, కూతురు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు చింతపల్లి లింగస్వామి (50) ఆయన కుమార్తె కావేరి (18) పత్తి చేనులో పనిచేస్తున్నారు. ఈ సమయంలో వర్షం రావడంతో చేను పక్కన గల చెట్టు క్రిందకు చేరారు. ఉరుములు, మెరుపులు రావడంతో చెట్టుపై పిడుగు పడి తండ్రి, కూతురు అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటన స్థలాన్ని కామేపల్లి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. తండ్రి, కూతురు మృతిచెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో

## నలుగురు విద్యార్థుల మిస్సింగ్

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా సంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో చరణ్, రాకేష్, కేశవ్, ఈశ్వర్ అనే నలుగురు విద్యార్థుల మిస్సింగ్ ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకోగా, ఇది తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తల్లిదండ్రులుకి సమాచారం ఇవ్వడంలో హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్ నిర్లక్ష్యం వహించారంటూ తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థుల మధ్య నిన్న రాత్రి గొడవ జరిగినట్లు అక్కడి మరో విద్యార్థి పేర్కొన్నారు. ఎప్పటిలాగే రోజు ప్రొద్దున పిల్లలకి పాలిచ్చే క్రమంలో వాచ్‌మెన్ గమనించడంతో ఈ ఘటన బయటకు వచ్చిందని వాచ్‌మెన్ పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి పట్టణ సిఐ గోపీనాథ్ చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడి, హాస్టల్ వార్డెన్ వాచ్మెన్ ద్వారా మరింత సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు. ఆచూకీ కోసం పోలీసుల చర్యలు ప్రారంభించారు.



## 85 శాతం రోగులకు జిల్లాల్లోనే వైద్యం

మంత్రి రాజనర్సింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 85 శాతం మంది రోగులకు జిల్లాల్లోనే వైద్యం అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యం అని, ఈ లక్ష్యం నెరవేరాలంటే జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్(టివివిపి) ఆసుపత్రుల పనితీరు, టివివిపి నీ సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ గా బలోపేతం చేయడానికి అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) రూపొందించిన ప్రతిపాదనలపై మంగళవారం రాజనర్సింహ అధికారులతో కలిసి రివ్యూ చేశారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో హెల్త్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, టిజిఎంఎస్‌ఐడిసి ఎండి హేమంత్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్కుమార్, అధికారులు శ్రీనివాస్, పద్మజ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కి) కన్సల్టెంట్స్ సుబోధ్, వీరభద్రయ్య, శ్రీదేవి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. వివిపిని సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్గా మార్చడం కోసం రూపొందించిన ప్రతిపాదనలపై ఆస్కి కన్సల్టెంట్స్ మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..టివివిపి పరిధిలో ఉన్న జిల్లా, ఏరియా హాస్పిటళ్లలోనే ఎక్కువ మంది రోగులు చికిత్స పొందుతున్నారని, ఈ నేపథ్యంలో ఆయా హాస్పిటళ్లలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉండాలని ప్రస్తుత అవసరాలను మాత్రమేగాకుండా, భవిష్యత్ అవసరాలు, ఒపి, ఐపి, బెడ్‌లను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని సూచించారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండరడ్స్ (ఐపీహెచ్ఎస్) ప్రకారం ఆసుపత్రుల్లో, క్లినికల్, నాన్ క్లినికల్ స్టాఫ్ ప్యాటర్న్ ఉండాలని రాజనర్సింహ అన్నారు. ఈ మేరకు అవసరమైన అదనపు పోస్టులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డాక్టర్లు, ఇతర ఉద్యోగుల ప్రమోషన్లు, ఇతర సర్వీసు మ్యాటర్స్లో ఇబ్బందులు, లీగల్ చిక్కులు తలెత్తకుండా ప్రతిపాదనలు ఉండాలన్నారు. ఎపిలో వివిపిని సెకండరీ హెల్త్ కేర్గా మార్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, అక్కడ తలెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకుని, అవి రిపీట్ అవకుండా జాగ్రత్త పడాలని సూచించారు. చాలాచోట్ల డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ టీచింగ్ హాస్పిటల్స్ కిందకు వెళ్లిపోయాయని, కొన్ని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు వివిపి పరిధిలోకి వచ్చాయని అధికారులు మంత్రికి తెలిపారు. వివిపి పరిధిలోకి వచ్చిన పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలకు అవసరమైన స్టాఫ్తో పాటు, ఏమేం ఎక్విప్మెంట్ అవసరమో ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి సూచించారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనిక్, పీడియాట్రిక్ వంటి బేసిక్ వైద్య సేవలు అన్నీ వీవీపీ హాస్పిటళ్లలో అందుబాటులో ఉండాలన్నారు. హన్మకొండలోని కాకతీయ మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా ఉన్న ఎంజిఎం, సికెఎం, జిఎంహెచ్, టిబి, కంటి దవాఖాన్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ రివ్యూ చేశారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డిఎంఈ (అకాడమిక్) శివరామ్ ప్రసాద్, కెఎంసి ప్రిన్సిపల్, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో కేఎంసీ ప్రిన్సిపాల్ రామ్కుమార్, ఎంజిఎం సూపరింటెండెంట్ మురళి, టీబీ హాస్పిటల్ సూపరింటెండెంట్ సునీత, సీకేఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ షర్మిల పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయడానికి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేది ఎలా? అని, ఫీజు బకాయిలు విడుదలపై గతంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను ఈనెల 27లోపు విడుదల చేయకపోతే చలో ఇందిరాపార్కు నిర్వహిస్తామని, వేలాది మంది విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం ఎఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లగా, అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో గేటు ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో గత మూడు సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిల విడుదల లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఇబ్బందులు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ప్రైవేట్ డిగ్రీ, పిజి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోయారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజులు బంద్ చేసినా ప్రభుత్వం విడుదల చేయకుండా పెడచెవిన పెట్టడం సిగ్గుచేటన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేసిందని మాట్లాడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకేసారి విడుదల చేస్తామని చెప్పిన నాటి పిసిసి అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పది నెలలు కావస్తున్నా ఇప్పటికీ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విద్యాశాఖ తనవద్దే పెట్టుకున్నా నిధులు కేటాయించి విద్యార్థులకు ఖర్చు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, రాష్ట్రంలో అనేక రకాల ఖర్చులు చేస్తూ, అనేక చెల్లింపులు చేస్తున్నా ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదలచేయడంలో చేస్తున్న నిర్లక్ష్యం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు మొత్తం ఒకేసారి విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్, ఉపాధ్యక్షులు బచ్చల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి మచ్చ నితిన్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి మంద రాకేష్, కౌన్సిల్ సభ్యులు, వివిధ మండల కార్యదర్శులు, అధ్యక్షులు రాజేష్, పొన్నం వేణు, అంకటి ప్రణయ్, నరేష్, ఫర్హాన్, అరవింద్, సోహైల్, ఆసిఫ్, గర్ల్ నాగలక్ష్మి, సౌమ్య, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిహాసమైన పంట పరిహారం

పంట వేయకపోయినా పరిహారం

భూమి లేని వారికి పరిహారం అందించిన వ్యవసాయ శాఖ

అనర్హుల ఖాతాల్లోకి పరిహారం సొమ్ము

**ప్రజాపక్షం/ఖమ్మం :** పంట నష్టపరిహారం పరిహాసంగా మారింది. ఆగస్టు 30, 31 తేదీల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లాలో నదులు ఉప్పొంగాయి. నదులు, ఏర్లు, వాగుల పరివాహక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల మేటలు పెట్టడం లేదా కోతకు గురికావడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం పంటలను పరిశీలించి దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారంగా అందజేస్తుంది. కానీ వ్యవసాయ అధికారులు దుడ్డుకు సగం అన్న రీతిలో వ్యవసాయ అధికారులు దెబ్బతినని భూ యజమానుల నుండి లంచాలు పుచ్చుకుని పరిహార జాబితాలో చేర్చారు. అసలు భూమి లేని రైతులకు పంట నష్ట పరిహారం రావడం చూసి పంటలు దెబ్బతిన్న రైతులు లబోదిబోమంటున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్ మండలంలో బిఆర్ఎస్ నేతల చేతుల్లో వ్యవసాయ అధికారులు కీలుబొమ్మలుగా మారారు. పలు గ్రామాల్లో బిఆర్ఎస్ నేతలు చెప్పిన వారికి భూమి ఉన్నా, లేకున్నా పంట వేయకున్నా, అసలు పంటలు దెబ్బతినకపోయినా పరిహారం మాత్రం దండిగా ఇప్పించేందుకు జాబితాను సిద్ధం చేశారు. అతిపెద్ద వరదలు వచ్చిన సమయంలో సైతం ముంపునకు గురికాని మెరక భూములు సైతం నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు తమ జాబితాలో పేర్కొని వారి ఖాతాల్లో పరిహారాన్ని జమ చేస్తున్నారు. బోనకల్ మండలంలోని రాపల్లి గ్రామంలో వైరా ప్రాజెక్టు 26వ నెంబరు కాలవ కింద అసలు సాగు చేయని భూమిలో వరి పంట కొట్టుకుపోయిందని అధికారులు తమ జాబితాలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఆ భూమిని దున్నిన పాపాన పోలేదు. అటువంటి భూమిలో వరి పంట పూర్తిగా కొట్టుకుపోయిందట. ఈ గ్రామంలోనే అసలు భూమి లేని పలువురు రైతుల ఖాతాల్లో పంట పరిహారం జమ కావడం శోచనీయం. ఇక కొంత మందికి వాగులు, వంకలకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. పాసు పుస్తకంలో భూమి ఉన్నా వాస్తవ సాగులో సెంటు కూడా లేదు. అటువంటి వారికి పెద్ద మొత్తంలో పరిహారం అందడం పలువురిని ఆశ్చర్య పరుస్తుంది. ఈ గ్రామంలో గతంలో విఆర్ఏగా పనిచేసిన వ్యక్తి భూమి లేని పలువురికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించడం కూడా ఇప్పుడు పరిహారం రావడానికి కారణమైందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పంట నష్టం వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎంత నష్టపోయిందో అంతకు పరిహారం ఇప్పించాల్సిన అధికారులు లంచాలకు మరిగి ఇష్టానుసారంగా జాబితాను తయారు చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తయారు చేసిన జాబితాను ఏవోలు, ఏడిఏలు యధాతథంగా ఆమోదించారు. ఆళ్లపాడు, బ్రాహ్మణపల్లి సహా పలు గ్రామాల్లో ఏ మాత్రం పంట నష్టం జరగని రైతులకు సైతం భారీ మొత్తంలో పరిహారం అందించినట్లు సమాచారం. ఓ రైతుకు సంబంధించి అటు పక్క ఇటు పక్క ఉన్న భూములు నష్టానికి గురికాకుండా మధ్యలో ఉన్న ఆ ఒక్క రైతు భూమే పెద్ద మొత్తంలో దెబ్బతిన్నట్లు జాబితా తయారు చేశారు. వాగులు, వంకలకు కిలో మీటర్ల దూరంలో ఉన్న భూములు సైతం నష్టపరిహార జాబితాలో ఉండడం గమనార్హం. రెండు రోజులుగా మండలంలో ఈ పరిహారం విషయమై రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ కార్యాలయం ముందు కొందరు రైతులు ఆందోళన చేస్తే మరి కొందరు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడంతో పాటు జిల్లాకు చెందిన మంత్రులకు ఫిర్యాదులు చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న ఖమ్మంజిల్లాలోనే పరిహారం పరిస్థితి ఇంత దారుణంగా ఉండడం అనర్హులకు జాబితాలో చోటు దక్కడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రభుత్వంపైన సోషల్ మీడియాలో బిఆర్ఎస్ విష ప్రచారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వంపైన బిఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కోట్లాది రూపాయాలను ఖర్చు పెడుతూ సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపైన బిఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కిసాన్ కాంగ్రెస్ పాత్ర చాలా ఉన్నద న్నారు.హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన కిసాన్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే వివిధ కార్పొరేషన్ పదవులు, మార్కెట్,వ్యవసాయ మార్కెట్,ఆత్మకమిటీలతో పార్టీ పదవులు, స్థానిక సంస్థలలో అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను రూపొందించిందని, రూ.18వేల కోట్ల రైతురుణ మాఫీ చేశామని, రైతుబంధు కూడా ఇచ్చామని వివరించారు. పార్టీ కార్యకర్తలను కొంత మంది ఎంఎల్‌ఎలు నిర్లక్ష్యం చేస్తున్నట్టు తనకు సమాచారం ఉన్నదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో రైతులు పూర్తిగా పాల్గొని, కాంగ్రెస్ విజయం సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు.


**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఫోన్ నం. 08743-232428

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ప్రకటన

ఆర్.సి నం. ఇ2/613/2024 ది.22.10.2024

ఈ దేవస్థానం నందు గల విండో మరియు స్ప్లిట్ ఏ.సి.లకు ది.07.11.2024 నుండి ది.06.11.2025 వరకు ఒక సంవత్సర కాలమునకు Annual maintenance మరియు ఇతర పనులకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 23.10.2024 ఉదయం గం. 11:00ల నుండి, **టెండరు దాఖలుచేయు చివరి తేది:** 30.10.2024 ఉదయం గం. 11:00 వరకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 30.10.2024 మధ్యాహ్నం గం॥ 12.00 ని॥లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడగలరు.

సం/- ఎల్. రమాదేవి
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 5672-PP/CL/ADVT/1/2024-25, Date: 22-10-2024



**CHANGE OF NAME**

I, ATLURI ALEKYA (alias Yalamanchi Alekya), W/o: KADIYALA ADITYA, R/o. H.NO. Villa No: 56, Sri Rama's Ayodhya Villas, Beside Indian oil petrol Bunk, Sundar Nagar colony, Bahaduraplly Village Quthbullapur Mandal, Mechal-Malkajgiri District, changed my name as **Yalamanchi Alekya** to **ATLURI ALEKYA** for all purposes.



**పేరు మార్పు ప్రకటన**

నేను, **అలకుంట లత, భర్త: రమేష్,** ఇ.నెం. 2-87, గ్రామం : దామెర, మండలము: ఎల్కతుర్తి, జిల్లా : హనుమకొండ, పిన్ : 505476. నాకు ఇంతకుముందు ఇంటిపేరు **మక్కల లత, భర్త రమేష్**గా పేరు ఉండేది, ప్రస్తుతం ఇంటి పేరును **అలకుంట లత, భర్త రమేష్**గా మార్చుకున్నాని తెలియచేస్తున్నాను.

ఇట్లు
**అలకుంట లత, భర్త: రమేష్,**
ఫోన్ : 9618554967, 8121297038.


# ఫోకస్

## విధులు ఒకటే.. చెల్లింపులు వేరువేరు



చాలా రంగాల్లో పురుషులు, మహిళలు ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ, చెల్లింపుల విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంది. శాస్త్ర, పరిశోధనా రంగంలోనూ ఈ తేడా స్పష్టంగా కనిపిస్తున్నది. సహోద్యోగులైన పురుషుల కంటే మహిళలకు తక్కువ మొత్తంలో పరిశోధనా గ్రాంట్లు తక్కువగా చెల్లిస్తున్నారు. పరిశోధనా రంగంలో మహిళలు 33.3 శాతం ప్రాతినిధ్యం వహిస్తుండగా, జాతీయ సైన్స్ అకాడెమీలలో కేవలం 12 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు. కృత్రిమ మేధ వంటి అత్యాధునిక రంగాల్లో ప్రతి ఐదుగురు నిపుణుల్లో ఒక మహిళా మాత్రమే ఉన్నారు. నాలుగో పారిశ్రామిక విప్లవానికి దారితీసే అనేక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాల కొరత ఉన్నప్పటికీ, మహిళల సంఖ్య ఇప్పటికీ ఇంజనీరింగ్ గ్రాడ్యుట్లలో అతి తక్కువగా 28 శాతానికి పరిమితమైంది. ఇన్ఫర్మేటిక్స్ గ్రాడ్యుయేట్లలో మాత్రం కొంత మెరుగ్గా 40 శాతం మంది మహిళలున్నారు. మహిళలకు పరిశోధకులుగా ఎదిగే అవకాశాలు చాలా తక్కువ. అడుగడుగునా ఎన్నో సమస్యలు. వాటిని ఎదుర్కొని, అతి కష్టం మీద ఉన్నత చదువులు చదివినప్పటికీ, ఉద్యోగావకాశాల నుంచి జీతభత్యాల వరకూ అన్నిటా వివక్ష కొనసాగుతున్నది. 'ఒకే పనికి ఒకే వేతనం' లక్ష్యం కేవలం కాగితాలకు... నినాదాలకు పరిమితమైపోయింది. మహిళల జీవితాల్లో మాదిరిగానే జీతాల్లోనూ కోతలే.

# మహిళలకు సామాజిక రక్షణ కరవు



మహిళ

ప్రపంచ వ్యాప్తంగా సుమారు రెండు బిలియన్ల (200 కోట్లు) మంది మహిళలకు సామాజిక రక్షణ కొరవడింది. పురుషాధిక్యత దాదాపుగా అన్ని దేశాల్లోనూ కొనసాగుతున్నది. ఐక్యరాజ్య సమితి తాజాగా మహిళలపై ప్రకటించిన నివేదికను అనుసరించి, సామాజిక రక్షణలో విపరీతమైన లింగ వివక్ష స్పష్టంగా కనిపిస్తున్నది. కోట్లాది మంది మహిళలు, బాలికలు పేదరికంలో మగ్గుతున్నారు. నగదు ప్రయోజనాలు, నిరుద్యోగ బీమా, పెన్షన్లు లేదా ఆరోగ్య సంరక్షణ వంటి ఏ విధమైన సామాజిక రక్షణ వీరికి అందుబాటులో లేదు. 'అభివృద్ధిలో మహిళల పాత్ర'పై సర్వే పలు అంశాలపై దృష్టి పెట్టింది. ప్రత్యేకించి సమాన హక్కులు, అవకాశాలు తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఐక్యరాజ్య సమితి సాధారణ సభ నేతృత్వంలో పని చేసే ఆర్థిక కమిటీ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వివిధ అంశాలపై నివేదికలను సమర్పిస్తుంది. అందులో భాగంగా మహిళలకు సంబంధించిన నివేదికలో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. 2015 నుండి పురోగతి సాధించినప్పటికీ, అనేక అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో మహిళలకు సామాజిక రక్షణ లేదు. లింగ అంతరం విస్తరిస్తున్నది. మహిళలు, బాలికలను పక్కకుపెట్టి, అభివృద్ధి ఫలాలలో సింహభాగాన్ని పురుషులు చేజిక్కించుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 63 శాతం మంది మహిళలు ఇప్పటికీ ప్రసూతి ప్రయోజనాలను పొందకుండానే ప్రసవిస్తున్నారు, సబ్‌సహారా ఆఫ్రికాలో ఈ రేటు, అత్యంత ప్రమాదకరంగా, 94 శాతానికి పెరిగింది. ప్రసూతి సెలవుల సమయంలో ఆర్థిక సహాయం లేకపోవడం మహిళల ఆర్థిక స్థిరత్వం, వారి పిల్లల శ్రేయస్సుపై తీవ్ర ప్రభావం పడుతున్నది. మహిళలపై దాడులు, హింస పెరుగుతున్నది. ఆర్థిక పరమైన స్వేచ్ఛ మహిళలకు చాలా తక్కువ అని ఈ నివేదిక తేల్చిచెప్పింది. చిన్నతనం నుంచి వృద్ధాప్యం వరకూ మహిళలు జీవితంలోని అన్ని దశల్లోనూ పేదరికాన్నే అనుభవిస్తున్నారు. అనేక దేశాల్లో పెరుగుతున్న ద్రవ్యోల్బణ రేటు కూడా మహిళల జీవన పరిస్థితులను దెబ్బతీస్తున్నది. వారి ఆర్థిక స్వేచ్ఛకు గండికొడుతున్నది. ధరల పెరుగుదలకు సమానంగా ఆదాయం పెరగడం లేదన్నది వాస్తవం. ఇలాంటి సందర్భాల్లో, కుటుంబ ఆదాయంలో పురుషులు తమ వాటాను పెంచేసుకుంటే, మహిళలకు ఉన్నంతలో సర్దుకుపోవాల్సిన దుస్థితి తప్పడం లేదు. 25 నుంచి 34 సంవత్సరాల మధ్య ఉన్న పురుషులు, మహిళల పేదరికాన్ని గమనిస్తే, పురుషుల కంటే మహిళల్లో 25 శాతం పేదరికం అధికంగా ఉందని స్పష్టమవుతున్నది. అసమానతలకు వ్యతిరేకంగా వారు నిరంతరం పోరాటం సాగించాల్సి వస్తున్నది. ఒక వైపు పేదరికం, మరోవైపు అసమానతలు మహిళలను కుంగదీస్తున్నాయని ఈ నివేదిక పేర్కొంది. ప్రత్యేకించి కరోనా మహమ్మారి ప్రపంచంపై విరుచుకుపడిన తర్వాత అత్యధిక శాతం మంది మహిళల జీవితాలు అస్తవ్యస్తమయ్యాయి. ఇప్పటికీ వారు ఆర్థిక సమస్యల ఊబి నుంచి బయటపడలేకపోతున్నారు. 2022 నుంచి ప్రపంచ దేశాల్లో ద్రవ్యోల్బణం పెరుగుతున్నది. ఫలితంగా ఆహారం, ఇంధన ధరలు కూడా పెరుగుతున్నాయి. ఆశ్చర్యకరంగా, ఈ ప్రభావం మహిళలపైనే ఎక్కువగా ఉంది. 171 దేశాల్లో, ఆయా ప్రభుత్వాలు చేపట్టిన దాదాపు 1000 సామాజిక రక్షణ చర్యల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళల ఆర్థిక భద్రతపై దృష్టి సారించేవిగా ఉన్నాయని నివేదిక వెల్లడించింది. విద్యాసంస్థలు, పౌర సమాజం, ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు.. ప్రత్యేకించి అంతర్జాతీయ కార్మిక సంస్థ సహకారంతో సాధించిన పురోగతిని కూడా ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. అందులోనూ మహిళలకు జరుగుతున్న అన్యాయాలను, వివక్షను బహిర్గతం చేసింది. ఉదాహరణకు మంగోలియాలో పశువుల కాపరులుగా లేదా ఇతరత్రా రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు ప్రసూతి సెలవులను అక్కడి ప్రభుత్వం పొడిగించింది. ఇది హర్షణీయ పరిణామమే. కానీ, అదే సమయంలో శిశువు సంరక్షణలో లింగ సమానత్వం ఉండాలనే పేరుతో పితృత్వ సెలవులను కూడా పెంచింది. సమానత్వాన్ని ఈ విధంగా పాటించింది. అయితే, మెక్సికో, ట్యునీషియా వంటి దేశాల్లో గృహ కార్మికులను ఇప్పుడు సామాజిక భద్రతా వ్యవస్థల్లోకి చేర్చారు. సెనెగల్‌లో అదనంగా జాతీయ ఆరోగ్య బీమా పథకాన్ని గృహ కార్మికులకు అమలు చేస్తున్నారు. గ్రామీణ మహిళల అవసరాలకు అనుగుణంగా బీమా పథకాన్ని రూపొందించి, విస్తరించడం అభినందనీయం. దురదృష్టవశాత్తు అతికొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి చర్యలు చేపడుతున్నారు. మిగతా దేశాల్లో లింగ వివక్ష కొనసాగుతునే ఉంది. ఈ నేపథ్యంలోనే సామాజిక రక్షణ వ్యవస్థ ప్రాముఖ్యతను ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. మహిళలు, బాలికల సామాజిక రక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు సూచించింది. సంక్షోభ సమయాల్లో, మహిళల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చింది. పేదరికం నుంచి బయటపడి, సుస్థిరమైన ఆర్థిక ఫలాలు అందుకునే దిశగా మహిళలను నడిపించడానికి చర్యలు అవసరమని పేర్కొంది. ఈ నివేదిక సూచనలను ఎన్ని దేశాలు అమలు చేస్తాయన్నదే ప్రశ్న.

## మహిళల పట్ల అంతులేని నిర్లక్ష్యం




ప్రపంచ వ్యాప్తంగా మహిళా హక్కులకు సంబంధించి ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. ఉద్యమాలు, నిరసనలు, పోరాటాల ఫలితంగా చాలా దేశాల్లో మహిళలు పరిస్థితి స్వల్పంగా మెరుగుపడింది. కానీ, మన దేశంలో మాత్రం సమస్య సమస్యగానే మిగిలింది. మహిళలపై హింస కొనసాగుతునే ఉంది. స్థిరమైన అభివృద్ధి సూచీలను గమనిస్తే, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించి, అమలు చేసి, పర్యవేక్షించే చట్టపరమైన విధానాలు 83.3 శాతం అమల్లో ఉన్నాయి. అయితే, ఆచరణలో మాత్రం నామమాత్రంగానే ఉంది. 15 నుంచి 18 సంవత్సరాల వయసుగల ప్రతి 1000 మంది మహిళలకు కౌమారదశ జననాల రేటు 12.2 శాతంగా ఉంది. ఈ రేటు ఏటా పెరుగుతునే ఉండడం ఆందోళన కలిగించే అంశం. స్త్రీ, పురుష సమానత్వాన్నా సాధించే దిశగా భారత్ ఇంకా ఎంతో కృషి చేయాల్సి ఉందని స్థిరమైన అభివృద్ధి సూచీలు (ఎస్‌డిఐ) స్పష్టం చేస్తున్నాయి. 20–24 సంవత్సరాల మధ్య వయసులో వివాహం చేసుకుంటున్న వారు 27.3 శాతంకాగా, అత్యధిక శాతం మందికి 18 సంవత్సరాల లోపే పెళ్లిళ్లు జరుగుతున్నాయి. భారతీయ చట్టాలను అనుసరించి అమ్మాయి కనీస పెళ్లి వయసును 18 సంవత్సరాలుగా నిర్ధారించారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ, దేశంలో బాల్య వివాహాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. కులం, మతం, ప్రాంతం, సంప్రదాయాల ప్రభావం ఈ విషయంలో ప్రధాన భూమిక పోషిస్తున్నది. ఇంటి కేవలం మహిళలకు మాత్రమే పరిమితమన్న భావన భారత సమాజంలో వేళ్లానుకుంది. ఉద్యోగాలకు లేదా కూలీ పనికి వెళ్లి డబ్బు సంపాదించే మహిళలకు కూడా ఇంటి పనులు తప్పవు. దీనితో వారు శారీరకంగా అలసిపోతున్నారు. ఇంట్లో, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు సామాన్యమయ్యాయి. ఆస్తుల విషయంలో మహిళలకు కూడా సమాన హక్కులు ఉన్నప్పటికీ, అమలు జరుగుతున్న దాఖలాలు లేవు. ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్న 'ఉమెన్ కౌంట డేటా హబ్'లో సమాచారం ప్రకారం, మహిళలై వివక్షకు తెరపడడం లేదు. గణాంకాలు కూడా ఈ విఃయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

# పోటీ కోసం జీకె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- 'గోడాన్' రచయిత ఎవరు?
  మున్షీ ప్రేమ్‌చంద్
- మేఘదూతం రచయిత ఎవరు?
  కాళిదాస్
- ఏ పుస్తకం 15 భారతీయ, 40 విదేశీ భాషల్లోకి అనువదించబడింది?
  పంచతంత్రం
- భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు బ్రిటన్ ప్రధాన మంత్రి ఎవరు?
  క్లెమెంట్ అట్లీ
- తామర శరీరంలోని ఏ భాగాన్ని ప్రభావితం చేస్తుంది?
  చర్మం
- స్కౌట్స్ అండ్ గైడ్స్' సంస్థను స్థాపించినది ఎవరు?
  రాబర్ట్ బాడెన్ పావెల్
- ప్రపంచంలో అతిపెద్ద సముద్రం ఏది?
  పసిఫిక్ మహాసముద్రం
- 'పెనాల్టీ కిక్' అనే పదం ఏ క్రీడలో ఉపయోగిస్తారు?
  ఫుట్‌బాల్
- రంజీ ట్రోఫీ ఏ క్రీడకు సంబంధించినది?
  క్రికెట్
- భారత స్వాతంత్ర్యం పొందిన సంవత్సరం ఏమిటి?
  1947
- భారతదేశ రాజ్యాంగ నిర్మాత ఎవరు?
  డా. బి.ఆర్. అంబేద్కర్
- భారతదేశపు మొదటి ప్రధాని ఎవరు?
  జవహర్‌లాల్ నెహ్రూ
- మహాత్మా గాంధీని రాష్ట్రపిత అని పిలిచేది ఎవరు?
  సుభాష్ చంద్ర బోస్
- భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రం ఏది?
  ఉత్తరప్రదేశ్
- యునైటెడ్ నేషన్స్ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
  న్యూయార్క్ సిటీ, యుఎస్ఎ
- భారతదేశపు జాతీయ జెండా మూడు రంగులు ఏమిటి?
  కాషాయము, తెలుపు, ఆకుపచ్చ
- భారతదేశపు జాతీయ జంతువు ఏది?
  పులి
- భారతదేశపు జాతీయ పక్షి ఏది?
  నెమలి
- భారతదేశపు మొదటి మహిళా ప్రధానమంత్రి ఎవరు?
  ఇందిరా గాంధీ
- భారత జాతీయ పతాకాన్ని ఎవరు రూపొందించారు?
  పింగళి వెంకయ్య
- అసియా ఖండంలో అతి పెద్ద దేశం ఏది?
  చైనా
- భారతదేశంలో అత్యంత పొడవైన నది ఏది?
  గంగా నది
- సూర్యుని చుట్టూ భూమి ఒక చక్రం తిరగడానికి ఎంత కాలం పడుతుంది?
  365 రోజులు
- మానవ శరీరంలో అతి పెద్ద అవయవం ఏది?
  చర్మం
- ప్రపంచంలో అతి పొడవైన ప్రహరీ ఏది?
  చైనా గ్రేట్ వాల్



# ప్రజాపక్షం 6వ వార్షికోత్సవ వేడుక



## ప్రజల కోసమై నిలిచింది 'ప్రజాపక్షం' పత్రిక

రచన : పల్లె నర్సింహా

**పల్లవి :** ప్రజల కోసమై నిలిచింది – ప్రజాపక్షం పత్రిక
శ్రమ జీవి హక్కుల గొంతుకరా– ప్రజపక్షం పత్రిక
ప్రతి అక్షరం ప్రజల కోసమై– పుట్టిందిరా మన పత్రిక
అదేరా మన దినపత్రిక – పేద ప్రజల జన పుత్రిక

**చరణం :** విద్యార్థి యువతకు క్రాంతి రేఖలై
బతుకు మార్చె బంగారు దారులై
రైతుకు అండగా నిలిచి–
శ్రామిక , కార్మికులేకం చేసింది
దోపిడి దారులు గుట్టిప్పి
సమ్మె సైరెనై మోగింది
॥ ప్రజల కోసం॥
శ్రమజీవి చేతిలో వజ్రాయుధం
వాస్తవాలు ముందుంచే దర్పణం



సమసమాజ స్థాపన కోసం
ఎప్పటికప్పుడు కొత్తదనంతో
నవచేతనమైన నడుస్తున్నది
॥ ప్రజల కోసం ॥
ఒడిదొడుకులు ఎన్నెదురైనా – ఓపికతోనే నడిచింది
ఆటంకాలు ఎన్నెదురైనా – అదరలే
బెదరలే నీవమ్మ
నిను నడుపుతున్న నవచేతనమే –
నీ ఉద్యోగుల సంకల్ప బలం
జిల్లా, రాష్ట్రం దాటాలే –
దేశంలో వెలుగొందాలే..
ఆరేండ్ల ఆనందమెనమ్మ –
నూరేండ్లు నువు నడవాలమ్మ
॥ప్రజల కోసం॥



# దూసుకొస్తున్న 'దానా'

## తుఫానును ఎదుర్కొనేందుకు ఒడిశా, బెంగాల్ సన్నద్ధం

### ఎన్‌డీఆర్ఎఫ్ దళాల మోహరింపు

**కోల్‌కతా/భువనేశ్వర్ :** తుఫాను 'దానా' ను ఎదుర్కొనేందుకు ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు సన్నద్ధమయ్యాయి. తుఫాను ముప్పు నుంచి ప్రజలను కాపాడేందుకు ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో సహాయ, పునరావాస చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్ దళాలను మోహరించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షపాతాన్ని అంచనా వేసింది. తుఫాను సీజన్‌లో మొదటి అతిపెద్ద తుఫాను అయిన 'దానా' అక్టోబర్ 24న తీరాన్ని తాకే అవకాశం ఉంది. ఇది అక్టోబర్ 25 వరకు ఉంటుంది. బంగాళాఖాతం, ఉత్తర అండమాన్ సముద్రం మీదుగా అల్పపీడనం ఏర్పడిందని, అక్టోబర్ 23 నాటికి తుపానుగా మారే అవకాశం ఉందని, ఇది ఒడిశాపశ్చిమ బెంగాల్ తీరాల వైపు కదులుతుందని ఐఎండీ గతంలో నివేదించింది. కాగా, ఒడిశాలోని పూరీ, ఖుర్దా, గంజాం, మయూర్‌భంజ్, కియోంఝర్, బాలాసోర్, భద్రక్, జగత్‌సింగ్‌పూర్ వంటి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇదిలా ఉండగా, కోల్‌కతా వాతావరణ కార్యాలయం పశ్చిమ బెంగాల్‌లోని పూర్బా మదీనాపూర్, పశ్చిమ్ మెదినీపూర్, దక్షిణ 24 పరగణాలు, ఉత్తర 24 పరగణాల జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే హౌరా, హుగ్లీ, ఝర్‌గ్రామ్‌లలో అక్టోబర్ 23, 24 మధ్య భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 23 సాయంత్రం నుంచి గంటకు 4060 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ గాలులు గంటకు 100110 కి.మీ, 120 కి.మీలకు పెరిగే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. ఒడిశాలోని మొత్తం 14 ప్రభావిత జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలను 23 నుంచి 25వ తేదీ వరకు మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. గంజాం, పూరి, జగత్‌సింగ్‌పూర్, కేంద్రపారా, భద్రక్, బాలాసోర్, మయూర్‌భంజ్, కియోంఝర్, ఢెంకనల్, జాజ్‌పూర్, నయాగఢ్, కటక్ జిల్లాల్లో పాఠశాలలను మూసివేయనున్నారు.

**కూరగాయల ధరలకు రెక్కలు ! :** ఒడిశా తీరాన్ని తుపాను తాకుతుందని ఐఎండీ అంచనాల మధ్య వినియోగదారులు భయాందోళనలకు గురికావడంతో ఒడిశా మార్కెట్‌లలో బంగాళాదుంపలు, ఉల్లిపాయలతో సహా కూరగాయల ధరలు పెరిగాయని వ్యాపారులు మంగళవారం తెలిపారు. కటక్‌లోని ఛత్రా బజార్‌లో మంగళవారం కిలో బంగాళదుంప ధర రూ.30 నుంచి రూ.50కి పెరిగింది. ఒడిశాలోని అతిపెద్ద కూరగాయల మార్కెట్లలో ఒకటైన మార్కెట్‌లో ఉల్లి ధర కూడా కిలో రూ.40 నుంచి రూ.60కి పెరిగింది. భువనగిరిలోని స్థానిక మార్కెట్లలో టమాటా రూ.80 నుంచి 100 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. బెండకాయలు, వంకాయలు, క్యాలీఫ్లవర్ వంటి ఇతర కూరగాయల ధరలు కూడా కిలోకు రూ.10 నుంచి 20 వరకు పెరిగాయి.

# భారీ వర్షాలతో బెంగళూరు అతలాకుతలం



**బెంగళూరు:** కర్నాటకను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రాజధాని నగరమైన బెంగళూరు లోని అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కార్లు, ఇళ్లు పాక్షికంగా నీటిలో చిక్కుకుపోవడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. రోడ్లు, రహదారులపై రాకపోకలకు ఉదయం నుంచి తీవ్ర అంతరాయం తలెత్తింది. సాధారణ జనజీవన స్తంభించింది. బెంగళూరు నగరంలోని ప్రధాన రోడ్లు బాగా దెబ్బతినడం, గుంతలు తేలడంతో ద్విచక్ర వాహనాలు సహా అనేక వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. వర్షం వచ్చిన ప్రతిసారి రోడ్లు మాయమై, గుంతలు ప్రాణాంతకంగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జామ్‌లను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులను మోహరించారు. ఎలహంకలోని లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) బస్సు, వాహనాల ఇంజన్లలోకి నీళ్లు చేరడంతో ఎలహంక ఓల్డ్ టౌన్ రోడ్డుపైనే అవి నిలిచిపోయాయి. క్రేన్లను రంగంలోకి దింపిన అధికారులు రోడ్లపై నిలిచిపోయిన వాహనాలను తొలగించే చర్యలు చేపట్టారు. చిక్కబొమ్మసంద్రలో 60కి పైగా ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. అంబేద్కర్ నగర్‌లో వరదనీటి ప్రవాహం పెరుగుతుండటంతో చాలా కుటుంబాలు పిల్లలతో సహా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాయి. మాన్యో కన్వెన్షన్ సెంటర్, మాన్యత టెక్ పార్క్‌లు సైతం నీటి మడుగుల్లా మారాయి. అమతహళ్లి, చిక్కబనవర, మారుతీనగర్ ప్రాంతాలు సైతం జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మంగళవారం సైతం దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో మరిన్ని వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. బెంగళూరు సిటీలోని ఎకోస్పేస్ జంక్షన్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విప్రో జంక్షన్ వద్దనున్న సర్జాపుర రోడ్డు, బీఆర్‌జీ లేఔట్ జంక్షన్ జలదిగ్బంధంలో ఉన్నాయి. కాగా, వర్షాలకు బెంగళూరు సిటీ అతలాకుతలం కావడంపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలతో ప్రపంచస్థాయి బెంగళూరు నీటిలో తేలియాడే నగరంగా మారిందని జేడీఎస్ ఎద్దేవా చేసింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విజనరీ నాయకత్వంలో బెంగళూరు భవిష్యత్తు కూడా ఊగిసలాడుతోందంటున్నారు. భారీ వర్షాల కారణంగా కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. 20కి పైగా విమానాలు ఆలస్యంగా విమానాశ్రయానికి చేరుకోగా, నాలుగు విమానాలను దారి మళ్లించారు. థాయ్‌లాండ్ నుంచి వచ్చే థాయ్ లయన్ ఎయిర్ ఫ్లైట్‌ను చెన్నైకి మళ్లించారు. ఢిల్లీ నుంచి వచ్చే ఒక ఎయిర్ ఇండియా విమానం, ఢిల్లీ, హైదరాబాద్, చండీగఢ్ నుంచి వచ్చే మూడు ఇండిగో విమానాలను చెన్నైకు మళ్లించారు.

# వయనాడ్‌కు ప్రియాంక మెరుగైన ప్రతినిధి

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** వయనాడ్‌కు తన సోదరి కంటే మెరుగైన ప్రతినిధిని ఈ నియోజకవర్గానికి ఊహించలేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికకు నామినేషన్ దాఖలు చేయడానికి ఒక రోజు ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వాద్రా బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పత్రాల దాఖలుకు హాజరుకానున్నారు. 'వయనాడ్ ప్రజలకు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంది. వారికి నా సోదరి ప్రియాంక గాంధీ కంటే మెరుగైన ప్రతినిధిని నేను ఊహించలేను' అని రాహుల్ గాంధీ మంగళవారం 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఆమె వయనాడ్ అవసరాలకు ఉద్వేగభరితమైన ఛాంపియన్, పార్లమెంటులో శక్తివంతమైన వాయిస్ అవుతుందని నేను విశ్వసిస్తున్నాను' అని అన్నారు. కాగా, రాహుల్, ప్రియాంక గాంధీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కలెక్టర్ ముందు తన నామినేషన్ దాఖలు చేయడానికి ముందు 11 గంటలకు కల్పేట కొత్త బస్‌స్టాండ్ నుంచి రోడ్‌షోకు నాయకత్వం వహిస్తారు. వారితో చేరాలని ప్రజలను ప్రోత్సహిస్తూ, 'కలిసి, వయనాడ్‌కు ప్రేమతో ప్రాతినిధ్యం వహించేలా చూసుకుందాం' అని రాహుల్ పిలుపునిచ్చారు. కొన్నేళ్లుగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ప్రియాంక, అంతకుముందు రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహించిన వయనాడ్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగనున్నారు.

# మానసిక ఒత్తిడి భరించలేకపోతున్నాం

## అమిత్ షాకు కోల్‌కతా హత్యాచార బాధితురాలి తండ్రి లేఖ

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీకర్ హత్యాచార ఘటనలో మృతురాలి కుటుంబం న్యాయం కోసం ఎదురుచూస్తోంది. తమకు సహాయం చేసేవారు ఎవరూలేరని ఆవేదన చెందుతోంది. తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు మృతురాలి తండ్రి రాసిన లేఖ ఇదే విషయాన్ని వెల్లడిచేస్తోంది. 'నా కుమార్తెకు జరిగిన అమానవీయ ఘటన తర్వాత మా కుటుంబం అంతా తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మేం నిస్సహాయులమనే భావన కలుగుతోంది. ఈ కేసు త్వరితగతిన పూర్తయ్యేందుకు, మా కుమార్తెకు న్యాయం జరిగేందుకు మీ మార్గదర్శకత్వం ఉపయోగపడుతుందని విశ్వసిస్తున్నాను. ఆ విషయమై మిమ్మల్ని కలుసుకునే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను' అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రికి ఆయన ఈమెయిల్ చేశారు. ఈ హత్యాచార ఘటన తర్వాత తీవ్రస్థాయిలో ఆందోళనలు జరిగాయి. సంజయ్ రాయ్ ఏకైక నిందితుడని సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ వైద్య విద్యార్థులు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఆ దీక్షతో కొంతమంది విద్యార్థుల ఆరోగ్యం క్షీణిస్తుండటంతో అప్రమత్తమైన బెంగాల్ ప్రభుత్వం... వారితో చర్చలు జరిపింది. అవి సఫలం కావడం తో వారు దీక్ష విరమించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర హోంమంత్రికి బాధిత కుటుంబం లేఖ రాసింది.

# సనాతన ధర్మం వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పను

## తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్



**చెన్నై/దిండిగల్ :** సనాతన ధర్మ నిర్మూలనను సమర్థిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు తాను క్షమాపణ చెప్పబోనని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ స్పష్టంచేశారు. మహిళలపై జరుగుతున్న అణచివేత చర్యలను ప్రస్తావించేందుకే తన వ్యాఖ్యలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని, ఇది సెప్టెంబరు 2023లో ప్రారంభమైన వివాదానికి దారితీసిందని ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) నాయకుడు తెలిపారు. పెరియార్, మాజీ ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై, తన తాత ఎం.కరుణానిధి వంటి ప్రముఖ ద్రవిడ నాయకుల విశ్వాసాలకు అనుగుణంగా ఆ వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. మహిళలకు చారిత్రాత్మకంగా విద్యను నిరాకరించడంతో పాటు వారిని ఇళ్లకే పరిమితం చేశారని, వారి భర్త చనిపోతే బలవర్మణం చెందాల్సి వచ్చిందని చెప్పారు. పెరియార్ ఈ పద్ధతులకు వ్యతిరేకంగా మాట్లాడారని అన్నారు. పెరియార్, అన్నాదురై, కలైంజ్ఞర్ కోసం నిలబడిన దానిని నేను ప్రతిధ్వనించాను' అని తెలిపారు. సెప్టెంబరు 2023లో ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి... సనాతన ధర్మాన్ని 'డెంగీ', 'మలేరియా' వంటి వ్యాధులతో పోల్చి... దాని నిర్మూలనకు పిలుపునివ్వడంతో వివాదం చెలరేగింది. సనాతన ధర్మం సామాజిక న్యాయం, సమానత్వానికి వ్యతిరేకమని ఆయన వాదించారు.

# సుప్రీం ఆదేశాలనే ధిక్కరిస్తారా?

## యోగి సర్కార్ కూల్చివేతలపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న బుల్డోజర్ కూల్చివేతలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల్ని ధిక్కరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయంటూ పరోక్షంగా ప్రభుత్వాన్ని హెచ్చరించింది. యూపీలో బుల్డోజర్ చర్యలపై దాఖలైన పిటిషన్లపై విచారణ పూర్తయ్యే వరకూ ఎలాంటి కూల్చివేతలకు ఉపక్రమించవద్దని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయగా, వాటిని సుప్రీంకోర్టు మరోసారి గుర్తు చేసింది. "వారు దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల్ని అతిక్రమించి రిస్క్ చేయాలనుకుంటున్నారా?"అని ఘాటుగా స్పందించింది. ఉత్తరప్రదేశ్ బహ్రైచ్‌లో 'ఆపరేషన్ బుల్డోజర్'ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బహ్రైచ్ బాధితుల తరఫున సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాది సీయూ సింగ్ వాదించారు. స్థానిక అధికారులు అక్టోబర్ 13న బహ్రైచ్‌లో ఆపరేషన్ బుల్డోజర్‌పై నోటీసులు జారీ చేశారు. అనంతరం జరిగిన బుల్డోజర్ చర్యల కారణంగా మత ఘర్షణలు జరిగాయని, ఓ వ్యక్తి సైతం ప్రాణాలు కోల్పోయారని కోర్టుకు తెలిపారు. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ విన్నవించారు. అనంతరం జస్టిస్ బీఆర్ గవయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం... సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని బుల్డోజర్ చర్యలపై పరోక్షంగా హెచ్చరించింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించాలనుకుంటే అది ప్రభుత్వ నిర్ణయం. అయితే, కూల్చివేతలను ఎదుర్కొంటున్న నిర్మాణాలు చట్ట విరుద్ధమైతే, తాము జోక్యం చేసుకోబోమని పేర్కొంది. బహ్రైచ్‌లో ప్రభుత్వ బుల్డోజర్ చర్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్లపై బుధవారం కోర్టు విచారణ చేపట్టనుంది. విచారణ నేపథ్యంలో ఎలాంటి బుల్డోజర్ చర్యలరకు ఉపక్రమించొద్దని సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

# వక్ఫ్ బిల్లుపై వాగ్వాదం

## గ్లాసు పగులగొట్టిన టిఎంసి ఎంపి



**న్యూఢిల్లీ :** వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్ష సభ్యుల నుంచి నిరసనలు, వాగ్వాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం వక్ఫ్ బిల్లుపై జాయింట్ కమిటీ సమావేశం నాటకీయంగా మారింది. టీఎంసీ సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ బీజేపీకి చెందిన అభిజిత్ గంగోపాధ్యాయతో వాగ్వాదం సందర్భంగా గ్లాస్ వాటర్ బాటిల్‌ను పగులగొట్టి విసిరారు. ఈ క్రమంలో బెనర్జీ బొటనవేలు, చూపుడు వేలికి గాయమైంది. దీంతో ప్రథమ చికిత్స చేయవలసి వచ్చింది. ఆ తర్వాత ఆయనను ఎఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆప్ నేత సంజయ్ సింగ్ తిరిగి సమావేశ గదికి తీసుకెళ్లారు. టీఎంసీ సభ్యుడికి కూడా అధికారులు సూప్ అందించారు. బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలో సంయుక్త పార్లమెంటరీ సమావేశం (జేపీసీ) జరిగింది. విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదల ప్యానెల్ ఇచ్చిన అభిప్రాయాలను ఆ సమావేశంలో చర్చించారు. అయితే శాసన ప్రక్రియలు నిపుణుల అభిప్రాయాలు ఎందుకున్న కోణంలో ఎంపీ బెనర్జీ ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే వక్ఫ్ సవరణ బిల్లును అధికార పార్టీ తీసుకువచ్చినట్లు ఆయన ఆరోపించారు. ముస్లిం వర్గాన్ని ఆ బిల్లుతో లక్ష్యంగా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ సమయంలో బీజేపీ నేతలు ఆ బిల్లును సమర్థించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ విషయంలో సంస్కరణలు అవసరం అన్నారు. డిజిటైజేషన్, ఆడిటింగ్, న్యాయ కార్యాచరణ అవసరం ఉంటుందని అధికారి పార్టీ వాదించింది. వక్ఫ్ బిల్లు సవరణపై ఇప్పటి వరకు జేపీసీ కేవలం ఢిల్లీలో 15 సమావేశాలు నిర్వహించింది. మరో అయిదు సమావేశాలను ఇతర నగరాల్లో ఏర్పాటు చేసింది.

# బిష్ణోయ్‌ని ఎన్‌కౌంటర్ చేస్తే రూ.కోటి: కర్ణిసేన



**ముంబై:** ప్రస్తుతం జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులకు రూ.కోటికి పైగా నజరానా ఇస్తామని క్షత్రియ కర్ణి సేన ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాజ్ షెకావత్ వీడియో విడుదల చేసినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. 'లారెన్స్ బిష్ణోయ్‌ను ఎన్ కౌంటర్ చేసిన ఏ పోలీసు అధికారికైనా వారి భద్రత, కుటుంబ భవిష్యత్తు కోసం రూ.కోటికి పైగా ఇస్తాం. ఈ గ్యాంగ్ ఎన్ని హత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. మా అధినేత సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడిని చంపిన వారిని వదిలేది లేదు' అని రాజ్ షెకావత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. 2023, డిసెంబర్‌లో రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడిని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. అనంతరం ఆయనను తామే హత్య చేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. తాజాగా ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్దిఖీని హత్య చేసింది కూడా తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ వెల్లడించింది.

# ఆగని బెదిరింపుల పర్వం

## మరో 10 ఇండిగో విమానాలకు హెచ్చరికలు



**న్యూఢిల్లీ :** దేశంలో ఇటీవలకాలంలో బాంబు బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. విమానాలు పేలుస్తామని, స్కూళ్లకు బాంబులు అమర్చామని గుర్తుతెలియని దుండగులు తరచూ ఫోన్లు చేసి భయోత్పాతం సృష్టిస్తున్నారు. భారత్‌కు చెందిన విమానాలకు వరుస బాంబు బెదిరింపులు ప్రజల్లో ఆందోళన సృష్టిస్తున్నాయి. విమానయాన సంస్థలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా... ఇవి ఆగడం లేదు. మంగళవారం మరో 10 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లుగా ఇండిగో ఎయిర్‌లైన్స్ అధికారులు వెల్లడించారు. దేశీయ సర్వీసులే కాకుండా జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ లాంటి అంతర్జాతీయ సర్వీసులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ వారంలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు మొత్తం 100కు పైగా హెచ్చరికలు వచ్చాయని తెలిపారు. 'జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే విమానాలకు మంగళవారం బాంబు బెదిరింపులు రావడంతో మా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. ప్రయాణికులను తరలించి... తనిఖీలు నిర్వహిస్తున్నాం'' అని ఇండిగో ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

**సిఆర్‌పిఎఫ్ పాఠశాలలకు బాంబు బెదిరింపులు**

దేశవ్యాప్తంగా ఉన్న సీఆర్‌పీఎఫ్ పాఠశాలలకు సైతం బాంబు బెదిరింపులు వచ్చాయి. కేవలం భయపెట్టేందుకే కొందరు నకిలీ ఇమెయిల్ పంపి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కొన్ని పాఠశాలల గదుల్లో పేలుడు పదార్థాలు ఉంచామని, ఉదయం 11 గంటల్లోపు అన్ని స్కూళ్లను ఖాళీ చేయాలని దుండగులు హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. ఆదివారం ఉదయం ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పాఠశాల సమీపంలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. పేలుడు తీవ్రతకు ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించింది. పాఠశాల గోడ కూలిపోవడంతోపాటు సమీపంలో ఉన్న దుకాణాలు, కార్లు దెబ్బతిన్నాయి. సమీపంలోని మట్టి, అక్కడ గుర్తించిన తెల్లని పౌడర్ నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), జాతీయ భద్ర తా దళం (ఎన్ఎస్‌జీ) ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టాయి. ఇక్కడ ఎన్ఎస్‌జీ రోబోలను మోహరించింది. ఇటీవలికాలంలో బాంబు బెదిరింపులు ఓ సమస్యగా మారింది. కొద్దిరోజులుగా విమానయాన సంస్థలకు ఈ బూటకపు సందేశాలు ఎక్కువయ్యాయి. దాంతో విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇటు ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. బెదిరింపులకు పాల్పడేవారిని నోఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలు సవరిస్తున్నామని పేర్కొన్నారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు.



# విశాఖ తీరంలో అణు జలాంతర్గామి ఆవిష్కరణ

**న్యూఢిల్లీ:** అణు శక్తికి పదునుపెట్టుకోవడంలో భారత్ మరో అడుగు ముందుకు వేసింది. విశాఖ తీరంలో నౌకాదళం అణు సామర్థ్యం తో కూడిన దేశ తొలి బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థ కలిగిన 4వ జలాంతర్గామి (ఎస్ఎస్‌బీఎన్)ని ఆవిష్కరించినట్లు తెలుస్తోంది. విశాఖపట్టణంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగినట్లు సమాచారం. దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మర్నాడే ఈ కార్యక్రమం జరిగినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ ఏడాది ఆగస్టులో ఎస్ఎస్‌బీఎన్ అరిఘాత్‌ను రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నౌకాదళానికి అందజేశారు. వచ్చే ఏడాదికి ఈ శ్రేణిలో నాలుగో సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ అరిధమాన్‌ను సిద్ధం చేయనున్నట్లు నేవీ అధికారులు పేర్కొన్నారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శత్రువులను ఎదుర్కోవడంలో జలాంతర్గాములు మెరుగైన పాత్ర పోషిస్తాయని నాడు వెల్లడించారు.

# జెఎంఎంకు క్యూ కడుతున్న బిజెపి నేతలు

**రాంచీ:** జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకున్నది. ఈ నేపథ్యంలో అనేక మంది బీజేపీ నేతలు జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) పార్టీలో చేరారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యేలు లూయిస్ మరాండి, కునాల్ సారంగి, లక్ష్మణ్ తండు ఉన్నారు. మూడుసార్లు బీజేపీ టికెట్‌పై గెలిచిన కేదార్ హజ్రా కూడా ఇటీవల జేఎంఎం పార్టీలో చేరారు. బీజేపీ నుంచి 2014లో లూయిస్ మరాండి 5వేల ఓట్ల తేడాతో దుమ్కాలో సీఎం హేమంత్ సోరెన్‌పై విజయం సాధించారు. ఇప్పుడు లూయిస్ మరాండి జేఎంఎంలో చేరారు. బీజేపీ మాజీ నేతలకు స్వాగతం పలుకుతూ సీఎం హేమంత్ సోరెన్ తన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. అయితే దుమ్కా స్థానం నుంచి 2019లో హేమంత్ సోరెన్ 13వేల ఓట్ల తేడాతో లూయిస్ మరాండిపై గెలుపొందారు. అదేస్థానంలో జరిగిన ఉప ఎన్నికలో బసంత్ సోరెన్ చేతిలో లూయిస్ ఓడిపోయారు.

# జడ్జిలా చలామణి అవుతున్న వ్యక్తి అరెస్టు

**న్యూఢిల్లీ :** న్యాయమూర్తిలా చలామణి అవుతున్న ఓ మోసగాడిని అహ్మదాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్ అనే వ్యక్తి నకిలీ ట్రిబ్యునల్ ఏర్పాటు చేశాడు. దానిలో అతడే న్యాయ మూర్తి. సిటీ సివిల్ కోర్టులోని భూవివాదాల పెండింగ్ కేసులకు సంబంధించిన వ్యక్తులను ట్రాప్ చేశాడు. అనంతరం తాను ఏర్పాటు చేసిన కోర్టుకు వారిని పిలి పించి విచారణ నిర్వహించాడు. కొందరికి అనుకూలంగా తీర్పులిచ్చాడు. ఇందుకుగాను బాధితుల నుంచి కేసు స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేశాడు. ఇదిలా ఉండగా... 2019లో ఓ ప్రభుత్వ భూమికి సంబంధం చిన కేసులో ఒకరికి అనుకూలంగా తీర్పునిస్తూ ఏకంగా కలెక్టర్‌కే ఉత్తర్వులు జారీ చేశాడు. అయితే, ఆ ఉత్తర్వులు నకిలీవని కోర్టు రిజిస్ట్రార్ గుర్తించడంతో శామ్యూల్ బండారం బయటపడింది. రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఐదేళ్లుగా అతడు ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. 2015లో నిందితుడిపై చీటింగ్ కేసు నమోదైంది. తాజాగా ఈ మోసంపై పోలీసులు దర్యాప్తు

# చత్తీస్‌గఢ్‌కు యురేనియం ముప్పు

## భూగర్భజలాల్లో ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు వెల్లడి

**రాయ్‌పూర్:** చత్తీస్‌గఢ్‌లోని 6 జిల్లాల్లోని నీటిలో ప్రమాదకరమైన స్థాయిలో ''యురేనియం'' ఉందని తేలింది. అణు కార్యక్రమాల్లో ఉపయోగించే యురేనియం మోతాదుకి మించి నీటిలో ఉండటం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌ఓ) ప్రకారం.. ఒక లీటర్‌నీటిలో 15 మైక్రోగ్రాములు, ప్రభుత్వం ప్రకారం లీటర్ నీటిలో 30 మైక్రోగ్రాములతో పోలిస్తే ఆయా జిల్లాల్లోని భూగర్భ జలాల్లో యురేనియం మూడు నుంచి నాలుగు రెట్లు అధికంగా ఉంది. నీటిలో ఈ స్థాయిలో యురేనియం ఉండటం ప్రజల్లో క్యాన్సర్లు, శ్వాసకోశ రోగాలు, చర్మ, మూత్రపిండాల వ్యాధులకు కారణం అవుతుంది. చత్తీస్‌గఢ్‌లోని దుర్గ్, రాజ్‌నంద్‌గావ్, కంకేర్, బెమెతర, బలోడ్, కవార్ధా ప్రాంతాలలోని తాగు నీటి నమూనాల పరీక్షలలో లీటరుకు 100 మైక్రోగ్రాముల కంటే ఎక్కువ యురేనియం స్థాయిలు కనుగొనబడ్డాయి. 2017లో డబ్ల్యూహెచ్‌ఓ లీటర్ నీటిలో యురేనియం 15 మైక్రోగ్రాముల పరిమితికి మించకూడదని సూచించింది. అయితే డబ్ల్యూహెచ్‌ఓ భారత్ లాంటి కొన్ని దేశాల్లో ఈ పరిమితిని రెట్టింపు చేసింది. కాగా జూన్‌లో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం లీటరుకు 60 మైక్రోగ్రాముల యురేనియం ఉన్నా కూడా సురక్షితమేనని సూచించింది .అయితే, చత్తీస్‌గఢ్‌లోని ఆరు జిల్లాల్లో ఇది 100 మైక్రోగ్రాముల కన్నా ఎక్కువగా ఉంది. బలోడ్‌లోని ఒక గ్రామంలోని లీటరు నీటిని పరీక్షిస్తే అందులో యురేనియం స్థాయి 130 మైక్రోగ్రాములు ఉంది. కాంకేర్ జిల్లాలో లీటర్ నీటికి 106 మైక్రోగ్రాముల యురేనియం ఉంది. ఆరు జిల్లాల్లో సగటున లీటర్ నీటికి 86 నుంచి 105 మైక్రోగ్రాముల యురేనియం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దేశంలో ని అనేక రాష్ట్రాల్లోని భూగర్భ జలాల్లో యురేనియం ఉండటం అనేది ఆందోళన కలిగించే విషయం. గత ఏడాది జనవరిలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ఇచ్చిన నివేదిక ప్రకారం పంజాబ్, హర్యానాతో సహా 12 రాష్ట్రాల్లోని భూగర్భ జలాల్లో యురేనియం పరిమితి అనుమతించదగిన స్థాయిలను దాటిందని పేర్కొంది.

ఇందులో రెండు రాష్ట్రాలు భారతదేశంలో సగానికి పైగా గోధుమను పండించేవి ఉన్నాయి. ఆగస్టు 2022లో, బీహార్‌లోని తొమ్మిది జిల్లాల్లోని నీటిలో యురేనియం అధిక స్థాయిలో ఉన్నట్లు నివేదికలు వచ్చా యి. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకారం... 100 శాతం గ్రేడ్ యురేనియం నిక్షేపాలకు చత్తీస్‌గఢ్ కేంద్రంగా ఉంది. వీటిలో మూ డు రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోనే ఉన్నాయి. ఇక్కడ తాగునీటిలో యురేనియం ఉన్నట్లు తేలింది.

# యథాస్థితికి వస్తేనే బలగాల ఉపసంహరణ



**న్యూఢిల్లీ :** నాలుగేళ్ల కంటే ముందున్న పరిస్థితి ఏర్పడితేనే బలగాలను వెనక్కి రప్పి స్తామని సైనికాధిపతి ఉపేంద్ర ద్వివేది స్ప ష్టంచేశారు. 'ఏప్రిల్ 2020 ముందునాటి యథాతథ స్థితికి తిరిగి వెళ్లాలని అనుకుం టున్నాం. ఆ తర్వాతే బలగాల ఉపసంహ రణ, ఎల్ఏసీ వద్ద సాధారణ నిర్వహణను పరిశీలిస్తాం. 2020 నుంచి మా వైఖరి అ దే. చైనాతో సరిహద్దుల్లో విశ్వసనీయతను పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. బఫర్‌జోన్‌లోకి ప్రవేశించబో మని పరస్పరం భరోసా ఇచ్చుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది' అని పేర్కొ న్నారు. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ రెండు దేశాలు కీలక గస్తీ ఒప్పందం కుదు ర్చుకున్న నేపథ్యంలో ఆయన స్పందన వచ్చింది. తాజా ఒప్పందం ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. రెండు దేశాల సైనికులు 2020లోl గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛ గా వెళ్లొచ్చు. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్ర మ్ మిస్రీ విలేకరుల సమావేశంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. 'వాస్తవా ధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. కొన్ని వారాలుగా దౌత్య, సైనిక సంధానకర్తలు జరుపుతున్న చర్చల ఫలితంగా ఈ పురోగతి చోటుచేసుకుంది' అని ఆయన తెలిపారు.

**ఒప్పందాన్ని ధ్రువీకరించిన చైనా**

తూర్పు లద్దాఖ్‌లో ప్రతిష్టంభనకు ముగింపు పలికేందుకు భారత్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని మంగళవారం చైనా ధ్రువీకరించింది. సరిహద్దు సంబంధిత సమస్యలపై మిలిటరీ, దౌత్య మార్గాల ద్వారా రెండు దేశాల మధ్య కొంతకాలంగా సంప్రదింపులు కొనసాగాయని తెలిపింది. ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి భారత్‌తో కలిసి పనిచేస్తామని వెల్లడించింది.

# డేరా బాబాపై విచారణ

## పంజాబ్ సర్కార్ గ్రీన్ సిగ్నల్

**చండీగఢ్ :** 2015లో నిరసనలు రేకెత్తించి, పోలీసు కాల్పుల్లో ఇద్దరు ఆందోళనకారుల మృతికి కారణమైన జైలులో ఉన్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను విచారణ చేయడానికి పంజాబ్ ప్రభుత్వం అనుమతిచ్చినట్లు అధికారిక వర్గాలు మంగళవారం తెలిపాయి. మూడు బలిదానాల కేసుల్లో విచారణపై పంజాబ్‌హర్యానా హైకోర్టు విధించిన స్టేను సుప్రీం కోర్టు తొలగించిన కొద్ది రోజుల తర్వాత ఈ ఆమోదం వచ్చింది. ఫరీద్‌కోట్‌లో నమోదయిన మూడు కేసులపై విచారణను నిలిపివేసిన హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై అక్టోబరు 18న అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. హోం మంత్రిత్వ శాఖను కలిగి ఉన్న ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సోమవారం సాయంత్రం మంజూరుకు ఆమోదం తెలిపారని ఆ వర్గాలు వివరించాయి. 2017లో ఇద్దరు శిష్యులపై అత్యాచారం చేసినందుకు సిర్సా ప్రధాన కార్యాలయానికి చెందిన డేరా బాబా 20 ఏళ్ల జైలుశిక్షను అనుభవిస్తున్నారు. 16 ఏళ్ల క్రితం జర్నలిస్టును హత్య చేసిన కేసులో డేరా చీఫ్‌తో పాటు మరో ముగ్గురు కూడా 2019లో దోషులుగా నిర్ధారించబడ్డారు. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లాలోని సునారియా జైలులో శిక్ష అనుభవిస్తున్న సింగ్‌కు అక్టోబరు 2న 20 రోజుల పెరోల్ మంజూరయింది. బుర్జ్ జవహర్ సింగ్ వాలా గురుద్వారా నుంచి గురు గ్రంథ్ సాహిబ్‌కు చెందిన 'బీర్' (కాపీ) దొంగతనం, బార్గారి, బుర్జ్ జవహర్ సింగ్ వాలాలో చేతి తో రాసిన పవిత్రమైన పోస్టర్లు, బర్గారి వద్ద చెల్లాచెదురుగా దొరికిన పవిత్ర గ్రంథం చిరిగిన పేజీల సంఘటనలు 2015లో పంజాబ్ లోని ఫరీద్‌కోట్‌లో జరిగాయి. ఇవి ఫరీద్‌కోట్‌లో మత వ్యతిరేక నిరసనలకు దారితీ శాయి. అక్టోబరు 2015లో మత విద్రోహ నిరసనకారులపై పోలీసులు జరిపి న కాల్పుల్లో బెహబల్ కలాన్‌లో ఇద్దరు వ్యక్తులు మరణించగా, కొందరు వ్యక్తు లు గాయపడ్డారు. 2022లో అదనపు పోలీ స్ డైరెక్టర్ జనరల్ ఎస్.పి.ఎ స్.పర్మార్ నేతృత్వంలోని పంజాబ్ పోలీసు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) డే రా సచ్చా సౌదా చీఫ్‌ను మూడు హత్యా కాండల్లో ప్రధాన కుట్రదారులలో ఒక రిగా అభియోగాలు మోపింది. దీంతో భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 295ఎ (మతపరమైన భావాలను దెబ్బ తీయడం) కింద ఎవరినైనా విచారణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరం. అయితే ఈ కేసుల విచారణ కు సీబీఐకి ఇచ్చిన సమ్మతిని ఉపసం హరించు కుంటూ రాష్ట్ర ప్రభుత్వం 2018 సెప్టెంబరు 6న జారీ చేసిన నోటిఫి కేషన్ చెల్లుబాటును సవాలు చేయడంతో మార్చిలో హైకోర్టు డేరా చీఫ్‌పై హత్యాకాండ కేసులపై విచారణ ను నిలిపివేసింది.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
బుధవారం, అక్టోబరు 23

# 'సెక్యులరిజం' చేర్పు సబబే

సెక్యులరిజం (లౌకికవాదం) అనే పదాన్ని రాజ్యాంగం పీఠికలో చేర్చటాన్ని ముస్లిం మైనారిటీలకు బుజ్జగింపుగా, హిందువులకు వ్యతిరేకమైనదిగా భావించే, వాదించే శక్తులకు మన దేశంలో కొదవలేదు. రాజ్యాంగం పీఠిక రాజ్యాంగం మౌలిక స్వరూపం కిందకు వస్తుందని, దాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసిన తర్వాత కూడా హిందూత్వశక్తులు మింగలేక కక్కలేక మండిపడుతుంటాయి. సూక్ష్మంగా చరిత్రలోకి వెళితే 'సెక్యులరిజం', 'సోషలిజం' పదాలను 1976లో – ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధి ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో చేర్చింది. ఈ భావాలు రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్నాయని, వాటిని స్ఫూర్తిమంతం చేస్తూ రాజ్యాంగ పీఠికలో చేర్చి స్పష్టత ఇచ్చామన్నది ప్రభుత్వ వాదన. ఇప్పటి భారతీయ జనతాపార్టీ (బిజెపి) పూర్వావతారమైన జనసంఘ్, నాడు దానితో మిత్రత్వం చేసిన సిండికేట్ కాంగ్రెస్, స్వతంత్ర పార్టీ ఇందిరాగాంధి చర్యను ఆనాడే ఖండించాయి. అయితే 1977లో జనతా పార్టీ పేరుతో ఆ మితవాద అభివృద్ధి నిరోధక శక్తులు అధికారంలోకి వచ్చినా రాజ్యాంగాన్ని సవరించే బలం పార్లమెంటులో లేనందున ఆ జోలికి పోలేదు. అంతేగాక అంతర్గత కుమ్ములాటలతో రెండేళ్లలోనే కూలిపోయింది. 1980లో ఇందిరాగాంధి కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చారు. 1999లో వాజ్‌పేయి నాయకత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం రాజ్యాంగ సమీక్ష పేరుతో ఒక కమిషన్‌ను నియమించినా మిత్రపక్షాల వ్యతిరేకతవల్ల రాజ్యాంగ సవరణ జోలికి వెళ్లలేదు. గత పదేళ్లకుపైబడి అధికారం చెలాయిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంత ఏకపక్షంగా పనిచేస్తూ వ్యవస్థలన్నిటినీ ధ్వంసం చేస్తున్నా రాజ్యాంగ సవరణ జోలికి వెళ్లలేదు. అయితే రాజ్యాంగ రచయిత బిఆర్ అంబేద్కర్ భయపడినట్లు రాజ్యాంగాన్ని సవరించకుండానే రాజ్యాంగ వ్యవస్థలను కుళ్లబొడుస్తూ లోపలినుండి దాన్ని నిర్వీర్యం చేస్తోంది. సంపూర్ణాధికారానికై మోదీ అభిమాన ప్రాజెక్టు జమిలి ఎన్నికలను సాధ్యం చేసే రాజ్యాంగ సవరణలను సూచించే నిమిత్తం మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఛైర్మన్‌గా కమిటీని నియమించింది. దాని నివేదిక అమలుకు ప్రయత్నాలు చేస్తోంది. రాజ్యాంగం పీఠికలో 'సెక్యులరిజం', 'సోషలిజం' పదాలతో పట్టింపుకుపోకుండా మైనారిటీలను అణచివేస్తూ హిందూత్వను ప్రోత్సహిస్తోంది; సోషలిస్టు భావనకు భిన్నంగా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అమలు చేస్తోంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మోదీ కోరిన 400సీట్లను ఓటర్లు తిరస్కరించి కనీస మెజారిటీకూడా ఇవ్వకుండా మోదీ ఆశలపై నీళ్లు చల్లారు.

అయినా రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రమణియన్ స్వామి, అడ్వొకేట్ విష్ణుశంకర్ జైన్ తదితరులు ఆ రెండు పదాలను రాజ్యాంగం పీఠికలో చేర్చటాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లపై జస్టిస్‌లు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన బెంచి సోమవారం చాలా స్పష్టత ఇచ్చింది. స్వామివాదన ఏమంటే, ''1949 నవంబర్ 26న రాజ్యాంగం పీఠిక ప్రకటించబడింది. ఉత్తరోత్తరా సవరణ ద్వారా కొత్త పదాలను అందులో చేర్చటం నిరంకుశం. అందువల్ల దేశాన్ని సోషలిస్టు, సెక్యులర్ రిపబ్లిక్‌గా తయారు చేస్తామనే ప్రస్తుత పీఠికను భారత ప్రజలు 1949 నవంబర్ 26న అంగీకరించినట్లు చెప్పటం తప్పు. పీఠికను మార్పు చేయటాని కి, సవరించటానికి లేదా రద్దు చేయటానికి వీల్లేదు''. అయితే 'సెక్యులరిజం' రాజ్యాంగ పీఠిక లో ఎల్లప్పుడూ అంతర్భాగంగా ఉందని సుప్రీంకోర్టు బెంచి స్పష్టం చేసింది. 'ఈ కోర్టు అనేక తీర్పుల్లో, సెక్యులరిజం ఎల్లప్పుడూ రాజ్యాంగం మౌలిక స్వరూపంలో భాగమని చెప్పింది. రాజ్యాంగంలో ఉపయోగించిన 'సమానత్వ హక్కు', 'సౌభ్రాత్వం' అనే పదాలను చూచినట్లయితే 'సెక్యులరిజం' పదం రాజ్యాంగం ముఖ్య లక్షణంగా స్పష్టమవుతుంది' అని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ''సెక్యులరిజం'' గూర్చి చర్చ జరిగినప్పుడు ఫ్రెంచి నమూనా మాత్రమే ఉంది. సెక్యులరిజానికి వ్యతిరేకమైన చట్టాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆర్టికల్ 25 చూడండి. సోషలిజానికి సంబంధించి మనం పశ్చిమ దేశాల నమూనాను అనుసరించలేదు. సంతోషం. సోషలిజానికి అనేక అర్థాలున్నాయి. సోషలిజానికి అందరికీ సరైన అవకాశాలు అనే అర్థం కూడా ఉంది – అదే సౌభ్రాత్ర భావన, దాన్ని పశ్చిమ భావనగా తీసుకోవని లేదు. 'సెక్యులరిజం' పదం విషయం కూడా అంతే'' అన్నారు జస్టిస్ సంజీవ్ ఖన్నా. తుది తీర్పు ఎలా ఉంటుందో ఊహించటం కష్టం కాదు.

# భారతీయ విద్యా విధానమా..నీ పయనం ఎటు?



డా.మార్క శంకర్ నారాయణ
9908416664

ప్రాథమిక హక్కు కంటే విద్య ఉన్నతమైనది .... యూనిసెఫ్

ఏ దేశ ప్రగతైనా ఆ దేశం అవలంబించే విద్యా విధానంపైన, పాలకులు తీసుకునే విధాన నిర్ణయాలపైననే ఆధారపడి ఉంటుంది. విద్యారంగంలో ప్రగతిని సాధించిన దేశాలే జీవన ప్రమాణాల్లోగాని, ఆర్థిక ప్రమాణాల్లోగాని ముందున్నాయి. జ్ఞానము, సంపద, భూమి, పెట్టుబడి, ఆరోగ్యం పెట్టుబడిదారుల పరమవుతా ఉంటే జనజీవనం పరాధీనమవుతున్నది. ఈ స్థితిలో భారతీయ విద్య కొనసాగుతుంది. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర పాలకులు అవలంబించే విధానాలవల్ల మొత్తం విద్యారంగమంతా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. విద్య సామాజిక మార్పుకై దోహదపడాలి. విద్య వ్యక్తి స్వేచ్ఛను పెంపొందించాలి. విద్య వ్యక్తి సామర్థ్యాన్ని పెంపొందించాలి. విద్య ఉపాధికి మార్గాన్ని చూపాలి. విద్య ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి. ఇవన్నీ ప్రస్తుత విద్యలో దినదినం కరువైపోతున్నాయి.

నిజానికి విద్య అంటే అంబేద్కర్ మహనీయుడన్నట్లు 'ఏదైతే వ్యక్తిని భయంలేకుండా చేస్తుందో, ఏదైతే ఐక్యతా పాఠాన్ని బోధిస్తుందో, ఏదైతే అతని హక్కులేంటో తెలుసుకునేటట్లు చేస్తుందో, ఏదైతే అతని హక్కుల కోసం పోరాడటానికి అతనిని ప్రేరిపిస్తుందో' అదే విద్య. ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఒక భయకంపిత వాతావరణం నెలకొని ఉన్నది. మార్కులే గీటురాయిగా విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరు గుతున్నది. కులవ్యవస్థకు వ్యతిరేకమైన భావనను విద్యార్థుల్లో పెంపొందించే దృక్పథం రోజురోజుకు కరువవుతుంది. దీనికి సాక్ష్యం రాజస్థాన్‌లో ఒక ప్రైవేట్ పాఠశాలలో అగ్రవర్ణాల వారు మాత్రమే ఉపయోగించే కుండలోని నీటిని తాగినందుకు జులై 20, 2022 న ఒక ఉపాధ్యాయుడు కొట్టిన కారణంగానే తొమ్మిదేళ్ల ఇంద్ర మేఘవాల్ అనే దళిత బాలుడు మరణించాడు. భారతీయులంతా ఒక్కటే అనే గొప్పనైన భావనను విద్యాసంస్థలు పెంపొందించాలి. కానీ దీనికి భిన్నంగా ముజాఫర్‌నగర్‌లోని ఒక పాఠశాలలో విద్యార్థుల్లో విద్వేష భావనల్ని పెంపొందించే విధంగా ఆగస్టు 25, 2023న ఒక ముస్లీమ్ బాలున్ని తరగతిగదిలోని హిందూ విద్యార్థులందరిచే చెంపలను కొట్టిన తీరు హృదయ విదారకంగా ఉంది.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే వాతావరణమే లేకుండా పోయింది. చాలా చిత్రమైన విషయమేమిటంటే పాఠ్యాంశాల హేతుబద్ధీకరణ పేరుతో 10వ తరగతికి సంబంధించిన ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకం నుండి చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంత పాఠాన్ని ప్రభుత్వం తొలగించింది. ఇలా అనేక పాఠాలను తొలగించారు. 1800మంది శాస్త్రవేత్తలు ఈ చర్యను నిరసించారు. విద్యారంగంలో మార్కెట్ శక్తుల ప్రవేశం ఆంగ్లభాషపై మోజును, ఆ సక్తిని సమాజంలో పెంచింది. నిజానికి మాతృభాషకు మించిన భాష లేదు. ఆ నగ్న సత్యాన్ని సమాధి చేశారు. కనీసం సెకండరీ స్థాయివ రకైనా మాతృభాషలోనే చదవాలనే నియమాన్ని తప్పనిసరి చేయలేక పోయారు. మొట్టమొదటి జాతీయ విద్యా విధానం 1968 చైర్మన్ డి.ఎస్ కొఠారి చాలా స్పష్టంగా 'భారతదేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుతుంది. అసమానతలతో నిండి ఉన్న భారత సమాజం పురోగమించాలంటే ఉమ్మడి పాఠశాల ఒక్కటే పరిష్కారం' అని పేర్కొన్నారు. అంటే విద్యారంగమంతా ప్రభుత్వ విద్యారంగంలోనే ఉండాలి. అందువల్ల ప్రయివేట్ పాఠశాలలన్నీ జాతీయం చేయాలి అంటే ప్రభుత్వపరం చేయాలి. అప్పుడు దొర బిడ్డయినా, పాలేరు బిడ్డయినా, సర్పంచ్ బిడ్డయినా, ఎంపి బిడ్డయినా, ఏ ప్రజాప్రతినిధి బిడ్డయినా, చివరకు సారు బిడ్డయినా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారు. అప్పుడది ప్రజల బడి అయితది. ఆ పాఠశాల అభివృద్ధి కోసం అందరూ పాటుపాడుతారు. రాష్ట్రంలో 2,560 మంది విద్యార్థులతో, 120 మంది టీచింగ్ సిబ్బందితో ప్రభుత్వ విద్యకోసం సమీకృత పాఠశాలల ఏర్పాటు ఆహ్వానించదగ్గ విషయమే అయినా చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సమీకృత పాఠశాలలో చేరితే, అప్పుడు ఆ పాఠశాలలో విద్యార్థులు లేరనే సాకుతో ఆ పాఠశాలలన్నీ మూసివేతకు దారితీయ్యవా! అందువల్ల గ్రామాల్లో ఉన్న ప్రతీ ప్రభుత్వ పాఠశాలను సమీకృత పాఠశాలగా అభివృద్ధి చేస్తే ఒక పరిష్కారం అవుతుంది.

ఒక్కసారి తెలంగాణా విద్యా చిత్రాన్ని చూస్తే తెలంగాణ రాష్ట్రంలో 41,360 పాఠశాలలుంటే అందులో 26వేల పాఠశాలలు ప్రభుత్వ రంగానికి సంబంధించినవి. జూనియర్ కాలేజీలు 2900 ఉంటే అందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 410; డిగ్రీ కళాశాలలు 1000 ఉంటే అందులో 147 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు. దీన్నిబట్టి విద్యారంగమంతా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే ఉంది అని స్పష్ట మవుతుంది. పాలకులు విద్య ఒక సామాజిక బాధ్యత అనే విషయాన్ని పక్కకునెట్టి, విద్యను ఒక పెట్టుబడిగా చూసారు. ఫలితంగా, విద్యారంగమంతా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమైంది. ఈ స్థితిలో దేశాభివృద్ధిని ఎలా ఆశించగలం.

ప్రయివేట్‌రంగం ఎప్పుడైనా లాభమే లక్ష్యంగా పయనిస్తది. అప్పుడది మనిషిని కూడా వాణిజ్య సరుకుగానే మార్చేస్తుంది. విద్య అనేది సరుకు కాదు, అది మానవుణ్ణి ఉన్నతంగా తీర్చిదిద్దే భావజాల ప్రక్రియ అనే భావన ప్రయివేట్ శక్తులకు ఉండదు. ఐటి ఉద్యోగం భావన రోజురోజుకు పెరిగిపోతున్నది. మెజారిటీ ఇంజనీరింగ్ కళాశాలలు ప్రయివేట్‌లోనే ఉండడంవల్ల ఇంజనీరింగ్ విద్య సంపన్న వర్గాలకే అందుబాటులో ఉంది. ఇంజనీరింగ్ విద్య పేద విద్యార్థులకు దక్కకుండా పోయి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. అందువల్ల ప్రభుత్వరంగంలో సరిపోయినన్ని ప్రభుత్వ ఇంజనీరింగు కళాశాలలు నెలకొల్పాలి.

రాష్ట్రంలో జిల్లా కొక్క వైద్యకళాశాల పేరిట 27 వైద్యకళాశాలలు ఏర్పరచారు కానీ సరిపోయేంత అధ్యాపకులను, మౌలికవసతులను కల్పించాలి. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలన్నీ ఆచార్యులలేమితో విలవిలలాడుతున్నయి. కాంట్రాక్టు, అతిథి, పార్ట్ టైం అధ్యాపకులతో బోధన కొనసాగుతున్నది. ఈ స్థితిలో విద్యా ప్రమాణాలు ఎలా అభివృద్ధి అవుతాయో పాలకులకే తెలియాలి. ఎంత అత్యాధునిక విద్యకైనా 'సాంప్రదాయక డిగ్రీ కోర్సులు' పునాది అనే అంశాన్ని పక్కకు నెట్టి, వాటిని నిర్లక్ష్యం చేసే స్థితి రోజు రోజు పెరిగిపోతున్నది. మరోవైపు డిగ్రీ కళాశాలన్నింటిని గ్రేడులుగా వర్గీకరించి దాని ఆధారంగా నిధులు కేంద్ర పాలకులు కేటాయిస్తున్నారు. ఇది సామాజిక న్యాయానికి, సమాన అవకాశాలకు పెద్ద ఎత్తున విఘాతాన్ని కలిగిస్తుంది.

జాతీయ విద్యా విధానం–2020 భారత రాజ్యాంగం వెలుగులోనే నడుస్తుందని చెప్పకపోగా, నాలుగవ పేజీ రెండో పేరాలో ప్రాచీన సనాతన భారతీయ జ్ఞాన పరంపర మరియు ఆలోచన జాతీయ విద్యా విధానం–2020కి మార్గదర్శనంగా ఉంటుందని పేర్కొంది. అంతేకాదు విద్యలో ప్రైవేట్ శక్తులకు భాగస్వామ్యం కల్పించాలని పేజీ నంబర్ ఆరులో చాలా స్పష్టంగా పేర్కొంది. అనేక అశాస్త్రీయ అంశాలతో నిండి ఉన్న ఎన్‌ఇపి–2020ని అనుసరించని కేరళ రాష్ట్రం బాటలో పయనిస్తే తెలంగాణ రాష్ట్రానికి శ్రేయస్కరం. దేశమంతా అనేక ప్రగతిశీల విద్యార్థి సంఘాలు ఎన్‌ఇపి–2020ని రద్దు చేయాలని నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యకు బడ్జెట్ 11శాతం కేటాయిస్తే ఇప్పుడది తెలంగాణ రాష్ట్రంలో 7.31శాతానికి పడిపోయింది.



ఢిల్లీ, కేరళ రాష్ట్రాలను తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతీ సంవత్సరం డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయుల నియామకాల ప్రక్రియను చేపట్టాలి. విద్యార్థుల్లో ఉన్న అమూర్త జ్ఞానాన్ని, యాంత్రిక జ్ఞానాన్ని, సాంఘిక జ్ఞానాన్ని వెలికితీసే విద్యకావాలి. దానికోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి.

నిజానికి డిఎస్ కొఠారి విద్యకు రాష్ట్రాలు 30% బడ్జెట్ కేటాయించాలనే సూచనను చేశారు. మరోవైపు ఢిల్లీ రాష్ట్రం విద్యకు 25% కేటాయిస్తే, కేరళ 20% బడ్జెట్ కేటాయించింది. ఢిల్లీ, కేరళ రాష్ట్రాలను తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతీ సంవత్సరం డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల నియామకాల ప్రక్రియను చేపట్టాలి. విద్యార్థుల్లో ఉన్న అమూర్త జ్ఞానాన్ని, యాంత్రిక జ్ఞానాన్ని, సాంఘిక జ్ఞానాన్ని వెలికితీసే విద్యకావాలి. దానికోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి.

నిజానికి ఉత్పత్తి క్రమంలో ఏర్పడిన జ్ఞానమంతా సామాజిక వారసత్వ సంపద. నేడు ఈ జ్ఞానం సమాజం నుండి వేరుపడ్డ కార్పొరేట్ ప్రైవేటు శక్తుల్లో కేంద్రీకృతమైంది. ఫలితంగా విద్య మొత్తంగా బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు దక్కకుండా పోయి, భారత రాజ్యాంగంలో రాసుకున్న స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం అనే విలువలు తెరమరుగవుతాయి.

# ప్రపంచ పేదరిక కేంద్రంగా భారతం!

8.2 బిలియన్ల ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తున్న పలు సమస్యలకు పేదరికమే ప్రధాన కారణమని, పేదరికం ఓ బహువ్యాధి లక్షణంగా మారిందని మనకు తెలుసు. మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన నిరక్షరాస్యత, అధిక జనాభా, ప్రజారోగ్యం, అసమానతలు, లింగ వివక్ష, పర్యావరణ కాలుష్యం, నిరుద్యోగం, పారిశుధ్యలోపం లాంటి అంశాలు పేదరికంతో సమీప సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 112 దేశాలకు సంబంధించిన 6.3 బిలియన్ (630 కోట్లు) ప్రజల ప్రపంచ బహుమితీయ పేదరిక సూచికలను ఐరాస అనుబంధ సంస్థలు అధ్యయనం చేసి నివేదికను రూపొందించడం జరిగింది. ఐరాస డెవలప్‌మెంటల్ ప్రోగ్రామ్(యుఎన్‌డిపి), ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్(ఒపిహెచ్ఐ)లు సంయుక్తంగా ఈ నివేదికను తయారు చేశాయి. గృహ వసతులు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వంట గ్యాస్/ఇంధనాలు, పోషకాహారం, విద్యార్థుల పాఠశాలల హాజరు లాంటి ప్రధాన అంశాలను అధ్యయనం చేసి బహుమితీయ పేదరిక సూచిక–2024 (మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్, ఎంపిఐ2024)లను నిర్ణయించి నివేదిక రూపొందించారు.

**అల్ప, మధ్యాదాయ దేశాల్లో కోరలు చాచిన పేదరికం:**

పారిశుద్ధ్యలోపంతో 828 మిలియన్లు, గృహ వసతులు లేని వారు 886 మిలియన్లు, వంట గ్యాస్ లేని వారు 998 మిలియన్లు ఉన్నారని, 110 కోట్ల ప్రపంచ పేదల్లో 637 మిలియన్ల పేద పిల్లలకు పోషకాహారం అందడం లేదని వెల్లడవుతున్నది. దక్షిణ ఆసియాలో 272 మిలియన్లు, సబ్‌సహార ఆఫ్రికా ప్రాంతాల్లో 256 మిలియన్ల పేదలకు కనీస పోషకాహారం అందడం లేదని తెలుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 83.2శాతం పేదలు సబ్‌సహారా, దక్షిణ ఏసియా ప్రాంత దేశాల్లోనే ఉన్నారని పేర్కొనబడింది. అల్పాదాయ దేశాల్లో 34.8శాతం, మధ్య ఆదాయ దేశాల్లో 65.2 శాతం మంది కడు పేదలు ఉన్నారని నివేదిక వెల్లడించింది. ప్రపం చ పేదల్లో 83.7 శాతం వరకు గ్రామీణ బడుగులే ఉన్నారని తేలింది. ప్రపంచ జనాభాలో 28 శాతం గ్రామీణులు, 6.6 శాతం పట్టణ ప్రాంత పేదలు ఉన్నట్లు నివేదిక తెలిపింది.

**ప్రపంచ పేదరిక కేంద్రంగా భారతం !**

ప్రపంచవ్యాప్తంగా 1.1బిలియన్ల (110కోట్ల) ప్రజలు కడు పేదరికంలో మగ్గుతున్నారని, పేదరికం అత్యధికంగా భారత్, పాకిస్థాన్ దేశాల్లోనే ఉందని తాజాగా విడుదల చేసిన ఐరాస ప్రపంచ బహుమితీయ పేదరిక సూచిక 2024 (యుఎన్ గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ 2024) నివేదిక స్పష్టం చేస్తున్నది. అత్యధికంగా భారత్‌లో 234 మిలియన్లు, పాకిస్థాన్‌లో 93 మిలియన్లు, ఇథియోపియాలో 86మిలియన్లు, నైజీరియాలో 74మిలియన్లు, కాంగోలో 66 మిలియన్ల పేదలు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ప్రపంచ పేదల్లో 48.1శాతం ఈ ఐదు దేశాల్లోనే ఉన్నట్లు తేలింది. ఐరాస అధ్యయనం చేసిన దేశాల బహుమితీయ పేదరిక సూచిక జాబితాలో భారత్ 105వ స్థానంలో నిలిచింది. 18ఏండ్ల లోపు వయస్సు కలిగిన కడు పేదలు దాదాపు 584 మిలియన్లు, అనగా 27.9శాతం ఉండగా, పెద్దలు 13.5శాతం ఉన్నట్లు వర్ణించబడింది. భారత పేదల్లో 13.7శాతం జనాభా పోషకాహారలోపంతో, 35.5శాతం ఐదేళ్ల లోపు పిల్లలు వయసుకు తగిన ఎత్తు లేకపోవడం(స్టంటెడ్ గ్రోత్), 18.7శాతం ఎత్తుకు తగిన బరువు లేకపోవడం(వేస్టింగ్), 2.9 శాతం పిల్లలు ఐదేళ్ల లోపు అకాల మరణాల బారినపడడం గమనించారు. తరతరాలుగా పోషకాహార లోపాలు, ఆర్థిక అసమానతలు, అవిద్య, అనారోగ్యాలు, లింగ వివక్ష లాంటి కారణాలే పేదరికం రూపంలో భారతాన్ని పట్టి పీడిస్తున్నది.



**విపత్తు/ఘర్షణాత్మక/యుద్ధ ప్రాంత దేశాలు:**

2వ ప్రపంచ యుద్ధం తర్వాత 2023లోనే యుద్ధాలు/ఘర్షణలు/వివాదాస్పద ఘటనలు అధికంగా నమోదు అయ్యాయని, వీటి పర్యవసానంగా 117 మిలియన్ల ప్రజలు ఖాళీ చేతులతో వలసలు వెళ్లినట్లు, ఆకలి చావుల అంచున దీనస్థితుల్లో బతుకులు ఈడుస్తున్నట్లు తేలింది. ప్రపంచ వ్యాప్త 110కోట్ల పేదల్లో దాదాపు 40 శాతం వరకు అనగా 455 మిలియన్ల ప్రజలు ఈ ప్రాంతాలకు చెందిన వారే అని పేర్కొనబడింది. వీటిలో 218మిలియన్ల ప్రజలు యుద్ధ ప్రాంతాల్లో, 335 మిలియన్ల ప్రజలు ఘర్షణాత్మక ప్రాంతా ల్లో, 375 మిలియన్లు అశాంతియుత సమాజ ప్రాంతాల్లో ఉన్నారని వివరించబడింది.


2023నాటికి ఇజ్రాయిల్ దాడితో పాలస్తీనా గాజా ప్రాంత ప్రజలు 83శాతం వలసల బాట పట్టారని, 60 శాతం వరకు ఇండ్లు నేల మట్టం అయ్యాయని స్పష్టం చేసింది. పేదరికానికి కారణాలను అధ్యయనం చేయడం, ఆయా కారణాలకు తగిన పరిష్కారాలకు పథక రచనల అమలు చేయడం, జీవన ప్రమాణాలను పెంచడం, గ్రామీణులకు కనీస వసతులు పెంచడం, పోషకాహార భద్రత కల్పించడం, నిలువ నీడను ఏర్పాటు చేయడం, పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయడం లాంటి చర్యలు ప్రపంచ పేదరికాన్ని, ముఖ్యంగా భారతదేశ పేదరికాన్ని అదుపు చేస్తాయని గమనించి ప్రభుత్వాలు/పౌర సమాజం/స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరుకుందాం. పేదరికం లేని ప్రపంచ కలలను సాకారం చేసుకుందాం.

**(ఐరాస విడుదల చేసిన ప్రపంచ బహుమితీయ పేదరిక సూచిక –2024 తాజా నివేదిక ఆధారంగా)**

# రసాయనశాస్త్రంలో కొలమానం మోల్

బజారుకి వెళ్లి సరుకులు కొన్నప్పుడు కొన్ని కొలమానాలు వాడతాం. డజను అరటి పళ్లు, వంద మామిడి పళ్లు, కుంచం బియ్యం, శేరు పాలు, వీశ వంకాయలు, బుట్టెడు రేగు పళ్లు, ఇలా ఉండేవి పాతరోజుల్లో కొలమానాలు. ఇంట్లో వంట వండేటప్పుడు చేరెడు బియ్యం, చిటికెడు పసుపు, ఇందుపగింజంత ఇంగువ, అంటూ మరొక రకం కొలమానం వాడేవారు. అదే విధంగా రసాయన శాస్త్రంలో అణువులు, పరమాణువులు వగైరా రేణువులు ఎన్ని ఉన్నాయో కొలవడానికి 'మోల్' అనే కొలమానం వాడతారు.

డజను అంటే 12 వస్తువులు, జత అంటే 2 వస్తువులు, పుంజీ అంటే 4వస్తువులు, అయినట్లే మోల్ అంటే 602, 000,000,000,000,000,000,000వస్తువులు లేదా 602 హెక్సిలియను వస్తువులు. ఇది మన ఊహకి అందనంత పెద్ద సంఖ్య. ఉదాహరణకి ఒక మోలు చింతపిక్కలని పోగుపోసి ఉండలా కడితే ఆ ఉండ మన భూమి అంత పెద్ద గోళం అవుతుంది. ఏదైనా పదార్థం యొక్క ఒక మోల్‌లోని యూనిట్ల సంఖ్యను అవగాడ్రో సంఖ్య లేదా అవోగాడ్రో స్థిరాంకం అంటారు. ఇది 6.022140857x10 23కి సమానం. ప్రతిచర్య స్వభావం, పదార్థం యొక్క స్వభావాన్ని బట్టి యూనిట్లు ఎలక్ట్రాన్లు, అయాన్లు, లేదా అణువులు కావచ్చు. మోల్ డే అనేది విద్యావేత్త మార్గరెట్ క్రిస్టోఫ్ యొక్క వేడుక నుండి ఉద్భవించింది. ఆమె 1980లలో ది సైన్స్ టీచర్‌లో తన అనుభవాల గురించి ఒక వ్యాసం రాసింది. ఈ కథనం ద్వారా ప్రేరణ పొంది, విస్కాన్సిన్‌లోని ప్రైరీడు చియెన్‌కు చెందిన ఒక ఉన్నత పాఠశాల కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలు మారిస్ ఓహ్లర్ మే 15, 1991న నేషనల్ మోల్ డే ఫౌండేషన్ ని స్థాపించారు. మోల్ దినోత్సవం రసాయన శాస్త్రవేత్తలు, రసాయన శాస్త్ర విద్యార్థులు, రసాయన శాస్త్ర ఔత్సాహికులు ప్రతి ఏటా అక్టోబరు 23న ఉదయం 6:02 మరియు సాయంత్రం 6:02 గంటల మధ్య జరుపుకుంటారు.




(అక్టోబర్ 23 జాతీయ మోల్ దినోత్సవం)

సుధాకర్ ఎవి, 9000674747

# రాడార్ చుట్టూ నడుస్తున్న రాజకీయం



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

దేశ రక్షణ కొరకు దామగుండంలో ఏర్పాటుచేస్తున్న రాడార్ సెంటర్‌తో ఎలాంటి ముప్పు ఉండదని, పర్యావరణానికి ప్రజలకు ఎలాంటి హాని జరగదని అక్టోబర్ 15న వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలోని పూడూరు దగ్గర 'వెరీ లో ఫ్రీక్వెన్సీ' (వివిఎల్ఎఫ్) రాడార్ సెంటర్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ శంకుస్థాపన చేస్తూ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ 'రాజకీయాలు వేరు.. దేశ భద్రత వేరు. దేశ భద్రత విషయంలో రాజకీయాలు చేయడం సరికాదు. రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాదుకు మంచి పేరు ఉంది. ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న రాడార్ సెంటర్ కూడా దేశభద్రతలు కీలకంగా మారనుంది. తద్వారా దేశ రక్షణలో తెలంగాణ భాగస్వామి అవుతుంది' అని రాజ్ నాథ్ సింగ్ అన్నారు. రాడార్ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ..అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఆ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'రాడార్ సెంటర్ అంశాన్ని కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల నష్టం జరుగుతుందని ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. దేశరక్షణ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా రాజకీయం చేయడం సరికాదు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని 'దామగుండం' అటవీ ప్రాంతంలో భారత నావికాదళం ( ఇండియన్ నేవీ)నిర్మించ తలపెట్టిన వివిఎల్ఎఫ్ స్టేషన్ నిర్మాణానికి రూ. 3,500కోట్లతో విస్తరించటానికి కేంద్ర రక్షణ శాఖ మంజూ రు చేసింది. ఇందుకోసం 2900 ఎకరాల అటవి భూమి ని బిఆర్ఎస్ ప్రభుత్వం జిఒ నెంబర్ 44 ద్వారా 2017లోనే కేటాయించింది. అందుకు రూ.133 కోట్లు కేంద్రం విడుదల చేసిందని వివరించారు.

**వివిఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ అంటే?**

దీని ద్వారా సముద్రంలో దూర ప్రాంతంలో ఉన్న ఓడలు, జలంతర్గములోని సిబ్బందితో నావికా సిబ్బంది సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవచ్చును. ఈ వ్యవస్థ మూలంగా 3 కేజీహెచ్ జెడ్ రేంజ్‌లో తరంగాలను ప్రసారం చేస్తుంది. నీటి లోపల 40 మీటర్ల లోతువరకు ఈ తరంగాలు చొచ్చుకెల్తాయి. అలాగే 1000 కిలో మీటర్ల దూరంలో ఉన్న వారికి సిగ్నల్స్ నిరాఘాటంగా అందించటానికి వీలవుతుంది. రక్షణరంగం అవసరాలతో పాటు, రేడియో కమ్యూనికేషన్ అవసరాలకు కూడా ఉపయోగపడుతుంది. ఇలాంటిది ఇప్పటివరకు మనదేశంలో తమిళనాడు 'తిరునల్వేలిలో ' ఉంది.

**దామగుండంనే ఎందుకు ఎన్నిక చేసుకున్నారు?**

తెలంగాణలో సముద్రం లేదు. అయినా ఈ నిర్మాణం ఇక్కడే ఎందుకు?అనేది పెద్ద ప్రశ్న. నేవీ అధికారులు చెప్పేదేమిటంటే.. తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రంలో ఉన్న ఓడలు, జలాంతర్గాములలోని సిబ్బందితో మాట్లాడటానికి వీలుగా ఈ రెండు ప్రాంతాలకు మధ్యలో తెలంగాణలోని దామగుండం ప్రాంతం సాంకేతికంగా అనువుగా ఉండటం. దామగుండం సముద్రమట్టానికి 360అడుగుల ఎత్తున ఉంది. రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు 70కి.మీ దూరంలో ఉండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా దీని అధికారులు చెబుతున్నారు. ఈ స్థలం ఎన్నిక 2013 లోనే నిర్ణయించి నప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చోప చర్చలు జరిగిన తర్వాతనే 2017 లో నిర్ణయానికి రావడం జరిగింది.

**రాడార్ వలన పర్యావరణానికి నష్టం ఉందా?**

నేవి తీసుకొనే మొత్తం వైశాల్యం 2,900ఎకరాలు.. ఇందులో 1500 ఎకరాల్లో ఎలాంటి కార్య కలాపాలు నేవీ చేపట్టటం లేదు. పర్యావరణానికి నష్టంలేకుండా మొక్కలు, చెట్లులేని ప్రాంతంలో 350ఎకరాల్లోనే సుమారు 3000 మందికి నివాసం ఉండే విధంగా ఓ టౌన్‌షిప్‌ను నిర్మిస్తారు. ఇక్కడ 600మంది సిబ్బంది తమ విధులు నిర్వహిస్తారు. అయితే 350 ఎకరాలలో ఉన్న చెట్లను తీసి ఖాళీ స్థలంలో రీ ప్లాంటేషన్ చేస్తామని, అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ కోసం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటుతారని తెలుపుతున్నారు.. లో ఫ్రీక్వెన్సీ వలన పర్యావరణానికి ఎలాంటి నష్టం ఉండదని తెలుపుతున్నారు.

అయితే ఈ రాడార్ ప్రాజెక్టు నిర్మాణంలో 12 లక్షల చెట్లు నరికివేతకు గురవుతాయని పర్యావరణ ప్రేమికులు చేసే ప్రచారం వాస్తవం కాదని, రాడార్ కేంద్రాలకు అవసరాల కోసం ఆఫీసులు, టౌన్ షిప్ కొరకు ఉపయోగించే ఏరియాలో సుమారు 1,90,000 వేల చెట్లు నరికి వేయాల్సి ఉంటుందని.. అందుకు ఒక చెట్టుకు 5 చెట్లు అదనంగా పదివేల చెట్లను నాటుతామని..అందుకు గాను కేంద్ర రక్షణ శాఖ ఇప్పటికే రూ.133 కోట్లు గత ప్రభుత్వానికి చెల్లించిందని తెలుపుతున్నారు. నావికా రాడార్ కేంద్రానికి తీసుకున్న ఫారెస్ట్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేస్తామని..దానివలన ఫారెస్టుకు రక్షణతో పాటు, అక్రమ కలప రవాణాను నిరోధించ బడుతుందని చెపుతున్నారు. మూసీనది పరీవాహక ప్రాంతం దెబ్బతింటుందని చెప్పేది కూడా నిజం కాదని, దామగుండం ఎత్తైన ప్రదేశమైన ఫారెస్ట్ నుండి వచ్చే వరదనీరు పశ్చిమం వైపు ప్రయాణిస్తూ కాగ్నా నదిలో కలుస్తూ కర్ణాటక వైపు ప్రయాణిస్తుందని.. అనంతగిరి కొండల్లో నుండి వచ్చే నీరు మూసినదిగా హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌ల గుండా ప్రవహిస్తూ ఉంటాయి. ఎలాంటి జల కాలుష్యం ఉండదని చెబుతున్నారు.

'సేవ్ దామగుండం' రాడార్ స్టేషన్ ఏర్పాటు రద్దు కోరుతూ దామగుండం అటవీ సంరక్షణ కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ రాడార్ స్టేషన్ వల్ల ప్రాణాంతకమైన రేడియేషన్ వెలువడుతుంది. గాలి, నీరు, పర్యావరణం తీవ్రంగా కలుషితం అవుతుందని వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు కేంద్రప్రభుత్వం ఇచ్చిన పర్యావరణ అనుమతులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భూమి అనుమతులు అన్నిటిని పరిశీలించింది. ప్రభుత్వం షరతులన్నింటినీ పాటించాలని హైకోర్టు నేవీకి ఆదేశించింది. పురాతన చారిత్రాత్మక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులకు అనుమతిస్తామని.. అదేవిధంగా టెంపుల్‌ను అభివృద్ధి చేస్తు.. మంచి రోడ్డు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని నేవీ కోర్టుకు స్పష్టం చేసింది. నేవికి ఇచ్చిన భూముల్లో ఉన్న 1.93లక్షల చెట్లకు నష్టం జరగదని.. చెట్లు లేనిచోటే తాము నిర్మాణాలు చేపడతామని ఈ ప్రాంతంలో జీవవైవిధ్యాన్ని, అరుదైన పశు పక్షుల ఆవాసాన్ని పరిరక్షించే విధంగా చూస్తామని 'సేవ్ రామగుండం పరిరక్షణ కమిటీ'కి ప్రభుత్వం హామీ ఇస్తుంది.

జాతీయ అటవీ విధానం 1988 మార్గదర్శకంగా తెలంగాణలో 33శాతం అడవులు పెంపుదల విస్తీర్ణానికై కృషి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రతి సంవత్సరం అడవుల విస్తీర్ణం తగ్గుతూ పోతుంది. మూడు వేల ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న దామగుండం అటవీ ప్రాంతాన్ని విఎల్ఆర్ నౌకాతల రాడార్ స్టేషన్ నిర్మాణానికి ఇవ్వడం వల్ల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమౌతున్న నేపథ్యంలో కేంద్ర నౌకాదళం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంగా పర్యావరణానికి విఘాతం కలగకుండా.. ఆటవీ ప్రాంతాన్ని పెంచడంతోపాటు ఆ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలు కోరుతున్నారు..

*పర్యావరణాన్ని పరీక్షించుకుందాం!*
*గాలి నీరు చెట్టును కాపాడుకుందాం!*

### దీపావళి, ఛత్ పండుగలను పురస్కరించుకుని

# ప్రయాణికుల సౌకర్యార్థం 804 ప్రత్యేక రైళ్లు




ప్రజాపక్షం/హైదరాబాద్ : దీపావళి, ఛత్ పండుగల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకుల సౌకర్యార్థంపై దృష్టి సారించింది. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అదనంగా 804 ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. పండుగల సీజన్ దృష్ట్యా పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, జార్ఖండ్, బీహార్ మొదలైన తూర్పు రాష్ట్రాలకు, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ మొదలైన ఉత్తర రాష్ట్రాలకు అధిక డిమాండ్ ఉంటుంది. తదనుగుణంగా ప్రజల డిమాండ్లను తీర్చడానికి ప్రత్యేక రైలు సర్వీసులు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ప్రధాన స్టేషన్లైన సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ మొదలైన స్టేషన్ ల నుండి షాలిమార్, రక్సాల్ , జైపూర్, లాల్గర్, హిసార్, గోరఖ్పూర్, షిర్డీ, దానాపూర్, నిజాముద్దీన్, కటక్, అగర్తల , సంత్రాగచ్చి వంటి ఇతర రాష్ట్రాల్లోని స్టేషన్ల వైపు కూడా ప్రత్యేక రైళ్లు నడపబడుతున్నాయి. మధురై, ఈరోడ్, నాగర్కోయిల్, కొల్లాం, బెంగళూరు, పన్వేల్, దాదర్ మొదలైన ఇతర డిమాండ్ గల గమ్యస్థానాలకు కూడా ప్రత్యేక రైళ్లు నడపబడుతున్నాయి. భారతీయ రైల్వే దీపావళి, ఛత్ పూజల సమయంలో ప్రయాణీకుల కోసం సాఫీగా ప్రయాణించడానికి రైల్వే నెట్వర్క్లో నవంబర్ 30 వరకు దాదాపు 6556 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసింది.

ప్రతి సంవత్సరం రైలు ప్రయాణీకుల అవసరాలను తీర్చడానికి క్రమం తప్పకుండా పండుగ సీజన్లలో ముఖ్యమైన సందర్భాలలో ప్రత్యేక రైళ్లను నడుపుతుంది. ఈ సంవత్సరం పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్య గణనీయంగా పెంచబడినాయి. ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి వ్యూహాత్మకంగా ప్రత్యేక రైళ్లను నడపడానికి ప్రణాళికా సిద్ధం చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ జోన్ ప్రజల డిమాండ్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

# రూ.47.65 కోట్ల నికర లాభాన్ని సాధించిన ఒలెక్ట్రా

### ఎండి కె.వి. ప్రదీప్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్టెక్ లిమిటెడ్ లాభాల బాటలో దూసుకుపోతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 30తో ముగిసిన రెండో త్రైమాసిక, అర్ధసంవత్సర ఏకీకృత ఆర్థిక ఫలితాలను సోమవారం ప్రకటించింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ చెల్లింపులకు ముందు ఆదాయాలు ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 523.67 కోట్లు (70 శాతం) పెరిగినట్లు వెల్లడించింది. త్రైమాసికంలో అధిక అమ్మకాల ల ద్వారా ఈ గణనీయమైన ఆదాయ వృద్ధి నమోదు చేసున్నట్లు ఒలెక్ట్రా సి ఎండి కె.వి. ప్రదీప్ తెలిపారు. ఇదే సమయంలో కంపెనీ ఈబిఐటిడిఏ ఆకట్టుకునేవిధంగా రూ.85.69 కోట్లకు చేరుకుందని, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 90 శాతం పెరుగుదలను సూచిస్తోందని ఆయన వెల్లడించారు. కంపెనీఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరునెలల్లో ఆదాయం రూ. 837.61 కోట్లు, ఇది 60 శాతం పెరిగింది. ఈ ఆరునెలల్లో కంపెనీ ఈ బి ఐ టి డి ఏ ఆకట్టుకునే విధంగా రూ. 136.20 కోట్లకు చేరుకుంది, ఇది మునుపటి సంవత్సరంతో పోలిస్తే గణనీయమైన 57 శాతం పెరుగుదలను సూచిస్తోందన్నారు. పన్నుల చెల్లింపునకు ముందు లాభం రూ. 96.68 కోట్లకు పెరిగిందని తెలిపారు.తొలి ఆరు నెలలల్లో మా ఏకీకృత ఆదాయం లాభములో వృద్ధిని సాధించటం సంతోషకరంగా ఉందన్నారు.

## గ్రూప్1 మెయిన్స్ 'రెండవ' పరీక్షకు 69.4 శాతం హాజరు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలోభాగంగా రెండవ రోజు మంగళవారం జరిగిన పేపర్ 1 జనరల్ ఎస్సె పరీక్షకు 69.4 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 46 పరీక్ష కేంద్రాల్లో 21,817 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. టిజిపిఎస్సి ఒక ప్రకటన విడుదల చేసింది.



### మంత్రి తుమ్మలను కలిసిన

## హెచ్ఎల్ కంపెనీ ప్రతినిధులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వ పూర్తి సహకారం అందిస్తుందని వ్యయసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హిందుస్థాన్ యునిలివర్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. మంగళవారం సచివాలయంలో ట్రోపికల్ ఆయిల్స్ గ్లోబల్ ప్రొక్యూర్ మెంట్ మేనేజర్ విజయ రామస్వామి , జనరల్ మేనేజర్ హర్ష మరాతేలు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ ఫాం రంగం, వ్యవసాయ ఆహార పరిశ్రమ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి తమ కంపెనీ సిద్ధంగా ఉందని, ఇందుకు తగిన అవకాశాలు కల్పించాలని మంత్రిని కోరారు. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సానకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని వారికి హామిఇచ్చారు.

## గత ప్రభుత్వంపైన కాంగ్రెస్ది తప్పుడు ప్రచారం

### రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేలా విష ప్రచారం : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అప్పులు చేయడంతో పాటు,ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్థం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెట్ కెటి.రామారావు మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను,420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వానికి అమలు చేయడం చేతకాకపోవడంతోనే రాష్ట్ర అప్పులపై తప్పుడు ప్రచారం చేసి, తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎకానమీ,పొలిటికల్ వీక్లిలో ప్రచురితమైన అప్పుల నిర్వహణ, రిసోర్స్ మేనేజ్ మెంట్ ఇండెక్స్ సూచీలను పరిశీలిస్తే ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రితో కాంగ్రెస్ నేతలు ఎంత తప్పుడు ప్రచారం చేస్తున్నారో అర్థమవుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక నిర్వహణలో2014 15 సంవత్సరం నుంచి 2022 23 వరకు దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్న ఇండెక్స్ను కెటిఆర్ తన ఎక్స్లో పోస్ట్ చేశారు. అప్పుల నిర్వహణ ఇండెక్స్, రిసోర్సెస్ మేనేజ్మెంట్ ఇండెక్స్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉన్నదన్నారు. కెసిఆర్ ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన ఆర్థిక నిర్వహణతో పాటు అప్పుల విషయంలో ఎంత క్రమశిక్షణగా వ్యవహరించిందో ఇన్డెక్స్లోని గణంకాలే సాక్ష్యమన్నారు. పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో టాప్గా నిలిపిన కెసిఆర్పైన కావాలనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, బురద చల్లే కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. సొంత ఆదాయం సమకూర్చుకోవడంలో తెలంగాణ ఎప్పుడూ దేశంలోనే అగ్రస్థానంలోనే ఉన్నదని, స్టేట్ ఓన్ టాక్స్ రెవిన్యూ లో టాప్ స్థానంలో ఉన్నదని కెటిఆర్ తెలిపారు. స్వంత కాళ్లపైన నిలబడి స్వయం పోషక రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందన్నారు. అప్పుల విషయంలో ఎఫ్ ఆర్బిఎం పరిమితిని దాటకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించామని కెటిఆర్ వివరించారు. తప్పుడు ప్రచారాలు చేసినందుకు ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

## కుమురం భీమ్కు కూనంనేని సాంబశివరావు ఘన నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆదివాసి ఉద్యమ నాయకుడు కుమురం భీం జయంతి సందర్భంగా ఆయనకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు నివాళి అర్పించారు. రాష్ట్ర అసెంబ్లీ కమిటీ హాల్లో మంగళవారం కుమురం భీమ్చిత్రపటానికి కూనంనేని పూలమాల వేసి శ్రద్దాంజలి ఘంటించారు.



## ఒక్క రైతు వద్ద పత్తి కొనుగోలు చేయలేదు : హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా 322 సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ ఆచరణలో ఇప్పటి వరకు ఒక్క రైతు వద్ద కూడా పత్తిని కొనుగోలు చేసిన పాపాన పోలేదని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం పత్తి మద్దతు ధర క్వింటాల్ కు రూ. 7521 తో పాటు, రూ. 500 బోనస్ కలిపి రూ. 8021 కొనుగోలు చేయాల్సిందని, కానీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారస్తులకు రూ. 5వేలకు అమ్ముకునే దుస్థితి వచ్చిందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా దిగుబడి తగ్గిపోయి, ఎకరానికి నాలుగు క్వింటాళ్ల పత్తి కూడా పండలేదని, గోరు చుట్టు మీద రోకటి పోటులా దిగుబడి తగ్గడంతో పాటు తక్కువ ధరకు అమ్ముకొని పత్తి రైతులు దారుణంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రాజకీయ విష క్రీడలు, తిట్ల పురాణాల్లో మునిగి తేలుతుంటే రైతులు దిక్కులేని పక్షులై ధీనంగా చూస్తున్నారనిపేర్కొన్నారు.

## 150 మంది ఎఇఒల సస్పెండ్ దారుణం: నిరంజన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: డిజిటల్ సర్వేకు ఒప్పుకోలేదని 150 మంది ఎఇఒలను వివిధ కారణాలతో సస్పెండ్ చేయడాన్ని బిఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఖండించారు. డిజిటల్ క్రాప్ సర్వేకు ఒప్పుకోలేదని 150 మంది ఏఈఓలను సస్పెండ చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో పక్క రాష్ట్రాల్లో ఏజెన్సీలు, ఇతర శాఖల సహాయంతో కేంద్ర ఇచ్చే నిధుల ద్వారా జరుగుతుంటే, ఇక్కడ ఎందుకు ఎఇఒల నెత్తిన రుద్దుతున్నారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎసిబి వలలో పెబ్బేరు మున్సిపల్ కమిషనర్






ప్రజాపక్షం / పెబ్బేరు : పెబ్బేరు మున్సిపల్ కార్యాలయంలో ఏసిబి అధికారులు రైడ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆదిశేషులు 2,3,7,10 వార్డులలో పెయింటింగ్ , కాంక్రీట్ పనులు కాంట్రాక్టర్ చేయడంతో ఒక్కొక్క బిల్లుల కోసం డబ్బులు డిమాండ్ చేయడంతో రూ. 25వేలు మున్సిపల్ కమిషనర్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ రూ. 20వేలకు ఒప్పుకొని రూ. 20వేలు కమిషనర్కు ఇస్తుండగా ఏసిబి డిఎస్పీ కృష్ణగౌడ్ వారి సిబ్బందితో పట్టుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఆదిశేషులు హైదరాబాద్లో ఇంటిని కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు ఏసిబి అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆదిశేషులను అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసిబి అధికారి డిఎస్పీ కృష్ణాగౌడ్ తెలిపారు.

## మంత్రి సురేఖకు చిత్రపటం బహుకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర దేవాలయ ఉద్యోగుల సంఘం జెఎసి అధ్యక్షుడు కె.కృష్ణమాచారి మంగళవారం సచివాలయంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా కొండా సురేఖని మర్యాదపూర్వకంగా కలిసి, తాను గీసిన మంత్రిగారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి చిత్రకళా నైపుణ్యాన్ని మంత్రి సురేఖ ప్రశంసించారు. ఖాళీ సమయాల్లో కళాతృష్ణ కలిగిన విద్యార్థులకు కృష్ణమాచారి ఉచితంగా చిత్రకళను బోధిస్తున్నాడని తెలుసుకుని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ పరాశరన్ రవీంద్రాచార్యులు మంత్రిగారిని కలిసారు.



## ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థి ఆత్మహత్యాయత్నం



ప్రజాపక్షం/సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్లో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మేళ్ళచెరువుకు చెందిన శివమణి అనే విద్యార్థి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్లో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నాడు. సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించగా చుట్టుపక్కల వారు గమనించి వారించారు. అప్పటికే విద్యార్థి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీంతో సదరు విద్యార్థిని మొదటగా ప్రభుత్వ జనరల్ ఆసుప్రికి తరలించగా అక్కడ తగిన సౌకర్యాలు లేవని చెప్పడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్య అందిస్తున్నారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియకపోగా విద్యార్థి చదువు పేరుతో హాస్టల్లో ఉంటూ ఓ హాస్పిటల్లో పని చేస్తున్నట్లు తెలిసింది. ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు హాస్టల్లో ఉండాల్సిన వార్డెన్ ఉండకపోవడంతోనే విద్యార్థులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వార్డన్ హాస్టల్ బాధ్యతలను సిబ్బందిపై వదిలేసే తాను సమయ పాలన లేకుండా ఇష్టానుసారంగా వచ్చి వెళ్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు చెప్తున్నారు. చదువు పేరుతో ఈ ఒక్క విద్యార్థినే బయట పని చేస్తున్నాడా... లేక ఇంకా ఎవరైన ఉన్నారనేది తెలియాల్సి ఉంది. ఉన్నత అధికారులు ఈ సంఘటనపై విచారణ చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## రాజకీయ జోక్యంతోనే సింగరేణిలో అవినీతి!

### ఎఐటియుసి అధ్యక్ష,కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్కుమార్

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : రాజకీయ జోక్యంతోనే సింగరేణిలో అవినీతి పెరిగిందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎఐటియుసి కొమురయ్య భవన్లో ఎఐటియుసి భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో సింగరేణిలో రాజకీయ జోక్యం వల్లనే అవినీతి పెరిగిపోయిందని,గత నాలుగు సంవత్సరాలుగా స్ట్రక్చర్ మీటింగ్లు జరగక అనేక కార్మిక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాల వయసు 35 నుండి 40 సంవత్సరాల వరకు పెంచడం జరిగిందని, ఇప్పటివరకు ఎలాంటి సర్కులర్ ఇవ్వలేదని పేర్కొన్నారు. 35 సంవత్సరాల వయసు కలిగిన పెండింగ్ దరఖాస్తులు400ఉన్నాయని, మారుపేరుకు సం బంధించిన సమస్యల విషయంలో స్ట్రక్చర్ మీటింగ్లో చర్చించడం జరుగుతుందని అన్నారు. ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఎఐటియుసి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, ఆసిఫ్ పాషా పాల్గొన్నారు.

# సెలవులు ఇవ్వకుండా సతాయిస్తున్నారు..

### రోడ్డెక్కిన పోలీసుల భార్యలు

### మామునూరు బెటాలియన్ ఎదుట ధర్నా



ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ప్రజల జీవితాలకు, రాజకీయ నాయకుల ఆస్తులకు, రక్షణ కల్పిస్తున్న పోలీసు భార్యలు మంగళవారం రోడ్డెక్కారు. కానిస్టేబుళ్ల చేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, కనీసం సెలవులు కూడా ఇవ్వకుండా కుటుంబానికిదూరంచేస్తున్నారనిపోలీసుల భార్యలు కన్నీరుమున్నీరుగా విలపించారు. వరంగల్ జిల్లా మామునూరు 4వ బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని కానిస్టేబుళ్ల భార్యలు రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు.ఆర్టీఓ ఆఫీస్ నుండి మామునూరు బెటాలియన్ వరకు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు రిజర్వుడ్ పోలీసుల కుటుం బాల బాధలను అర్థం చేసుకోవాలని సిఎం రేవంత్రెడ్డిని కోరారు.

# పాఠ్యాంశంగా శంకరన్ జీవితం

### జయంతి, వర్ధంతి ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

### జయంతి సభలో వక్తల డిమాండ్




విజయవాడ : బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కడవరకు కృషి చేసిన ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శంకరన్ మెమోరియల్ కమిటీ అధ్వర్యంలో గవర్నర్ పేటలోని అంబేద్కర్, జగ్జీవన్ రామ్ ఐక్యతా భవన్లో మంగళవారం ఎస్ఆర్ శంకరన్ శంకరన్ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో శంకరన్ 90వ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శంకరన్ జయంతి, వర్ధంతిని ప్రతి ఏదాది ప్రభుత్వమే అధికారికంగా జరిపించాలని కోరారు. దళిత, గిరిజన, పేద వర్గాలకు ఆయన చేసిన సేవలు నిరుపమానమన్నారు. నిజాయితీ, నిబద్ధత కలిగిన గొప్ప పాలనాదక్షుడన్నారు. రాబోయేతరం ఐఏఎస్ లకు ఆయన రోల్ మోడల్ అన్నారు. శంకరన్ సేవలు భవిష్యతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. రాజ్యాంగాన్ని అవపోసనపట్టి ఎస్సీ ఎస్టీ గిరిజనుల అభివృద్ధికి చట్టాలను వెలికితీసి ప్రభుత్వాలను ఒప్పించి అమలు చేసిన మహానుభావుడు శంకరన్ అని కొనియారారు. శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన ఐఏఎస్ అధికారులు చట్టాలను ఎలా అమలు చేయాలి అనేదానికి శంకరన్ అనుసరించిన విధానం తరువాత తరం వారికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదలు, దళితుల తరపున శంకరన్ తన వాణిని గట్టిగా వినిపించేవారన్నారు. బొగ్గు గనుల జాతీయకరణ, వెట్టిచాకిరి నిర్మూలనలో ఆయన కీలక పాత్ర వహించారన్నారు. రాష్ట్ర చేనేత, జౌలి శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి కాకి సునీత మాట్లాడుతూ పేదల కోసం రూపొందించిన ఒక సంక్షేమ పథకాన్ని ఎంత వరకు అమలు చేయవచ్చో స్పష్టంగా తెలియజేసే వారని చెప్పారు. చాలా నిరాడంబరంగా ఉన్నత విలువతో జీవితాన్ని గడిపారని చెప్పారు. శంకరన్ జయంతిని పురస్కరించుకుని పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన అట్టడుగు వర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థులు సువర్చిత, డోలికలకు 10వేల నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఎక్కడ పని చేసినా శంకరన్ అట్టడుగు వర్గాలకు చట్టాలను ఎలా తీసుకురావాలి, వాటిని ఎలా అమలు చేయాలనే ఆలోచించారని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిజాయితీకి మారు పేరు శంకరన్ అన్నారు. పేదల గుండె చప్పుడైన శంకరన్ లాంటి అధికారులు దేశానికి అవసరం అన్నారు. అధికారి ఎలా సేవ చేయవచ్చో తెలియజేస్తూ రోల్ మోడల్గా నిలిచిన శంకరన్ జీవిత విశేషాలను పాఠ్యాంశంగా చేర్చేందుకు తమ పార్టీ తరపున గట్టిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ, శంకరన్ అగ్రకులంలో పుట్టినప్పటికీ దళితులు, వెనుకబడిన వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేసేందుకే జీవితాన్ని వెచ్చించారన్నారు. పామరుల చెంతకు పాలనావ్యవస్థను పరుగులుపెట్టించిన ఘనత ఎస్ఆర్ శంకరన్దే నన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల రూపకల్పనలో శంకరన్ పాత్ర అమోఘమన్నారు.

విశాలాంధ్ర న్యూస్ ఎడిటర్ ఎం.మురళీకృష్ణ మాట్లాడుతూ శంకరన్ జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే నిర్వహించడంతో పాటు ఆయన జీవితం, చేసిన సేవలపై రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డా.ఎన్టీఆర్ వైద్య, ఆరోగ్య విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ జయకర్, కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వర రావు ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు చంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ముందుగా ఎస్ఆర్ శంకరన్ కాంస్య విగ్రహానికి ఐఏఎస్ లు రాజశేఖర్, కాకి సునీత, జల్లి విల్సన్, రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మెమోరియల్ కమిటీ కో.కన్వీనర్, డీహెచ్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప స్వాగతం పలికారు. నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య వందన సమర్పణ చేశారు.

# డ్రోన్ డెన్గా ఎపి

### ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో 300 ఎకరాల్లో హబ్

### అమరావతి డ్రోన్ సదస్సు ప్రారంభసభలో చంద్రబాబు



అమరావతి : 'డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియా'గా అమరావతిని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రతి ఒక్కరి జీవితాలను ప్రభావితం చేయబోతున్నాయని, వీటి అనుసంధానంతో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని చెప్పారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్స్లో కేంద్ర పౌర విమానయాన శాఖ, ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అమరావతి డ్రోన్ సదస్సును మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డితో కలిసి చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమరావతి డ్రోన్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇది భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీలో గేమ్ ఛేంజర్ అవుతుందని అన్నారు. 1995లో తాను ఐటీ విధానం గురించి మాట్లాడితే ఆరోజు ఆ మాటలు కొందరికి అర్థం కాలేదని, ఇప్పుడు హైదరాబాద్ ఐటీ రంగంలో ఎలా అభివృద్ధి చెందిందో చెప్పాల్సిన అవసరం లేదన్నారు. భవిష్యత్తులో డ్రోన్ల వినియోగం, ఏఐ, ఎంఎల్ అనుసంధానంతో జరిగే అభివృద్ధి కూడా అలాగే ఉంటుందన్నారు. థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ విధానాన్ని అనుసరించాలని కోరారు. ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో డ్రోన్ హబ్ కోసం 300 ఎకరాలు కేటాయిస్తామని తెలిపారు. అక్కడ డ్రోన్ హబ్ ఏర్పాటు చేస్తే పెద్ద నగరాలైన హైదరబాద్, చెన్నై, బెంగళూరు, అమరావతికి దగ్గరగా ఉంటుందని, దీనికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

రాబోయే కాలం అంతా డేటాదేనని చంద్రబాబు అన్నారు. ఎంత డేటా ఉంటే దేశానికి, పెట్టుబడిదారులకు అంత బాగుంటుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) ద్వారా నిర్దిష్ట సమాచారం పొందవచ్చన్నారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తల నుండి సలహాలు, సూచలు తీసుకుని పక్షం రోజుల్లోనే డ్రోన్ పాలసీని ఆవిష్కరిస్తామని, కనీసం 35 వేలకు పైగా డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు ప్రకటించారు. ప్రతి దాన్ని ఎలా వినియోగించుకోవాలో ఆలోచిస్తే భారతీయులను ఎవరూ ఎదుర్కోలేరన్నారు. రాష్ట్రంలో ఐదు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు..అమరావతిలో ప్రధాన కార్యాలయం ఉంటుందని, మిగతావి విశాఖ, రాజమండ్రి, తిరుపతి, అనంతపురంలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. 2047 నాటికి ఒక కుటుంబంలో .ఒక వ్యాపారవేత్త ఉండాలన్నది తన అభిమతమన్నారు. 25 ఏళ్ల క్రితం ప్రతి కుటుంబంలో ఒక ఐటీ వ్యక్తి ఉండాలని ఆకాంక్షించామని, ఇప్పుడు ఒక కుటుంబంలో ఒక వ్యాపారవేత్త, ఒక స్టార్టప్ కంపెనీ ఉండాలని చెబుతున్నామన్నారు. ఇది విజయవంతమైతే భారత్.. టెక్నాలజీ, గ్లోబల్ సర్వీసెస్లో ముందుంటుందని చంద్రబాబు ఉద్ఘాటించారు.



## వనపర్తికి ఎస్‌బిఐ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా

**ప్రజాపక్షం/మానవపాడు :** ఎస్‌బిఐ చైర్మన్ శ్రీనివాస్ వచ్చిన్నా విషయాన్ని తెలుసుకున్న జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామ వాసి శ్రీ వాసవి సేవా సమితి అధ్యక్షుడు డా.పూరి సురేష్ శెట్టి చైర్మన్ ని కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా డా.పూరి సురేష్ శెట్టి మాట్లాడుతూ చల్లా శ్రీనివాస్ గుప్తా ఎస్బి ఐ బ్యాంకుకు ఎండి అయిన తర్వాత మొట్టమొదటిసారిగా వారి స్వగ్రామమైన జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పెద్ద పోతులపాడు గ్రామానికి రావడం జరిగింది. ఆ ఊరి ప్రజా ప్రయోజనాల కోసం ఒక అంబులెన్స్ వాహనము డోనేట్ చెయ్యడం జరిగింది. ఏది ఏమైనా పెద్ద పోతులపాడు గ్రామాన్ని మానవపాడు మండల పేరును ప్రపంచ దేశాల్లో ఆ ఊరి పేరును నిలబెట్టడం చాలా సంతోషకరమైన విషయమని పూరి సురేష్ శెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగడి నరేందర్, దాచ లక్ష్మినారాయణ, కొత్త బాలకృష్ణ బానురు నాగేంద్రం, బాశెట్టి శ్రీను, తెలంగాణ రాష్ట్ర సిపి ఫోరం అధ్యక్షులు కల్వకుర్తి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కవాతు మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి.జానకి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ నిర్వహణ, సిబ్బంది విధులు, ఉపయోగించే ఆయుధాలు వాహనాలు, ఇతర సాంకేతిక పరికరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలను ప్రజలకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసు శాఖ పై తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. ఇలాంటి ఓపెన్ హౌస్ కార్యక్రమాలు ప్రజలు, ముఖ్యంగా యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు, పోలీసు శాఖ పై అవగాహనను పెంచేందుకు దోహదపడతాయని ఎస్పీ డి.జానకి ఐపీఎస్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న జరుపుకుంటారు.



## ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సివిల్స్ ఫౌండేషన్ ఫ్రీ కోచింగ్

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా అటానమస్ డిగ్రీ కళాశాల , తెలంగాణ బి.సి స్టడీ సర్కిల్ సంయుక్తంగా సివిల్ సర్వీసెస్ ఫ్రీ ఫౌంగేషన్ కోర్సును సంవత్సరానికి రెండుసార్లు 150 గంటల చొప్పున ప్రతి బ్యాచ్ లో స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా 150 మంది విద్యార్థులను రిజర్వేషన్స్ ప్రకారంగా ఎంపికైన వారికి మాత్రమే సివిల్ సర్వీసెస్ కై ఉచిత శిక్షణ ఎన్టీఆర్ ఇవ్వడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.వి. రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్క్రీనింగ్ టెస్ట్ కు హాజరౌన విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సివిల్స్ సర్వీసెస్ కై ఉచిత శిక్షణ అందిస్తున్న రాష్ట్రంలోనే ఏకైక మహిళా డిగ్రీ కళాశాల కావడం గర్వించదగ్గ విషయం అని తెలుపుతూ సివిల్స్ పరీక్ష విధానాన్ని అర్థం చేసుకొని ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం సాధించడం సులభమని ఒకప్పుడు వివిధ అంశాలను తెలుసుకునేందుకు గ్రంథాలయాల్లో పుస్తకాలను వెలకాల్సి వచ్చేదన్నారు ప్రస్తుతం అంతర్జాలంలో కూర్చున్న చోటనే ప్రపంచ విషయాలను తెలుసుకునే వీలుందన్నారు. మంగళవారం నిర్వహించిన స్కీనింగ్ టెస్ట్ కు 385 మంది విదద్యార్థులు వ్రాయడం జరిగింది. వీరిలో 150 మందిని ఎంపిక చేస్తారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్. పద్మ అనురాధ, అమీనా ముంతాజ్ జహాన్, డాక్టర్. శ్రీదేవి, వాసంతి పాల్గొన్నారు.



## 'ముడా' చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, నూతన మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ రేపు జరిగే మహబూబ్‌నగర్ ముడా చైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హజరు కావాలని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహని, ఐటి శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని, రొడ్లు భవనాలు శాఖామంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ కు మంత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాంలో ఎమ్మెల్యే తో పాటు మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సిహ్మారెడ్డి,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధిపనుల పరిశీలన



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణపరిధిలోని 18వవార్డులో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం పరిశీలించారు. పనులను త్వరితగతిన నాణ్యతాయుతంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జరుగుతున్న పనులను ప్రతిరోజు విజిట్‌చేయాలని అసిస్టెంట్ ఇంజనీర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మహ్మద్‌షాహెద్, యాదయ్య, షకీల్, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిఅవకాశాల కల్పనే ధ్యేయమని ఎంపి మల్లురవి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రిజూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని తేజకన్వెన్షన్‌హాల్‌నందు నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌పరిధిలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్‌పరిధిలోని సూక్ష్మ,చిన్నమధ్యతరహా పరిశ్రమలద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, ఆర్థికంగా ఎలబలపడాలి, వారి ప్రాంతాలకు ఎలాంటి పరిశ్రమలు నిర్మించుకోవాలి అనే అంశాలమీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎస్సి ఎస్టిబిసి బడుగు బలహీనవర్గాల యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని వివిధ ప్రముఖ ప్రభుత్వరంగసంస్థల ప్రతినిధులతో స్థానిక ఎన్‌జివోసంస్థ సహకారంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక యువతకోసం వారి భవిష్యత్తు కోసం నిత్యం ప్రజాప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో వివిధ కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. పోలీసు , ఆర్మీ ఉద్యోగాలకొరకు అభ్యర్థులకు శిక్షణ కేంద్రాలను, సెంటర్లను ఏర్పాటుచేస్తామని తెలిపారు. డిగ్రీపూర్తిచేసిన యువత సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ప్రైవేట్ ఉద్యోగాలుకూడా అనేకం ఉన్నాయని, ప్రైవేట్ ఉద్యోగాలకుకావాల్సిన నైపుణ్యాన్ని యువత అందిపుచ్చుకోవాలని అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నిరుద్యోగ యువతను వ్యాపారవేత్తలుగామార్చే విధంగా మూడుజిల్లాల కలెక్టర్లు సహాయ సహకారాలు అందించాలని కోరారు. విద్యనైపుణ్యంతోపాటు అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో యువతస్వయం ఉపాధి లక్ష్యంగా కృషిచేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంక్షేమ పథకాలతోపాటు యువతకు ఉద్యోగకల్పనపై రూ.50లక్షలు తన నిధులతో ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుండి అనేక సంస్థలను రప్పించి అవగాహన కల్పించడం యువతకు ఇది ఒక సువర్ణఅవకాశమన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్‌ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తర్వాత జిల్లాకు ఒకటి చొప్పున ఏడు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. ఎస్సి ఎస్టిహాబ్‌సెల్ ఏర్పాటు చేయనున్నట్లు నిరుద్యోగ యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకుముందు అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్‌రెడ్డి, కసిరెడ్డినారాయణరెడ్డి, వంశీకృష్ణ, మెగారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, మైనార్టీఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెద్దుల్లాకొత్వాల్, డిసిసిబిచైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కేంద్రప్రభుత్వరంగసంస్థల ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర, జిల్లాల ఉన్నతాధికారులు, జిల్లాల అధికారులు, పార్లమెంట్ నియోజకవర్గపరిధిలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యూనియన్‌ను దెబ్బ తీయడానికే అసత్య ఆరోపణలు



**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి** ఆసుపత్రి కార్మికుల హక్కుల సాధన, సంక్షేమానికై, శ్రమ దోపిడిపై, న్యాయమైన జీతభత్యాల కై రాజీ లేని పోరాటం చేస్తున్న తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి)ని చూసి ఓర్వలేక జీర్ణించుకోలేని కొంతమంది చీడపురుగులు కుట్రలో భాగంగానే కార్మికుల పై యూనియన్ నాయకుల పై అక్రమ కేసులు అసత్య ఆరోపణలతో దెబ్బ తీయాలనే దుర్బుద్ధితోనే కుట్రలు పన్నుతున్నారని కార్మికుల మండిపడ్డారు. అసత్య ఆరోపణలు అక్రమ కేసుల కార్మికుల పై వేధింపుల పై మంగళవారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట కార్మికులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో 90 శాతం ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల పేద కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఇలాంటి వారి పక్షాన వంద సంవత్సరాలకు పైబడిన పోరాటాలు త్యాగాల చరిత్ర గలిగిన ఏఐటీయూసీ నిత్యం కార్మికుల అభ్యున్నతికై పోరు సాగిస్తుందని అన్నారు. ఆస్పత్రిలో జీవో 60 ప్రకారం వేలనాలు చెల్లించకుండా, పిఎఫ్ ఈఎస్ఐ చెల్లింపులో భారీ అవకతవకలకు పాల్పడ్డుతున్న కార్మికుల పొట్ట కోడుతున్న ధగుతాంబ్జీ ఏజెన్సీ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కొంతమంది స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్న తీరు పై ఎదిరించి నిలబడుతున్నందునే వారి ఆటలు సాగడం లేదని, దొడ్డి దారిన పనిగట్టుకొని కార్మికులను దొంగతరం లాంటి వాటిల్లో ఇరికించి యత్నాలు జరుగుతున్నాయని ఇందులో భాగంగానే పేద దళిత సామాజిక వర్గానికి చెందిన ఏఐటీయూసీ మెడికల్ యూసియన్ ఆసుపత్రి బ్రాంచ్ ప్రధాన కర్యాదర్శి అయిన జే. నరసింహను నెలరోజులుగా వేధిస్తూ ఆసుపత్రిలో ప్రాణ ప్రయస్థితిలో ఉండటానికి కారణం అయినారని అన్నారు. మెడికల్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అనునిత్యం ఒక్క పైసా ఆశించకుండా తన సొంత జీవితాన్ని వదులకొని కార్మికుల కోసం నితి నిజాచితీతో నిబద్ధతతో ఎన్నో ఆటుపోటలను ఎదుర్కొంటు పోరాటం సాగిస్తున్నాడని. ఇలాంటి నాయకుని పై అసత్య ఆరోపణలు చేస్తే సూర్యుని పై ఉమ్మి నట్టేనని అభివర్ణించారు. కార్మికులుగా యూనియన్ లో సభ్యులుగా చేరుతున్నాయని అన్నారు. సూనర్వైజర్ యాతయ్య ను రెచ్చ గొట్టి ఉసిగొల్పి కార్మికుల ఆంతోళనలో ఉన్న యూనియన్ నాయకుని పైకి పంపారని యాదయ్య యూనియన్ నాయకుని పై ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ తనే మళ్లీ దాడి చేశారని కేసులు పెట్టడం ఆశాస్పదమని అన్నారు. యాదయ్యను వివిధ ఆరోపణలతో గతంలో విధుల నుంచి తొలగిస్తే యూనియన్ నాయకుడ సురేష్ అనేక ప్రయత్నాలు చేసి యాదయ్యను డ్యూటీలో చేర్చాడని ఇది మరవరాదని తెలిపారు. కనుక జరుగుతున్న పరిణామాల పై పూర్తిస్థాయిల విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఎఐటీయూసి నాయకులు కార్మికులు చెన్నయ్య రంగన్న బాల కోటి మన్యం జగ్గా నాయక్ వెంకటేష్ నాయక్ గంగాధర్ శంకర్ శివ బాలకృష్ణ యాదయ్య రాఘవేందర్ అంజి నైసన్ పాల్గొన్నారు.



## కలెక్టర్ కోస్గి ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ

**ప్రజాపక్షం / కోస్గి :** సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిఇసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ అనుదీప్‌తో ఆసుపత్రికి అవసరమైన మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి కొరత ఉన్న మందుల ఇండెంట్‌ను తనకు పంపించాలని సూచించారు. ఆసుపత్రిలో పెయిన్ కిల్లర్స్ , టిటి ఇంజక్షన్స్ కొరత తీవ్రంగా ఉందని డా. అనుదీప్ కలెక్టర్‌కు తెలిపారు. ఆసుపత్రికి జనరేటర్ , రోగుల బంధువుల విశ్రాంతి షెడ్ అవసరం ఉందని కోరారు. పాత భవనాన్ని కూల్చివేసి ఆ స్థలంలో షెడ్డును నిర్మించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెక్యూరిటి పరంగా ఒకరిద్దరు పోలీసులను ఆసుపత్రికి పంపించాలని , డా. అనుదీప్ ఎస్పీని కోరారు. ఆయా వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గుండుమల్ లోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. కేంద్రానికి తాళం వేసి ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ 12.30 గంటలకే కేంద్రాన్ని ఎలా మూసివేస్తారని , ఐసిడిఎస్ సూపర్ వైజర్‌ను కలెక్టరేట్‌కు పిలిపించాలని పిఆర్ , ఏఈవిలోక్ సూచించారు.



## ట్రై సైకిల్ పంపిణీ

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మార్కెట్ యార్డ్‌లో 8 ట్రై సైకిళ్లు వివిధ గ్రామాల గల వికలాంగులకు వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరులో గల వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని యార్డ్‌లో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని చేతుల మీదుగా మోటర్ బ్యాటరీ సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మెగారెడ్డి కృషితో వికలాంగులకు బ్యాటరీతో కూడిన విద్యుత్ మోటార్ ట్రై సైకిళ్లను అందజేశారు. లబ్ధి పొందిన వికలాంగులు ఎమ్మెల్యే మెగారెడ్డికి , కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## వనపర్తి సిఐగా మద్దెల క్రిష్ణ పదవీ బాధ్యతలు



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి సిఐగా మద్దెల క్రిష్ణ పదవి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. క్రిష్ణ హైదరా బాద్‌లో సిఐడి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ వనపర్తికి బదిలీపై వచ్చారు. వనపర్తి సిఐగా పని చేసిన నాగభూషణ్‌రావు హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నీతి నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవలందించాలని బాధ్యతయుతంగా విధులు నిర్వహించడంతో పాటు ప్రజలు పోలీసులపై పెట్టుకున్న నమ్మకానికి తగ్గట్లుగా విధులు నిర్వర్తించాలని సిఐకి ఎస్పీ సూచించారు. అనంతరం పట్టణ ఎస్ఐగా బి. హరిప్రసాద్ పదవి బాధ్యతలు స్వీకరించారు.

## పట్టుదలతో.. ఏదైనా సాధించగలం

### ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** మనిషికి పట్టుదల ఉంటే జీవితంలో సక్సెస్ అవుతామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించిన చిన్ నతరహ ఇండస్ట్రియల్‌లో స్వయం ఉపాధి కల్పనపై యువతకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తూనే మరో వైపు ఇలాంటి ప్రైవేట్ కంపెనీలలోను నిరుద్యోగులకు జాబ్స్ ఇప్పించాలన్న ఉద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో ఉండే ప్రతి నిరుద్యోగి తమ కాళ్లపై తాము నిలబడాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుల్లా దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ నాయకులు ఓబేదుల్ల కొత్వాల్ , కలెక్టర్లు, బ్యాంకు అధికారులు, ఇండస్ట్రియల్ నిర్వాహకు ఉద్యోగులు , కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

# మత్స్య సంపద పెంచేందుకు సర్కారు కృషి

## ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మత్స్య సంపద పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా భూత్పూర్ మండల పరిధిలోని మద్దిగట్ల, పాత మొల్గర గ్రామాలలోని చెరువులోకి చేప పిల్లలను ఎమ్మెల్యే వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని చెరువులలో ఉచితంగా చేపలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దాని కోసం పెద్ద ఎత్తున చేప పిల్లలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. గతంలో మత్స్యకారులు ప్రభుత్వాన్ని చేప పిల్లలు ఇవ్వండి అని మొరపెట్టుకున్న స్పందించలేదని, తమ ప్రభుత్వంలో అడగకున్న బాధ్యతగా చేప పిల్లలను అందజేశామన్నారు. అదేవిధంగా పాత మొల్గర గ్రామంలో ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియను పకడ్బందిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గతంలో రైతులు పంటను కల్లలలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూసే వారిని, తమ ప్రభుత్వం 15 రోజులు ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ఇది రైతులపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అని పేర్కొన్నారు. ధాన్యం తూకాల్లో మోసాలకు తావు లేదని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, షాదీముబారక్ , కళ్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిక్కీ నవీన్ గౌడ్ ,సింగిల్‌విండో చైర్మన్ అశోక్ రెడ్డి, మాజీ ఎంపీపీ డా. కదిరే శేఖర్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు లిక్కి విజయ్ కుమార్ గౌడ్ , హర్యానాయక్ , అధికారులు తదితరులు

## గ్రూప్-1 పరీక్షలను ఎవరూ ఆపలేరు

**ప్రజాపక్షం/వెల్దండ :** ప్రభుత్వ ఉద్యోగుల నియామకం చేపడుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని , పది సంవత్సరాలలో గ్రూప్-1 నిర్వహించలేని వారు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తుంటే వారి అక్కసుసుకక్కుతున్నారని వెల్దండ మండల ఎస్సిసెల్ మండలఅధ్యక్షులు ముదిగొండ రమేష్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం , విద్యార్థులను వాడుకోవడంవారికి అలవాటుకాని , కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 40వేల ఉద్యోగాలుభర్తీ చేసిందని, గ్రూప్1స్థాయి ఉద్యోగాలను భర్తీచేస్తుంటే ప్రతిపక్షపార్టీల నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ప్రతిపక్షాలమాయలలో పడకుండా మీరు కష్టపడి చదివి ప్రిలిమ్స్‌పై సై ఉన్నారని, మెయిన్స్‌పైదృష్టిపెట్టి మంచి ఫలితాలు సాధించాలన్నారు.



## జిఓ29ని తక్షణమే రద్దుచేయాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** తెలంగాణరాష్ట్రప్రభుత్వం తక్షణమే జివో నెంబర్ 29ని రద్దుచేయాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బోనాసిరాంచందర్ డిమాండ్‌చేశారు. బిఎస్‌పి పార్టీకార్యాలయం సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బిఎస్‌పిపార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేస్తామన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల హామీల అమలుకై క్షేత్రస్థాయిలో పోరాడుతామని అన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి హైడ్రాఅని, గ్రూప్1పరీక్షలో జిఓనెంబర్ 29అని, 2లక్షల రుణమాఫీ అని నిత్య ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. జివోనెంబర్ 29వలన బహుజన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం జివోనెంబర్ 29ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జల్‌జంగల్‌జమీన్ పోరాటయోధుడు కొమురం భీమ్ 84వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ అసెంబ్లీకి నూతన కమిటిని ఎన్నుకోవడం జరిగింది. అసెంబ్లీ ఇంచార్జీలుగా కొత్తపల్లి కుమార్, అసెంబ్లీ కమిటి అధ్యక్షులుగా చింతకుంట కల్యాణ్, నాగర్‌కర్నూల్‌టౌన్ ఉపాధ్యక్షులుగా ఎర్రోళ్ల పరుషరామ్, తిమ్మాజిపేట మండల ప్రధాన కార్యదర్శిగా నాగేష్, నల్లవెల్లి గ్రామమాజీ డిప్యూటిసర్పంచ్, నాగర్‌కర్నూల్ కార్యదర్శిగా బొందల ఆంజనేయులు, తాడూరు కోశాధికారిగా భాస్కర్, బిజినేపల్లి నాగర్ కర్నూల్ టౌన్ అధ్యక్షులు మధు, దేశి ఇటిక్యాలటౌన్ ఉపాధ్యక్షులు బాలనాగయ్యని నూతనంగా నియమించడం జరిగింది. కార్యక్రమంలో బిఎస్‌పి మాజీ జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్, మండలాల అధ్యక్షులు రాజు, పానుగంటి రాంచందర్, సీనియర్ నాయకులు శేఖర్, శ్రీను, రాంచందర్, నాగరాజు, శివ రాజు, బిఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.



## ఎంపిని కలిసిన మండల కాంగ్రెస్ నేతలు

**ప్రజాపక్షం/వెల్దండ :** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళుతున్న నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవిని మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా ప్రజాపాలనలో అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతున్నాయనివారు ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వెల్దండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రశ్రీను, సీనియర్ నాయకులు నాగేశ్వర్‌గౌడ్, కిష్టాల్, సెల్ మండలఅధ్యక్షులు ముదిగొండ రమేష్, ఇతర పార్టీలనేతలు పాల్గొన్నారు.

## రైతాంగానికి అండగా ఉంటా

**ప్రజాపక్షం/వంగూర్ :** వ్యవసాయ కమీషన్‌కమిటిలో సభ్యునిగా రైతాంగానికి అండగా ఉంటానని కెవిన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం మొట్టమొదటిసారిగా ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వ్యవసాయరంగంలో కమీషన్ ఏర్పాటు రాష్ట్ర కమిటిలో మెంబర్ ఎంపికపట్ల మాజీ జడ్పిటిసి కెవిన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రకమిటిలో స్థానం కల్పించినందుకు తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి అన్నివిధాల అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు.



## ఘనంగా గ్యార్మీ పండుగ వేడుకలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** అన్నిదానాలలోకెల్ల అన్నదానం గొప్పదని సిఐ నాగార్జున, మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం, పట్టణమాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు అన్నారు. మంగళవారం గ్యార్మీపండుగను పురస్కరించుకొని పట్టణంలోని జెఎన్‌యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్యార్మీమాసంలో ముస్లిం సోదరులు కులమతాలకు అతీతంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకంటేముందు జెఎన్‌యూత్ సభ్యులు కూరగాయల మార్కెట్‌రోడ్డు నుండి భారీ ర్యాలీతో పట్టణంలోని మహబూబ్‌సుభానిదర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్‌చైర్మన్ షాహేద్, ఎస్ఐ మాధవరెడ్డి, కౌన్సిలర్లు షానవాజ్‌ఖాన్, షేక్ ఎజాస్, మాజీకౌన్సిలర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంఐఎంపార్టీ అధ్యక్షుడు అబ్దుల్‌సత్తార్, నాయకులు మసూద్,మహమూద్, ఇంతియాజ్, ఇలియాస్, సోహేల్, రియాజ్, షఫీ పాల్గొన్నారు.

## యువకుడికి జైలుశిక్ష

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట యువకుడు చౌడవోని సాయిరాం నాగర్‌కర్నూల్ మండలానికిచెందిన వివాహిత(27)ను వేధించిన ఘటన వెలుగులోకి వచ్చింది. గతకొన్ని రోజులనుండి నిరంతరం వేధింపులు భరించలేక ఆమె షీటీమ్‌ను ఆశ్రయించింది. సాయిరాం తరుచూ కొత్త నెంబర్లతో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు షీటీమ్ పోలీసుల నిర్ధారణలో తేలింది. షీటీమ్ అధికారులు విజయలక్ష్మి , ఎఎస్ఐ వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ సిబ్బంది చొరవతో అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదుచేశారు. న్యాయస్థానంలో హాజరుపర్చగా సాయిరాంకు 2వతరగతి న్యాయమూర్తి వారంరోజులజైలుశిక్ష విధించినట్లు నాగర్ కర్నూల్ ఉమెన్‌సేఫ్టీవింగ్ అధికారి, అదనపు ఎస్‌పి సిహెచ్‌రామేశ్వర్ తెలిపారు. గతంలోను సాయిరాంపై ఈవ్‌టీజింగ్‌చేసిన కేసు ఉందని ఇది రెండోసారి అనితెలిపారు. ఎవరైన మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆకతాయిలను హెచ్చరించారు. ఎవరికైనా వేధింపులు ఎదురైతే వెంటనే షీటీమ్ నెంబర్ 8712657676 ఫిర్యాదుచేయాలని ఆయన సూచించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణ ఏకలవ్యమోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో వెల్దండ మండలం గుండాల గ్రామంనందు క్యాటరింగ్ అసిస్టెంట్ 1, హస్టల్‌వార్డెన్ మహిళ 1, ఎలక్ట్రిషియన్‌కమ్ ప్లంబర్1, వంటమనిషి, కిచెన్ హెల్పర్2, నాన్‌టీచింగ్ పోస్టులకుగాను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నాగర్‌కర్నూల్ జిల్లాకుచెందిన అర్హులైన అభ్యర్థులనుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి కల్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఫోన్‌నెంబర్ 9704244232, 9885738387కు సంప్రదించాలని తెలిపారు.

# పథకాల అమలు బాధ్యత అధికారులదే

ఎంపి రఘురాంరెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో అర్హులైన ప్రజలకు ప్రాయోజిత పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్ పాల్గొన్నారు. సమావేశంలో ఆయాశాఖల పరిధిలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు, రాబోయే మూడు నెలల కాలంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు తదితర అంశాలపై జిల్లాలోని అన్నిశాఖల అధికారులు నివేదికలు వివరించారు. ఈ సందర్భంగా ఎంపి రఘురాంరెడ్డి మా ట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అవసరమైన బ్యాటరీ ట్రై సైకిళ్ల నివేదిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. పరిశ్రమల ప్రోత్సాహనికి తీసుకోవాల్సిన చర్యలు మొదలగు గణాంకాలతో పక్కా నివేదిక తయా రు చేయాలన్నారు. జిల్లాలో పత్తి పంట అధికంగా పండుతూ జిన్నింగ్ మిల్లులు లేని క్లస్టర్లను





గుర్తించాలన్నారు. అక్కడ సిసిఐ ద్వారా జిన్నింగ్ మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపి అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఎఫ్ఒ సిద్దార్థ్ విక్రంసింగ్, జెడ్పి సిఇఒ దీక్షారైనా, డిఆర్‌డిఒ సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యం అందాలి

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపి రఘురాంరెడ్డి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వార్డులను పరిశీలించారు. పైకప్పు కురుస్తుందని తెలుసుకుని అక్కడకు వెళ్లి చూశారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ చాంబర్‌లో వైద్యులతో సమావేశం నిర్వహించారు. 570 పడకల సామర్థ్యంతో ఉన్న ఆసుపత్రికి రోజుకు 2వేల మంది అవుట్ పేషంట్లు వస్తున్నారని ఎంపికి వైద్యులు తెలిపారు. వైద్య విధాన పరిషత్ వైద్య కళాశాల ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేదని ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లి ప్రభుత్వ ఆసుపత్రికి అధిక నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆసుపత్రి అవసరాల కోసం నాలుగు ఫ్రిజర్లను ఏర్పాటు చేయిస్తామని ఎంపి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, చావా శివరామకృష్ణ, మిక్కిలినేని నరేందర్, ఇమామ్, దుంపల రవి, రామకృష్ణారెడ్డి, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు ఎంపి పరామర్శ

ఖమ్మం నగరంలోని కమాన్‌బజార్ మసీదు సదర్ అజీజ్ ఆయన సోదరి ఇటీవల ప్రమాదంలో మృతిచెందారు. మంగళవారం కస్బాబజార్‌లోని మృతుల నివాసాలకు ఎంపి రఘురాంరెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ఎండి ముస్తఫా, మిక్కిలినేని నరేందర్, మజీద్, ఖాసీం, ఇమామ్, హకీం, గఫార్ పాల్గొన్నారు.

## పోరాటాల ఫలితమే హక్కుల సాధన

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు :** కమ్యూనిస్టులు చేసిన పోరాటాలతోనే హక్కులు సాధించుకున్నామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. త్యాగాలు, పోరాటాల చరిత్ర ఉన్న కమ్యూనిస్టు పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు. మంగళవారం చిక్కుడుకుంటలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణుగూరు భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి భూములను ఇవ్వనంటే ఆనాడు రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతులను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి వారిని ఒప్పించి, ఉద్యోగాలు ఇప్పించడంలో సిపిఐ పాత్ర ముఖ్యమైందన్నారు. డిసెంబర్ 26 నాటికి పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల కావస్తున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కామిశెట్టి రామారావు, సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, మంగి వీరయ్య, బాడిశ సతీష్ తదితరులు హాజరయ్యారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బట్ట రామారావు, సహాయ కార్యదర్శి గా బట్ట సాంబయ్య, కోశాధికారిగా మేడా వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా అలవాల సత్యంతో పాటు 11 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

## అసంఘటిత కార్మికులను ఆదుకోండి

ఎఐటియుసి ఖమ్మం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** అసంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డు బైపాస్‌లో పంచర్ వర్క్‌షాప్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని యాకూబ్‌పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌టిఎ, పోలీసు, ఆర్‌అండ్‌బి, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు కార్మికులపై వేధింపులను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మి నారాయణ, సిపిఐ వరంగల్ క్రాస్ రోడ్డు గ్రామ శాఖ కార్యదర్శి వెంపటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక...** అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గాదే లక్ష్మి నారాయణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యాకుబ్‌పాషా, రామచందర్(చందు), ఉపాధ్యక్షులుగా నాగేశ్వరావు, షేక్ లతీఫ్, మస్తాన్‌భాయ్, హబీబ్, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, బాబు, మహబూబ్, నాగరాజు, కోశాధికారిగా మహమ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి : ఎఐటియుసి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపై సింగరేణి యాజమాన్యం తక్షణమే నిర్ణయం తీసుకొని అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కిష్టాఫర్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం పరిధిలోని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి మేరకు గుర్తింపు సంఘం ఎఐటియుసి చేసిన కృషితో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచడానికి హామీని ఇవ్వడం జరిగిందని, పర్మినెంట్ కార్మికుల వేతనాలకు కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలకు మధ్య గల వ్యత్యాసాన్ని తగ్గించడానికి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని తీసుకున్న నిర్ణయంపై సింగరేణి యాజమాన్యం జాప్యం చేయకుండా తక్షణమే నిర్ణయించాలని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రంజిత్, రాజు, చుక్కయ్య, ఆదిలక్ష్మి, సుజాత, విమలమ్మ, వెంకటేశ్వర్లు, రాము, అన్వర్, విష్ణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న కార్మికులకు కనీస వేతనాలు

ఎఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యుడు రామకృష్ణ డిమాండ్




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిసమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ రాజేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస సౌకర్యాలు, వేతనం కల్పించకుండా విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశనంటుతున్నాయని అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెనూ చార్జీలు పెంచటం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.7 పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం రూ.5 ఇచ్చి చేతులు దులుపుకుంటుందన్నారు. 13 నెలల నుండి కోడిగుడ్డు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈనెల 31 వరకు బకాయిలు చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం అందించిన అల్పాహార బిల్లు, పెండింగ్‌లో ఉన్న 5 నెలల రూ.2వేల గౌరవ వేతనం తక్షణమే ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మధ్యాహ్న భోజన కార్మికులకు ఇస్తానన్న రూ.10 వేల గౌరవ వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి సత్తుపల్లి మండల కార్యదర్శి తెలగారపు రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తడికమళ్ళ యోబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి మహాదేవ లక్ష్మి, షేక్, రహీమున్నీసా, వెంకటలక్ష్మి, పూసి సీత, సక్కుబాయి,శ్రీలక్ష్మి, జరీనా, అనసూర్య, నాగలక్ష్మి, సుజాత, రాములమ్మ, కృష్ణవేణి, రత్నమాల, సుశీల, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## సంక్షేమపథకాలు పేదలకు వరం

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

**ప్రజాపక్షం/వైరా :** అర్హులైన పేదప్రజలకు సంక్షేమపథకాలు వరమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు, ఆడపడుచులకు అందిస్తున్న పథకాలు వారికి ఎంతగానో తోడ్పడుతుందన్నాను. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, కట్ల రంగారావు, రాంపూడి రోశయ్య, పాలేటి నర్సింహారావు, బోళ్ళ గంగారావు, జవ్వాజి నాగరాజు, సూర్యదేవర శ్రీధర్, ఇటుకల మురళి, పమ్మి అశోక్, మట్టూరి కృష్ణారావు పాల్గొన్నారు.



## 'డబుల్' నివాసితుల సమస్యలు పరిష్కరించండి

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** డబుల్ బెడ్‌రూం ఇండ్ల నివాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 60వ డివిజన్ మల్లేమడుగు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సంక్షేమ సంఘం ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఎన్నికల్లో సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బోడా వీరన్న ఎన్నికయ్యారు. 10 మందిని కార్యవర్గ సభ్యులుగా, 36 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోటు ప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమ సంఘం ఈ ప్రాంతాభివృద్ధికి డబుల్ బెడ్‌రూం ఇండ్లలో నివాసం ఉండే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రహదారులు, డ్రైనేజీ సౌకర్యం లేదని ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి నిధులు మంజూరు చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రాంతాభివృద్ధికి సిపిఐ కట్టుబడి ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన వీరన్న మాట్లాడుతూ ఇప్పటికే ఈ ప్రాంత సమస్యలను మేయర్‌తో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, నాయకులు బోజడ్ల సూర్యం, పీట్ల కృష్ణమూర్తి, తేజావత్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### తప్పిదాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్ మండలంలో పంట నష్టపరిహారం విషయంలో తప్పిదాలకు పాల్పడిన వ్యవసాయ అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. బోనకల్ మండలంలోని పలు గ్రామాల్లో వాస్తవంగా పంటలు నష్టపోయిన వారికి పరిహారం దక్కలేదని కాని కొందరు నేతల ప్రోద్బలంతో వ్యవసాయ అధికారులు సాగు చేయని భూములకు, భూమి లేని వారికి పరిహారం అందించారని ఆయన తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని వాస్తవంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు.

## యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

సిపి సునీల్ దత్

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** యువత పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ కోరారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సిపి ఆదేశాలతో నిర్వహిస్తున్న యాంటీ డ్రగ్స్ ప్రోగ్రాం కల్లూరు ఎసిపి అనిశెట్టి రఘు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి సిపి సునీల్‌దత్ హాజరయ్యారు. ముందుగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం సత్తుపల్లిలో గాంజా మత్తుకు అలవాటు పడిన యువతపై కేసులు నమోదు కావటం విస్మయాన్ని కలిగించిందని, మత్తుకు బానిసలైన యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటుందని, మత్తు పదార్థాలు, గాంజాకు బానిసలుగా మారుతున్న యువతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బులు కోసం గాంజా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అటువంటి యువతపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం, అమ్మడం చట్ట రీత్యా నేరమని హెచ్చరించారు. మత్తు పదార్థాల సమాచారం ఉంటే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసు వారికి తెలపాలన్నారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్న స్మగ్లర్లు అక్రమ పద్దల్లో డబ్బు సంపాదనకు యత్నిస్తారని అటువంటి వారితో యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాల నియంత్రణలో మీడియా సహకారం కావాలన్నారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ సిఐలు, ఎస్‌ఐలు, ఎఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## గ్యారెంటీ పథకాలు ప్రజలకు అందాలి

పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/కరకగూడెం :** మండల పరిధిలోని రేగళ్ల, సమత్ బట్టుపల్లి, బట్టుపల్లి, కన్నాయిగూడెం గ్రామపంచాయతీలలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో ప్రజల సమక్షంలోనే మాట్లాడారు, గ్యారెంటీ పథకాలు ప్రజలకు అందాలన్నారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలిపారు. పంచాయతీలలో నీటి సరఫరా గురించి, కరెంటు సమస్యల గురించి, ఇరిగేషన్, విద్య, వైద్యం అన్ని సమస్యలను అధికారుల దృష్టిలోకి తెచ్చి వారం లోగా అన్ని సమస్యలు పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈనెల ఆఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల పథకం, కొత్త ఫ్యామిలీ కార్డు సర్వే జరుగుతుందన్నారు. ప్రతీ పథకం అర్హులైన వారికి అందేలా చూసుకునే బాధ్యత తానే చూసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక ప్రజలు సమస్యలపై ఎమ్మెల్యే పాయంకి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, నాయకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, పోలేబోయిన తిరుపతయ్య, శ్రీవాణి, బట్టుపల్లి తోలెం నాగేశ్వరరావు, ఎర్ర సురేష్, గొగ్గలి రవి, జలగం కృష్ణ, వట్టం చుక్కయ్య, పూణేమ్ బుచ్చయ్య, పడిగా సమ్మయ్య, మోడెపు సాంబయ్య, కరకపల్లి నగేష్, బిజ్జా రామనాథం, బుడుగుల మధు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల జీవన ఉపాధిపై ఐఎఎస్‌ల క్షేత్రస్థాయి పర్యటన




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** గిరిజనుల జీవన ఉపాధిపై ఐఎఎస్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించారు. గిరిజనుల గురించి తెలుసుకుంటూ వారు పండిస్తున్న పంటలు వివరాలు, తండాలో స్థితిగతులపై క్షేత్రస్థాయిలో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్న సివిల్ సర్వీస్ పూర్తి చేసిన ఆరుగురు ఐఎఎస్ అధికారులు మండలంలోని 21న ఇస్లావత్ తండాకు చేరుకున్నారు. ఐఎఎస్ అధికారులకు మండల అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. వారు నాలుగు రోజులు ఉండేందుకు అన్ని ఏర్పాట్లు మండల తహసిల్దార్ పి.వి రామకృష్ణ, ఎంపిడిఒ ఎస్‌కే సిలార్ సాహెబ్, దగ్గరుండి అన్ని వసతులు కల్పించారు. మంగళవారం ఉదయం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శి సురేష్‌ని గ్రామ స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం గ్రామ పరిసరాలను పరిశీలించి గిరిజనులతో మాట్లాడుతూ వారి జీవనోపాదుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పివి.రామకృష్ణ, ఎంపిడిఒ ఎస్.కె. సిలార్ సాహెబ్, ఏఓ సీతారాం రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, డిటి నరసింహరావు, ఆర్‌ఐ వీరయ్య, ఏపీఎం అలివేలు మంగ, సీసీ బండ్ల నాగేశ్వరావు, కార్యదర్శి సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత, ఆనందమయ దీపావళి జరుపుకునేలా చర్యలు

అదనపు కలెక్టర్ శ్రీజ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా ప్రజలు సురక్షిత, ఆనందమయ దీపావళి జరుపుకునేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాట్లు, చేపట్టాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 31న జరుపుకునే దీపావళి పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖలన్ని సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల మైదానంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. షాపుల ఏర్పాటు అనుమతుల మంజూరులో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. అగ్నిమాపకశాఖ ఎన్‌ఒసి, మున్సిపల్, గ్రామపంచాయతీ అనుమతులు ఉండాలన్నారు. ఒక క్లస్టర్‌లో 50 షాపులకు మించి ఉండకుండా చూడాలన్నారు. నిషేధిత టపాసులు అమ్మకుండా నిఘా పెట్టాలన్నారు. మైదానంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇసుక, వాటర్ ట్యాంకర్లు, ఫైరింజన్లను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్‌పనుల్లో లూజు వైర్లు, అతుకుల వైర్లు లేకుండా చూడాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్, ఎఎన్‌ఎంలతో వైద్యశిబిరం ఏర్పాటు చేసి డ్రెస్సింగ్ కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. దీపావళి రోజు స్పెషలిస్టు డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రజలు ప్రమాదాల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెం.1077కు కాల్ చేస్తే అధికారులు స్పందించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఎస్‌బి ఎసిపి సాంబరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.అజయ్‌కుమార్, ఎస్‌ఆర్‌బిజిఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా, డిఎంహెచ్ఒ డాక్టర్ వి.సుబ్బారావు, కల్లూరు ఆర్‌డిఒ ఎల్.రాజేందర్, ఖమ్మం కార్పొరేషన్ సహాయ కమిషనర్ షఫీవుల్లా, మధిర, వైరా మున్సిపల్ కమిషనర్లు సంపత్‌కుమార్, వేణు, అధికారులు పాల్గొన్నారు.




## జిల్లాలో 70వేల మంది రైతులు.. రూ.250 కోట్లు పంపిణీ

డిసిసిబి సిఇఒ వసంతరావు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లా కేంద్ర సహకార సంఘం పరిధిలో 70 వేల మంది రైతులకు రూ. 250 కోట్ల ను అందించినట్లు డీసీసీబీ సీఈవో వి.వసంతరావు అన్నారు. మండలం లోని పైనంపల్లి సొసైటీ పరిధిలోని మంగళవారం నూతన రైతులకు రుణాలు పంపిణీ కార్యక్రమం ను నిర్వహించారు. రూ.30 లక్షల రుణాలను సీఈవో చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడారు...రైతుల ప్రయోజనం కోసం డీసీసీబీ సేవలు మరింత చేరువ కు తీసుకోచ్చేందుకు కొత్త బ్రాంచిలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో చెరువుమాధారం, కరుణగిరి, కందుకూరు లో డీసీసీబీ బ్రాంచిలు త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు డీసీసీబీ అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పైనంపల్లి సొసైటీ జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ఇందు, సూపర్‌వైజర్ నాగప్రసాద్, సొసైటి ఉపాధ్యాక్షుడు కలకుంట్ల శ్రీను, విజయభాస్కర్, భాస్కర్‌రెడ్డి, వెంకట్రామయ్య, బాలాజీ, శ్రీను, సామేల్, నాగేశ్వరరావు, సీఈవో జగదీష్, సిబ్బంది రాంబాబు, అనుసూయ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కూనంనేని కృషి ఫలితం..రూ.16.70కోట్ల నిధులు



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** సుదీర్ఘకాలంగా గ్రామీణ, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంకోసం స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిర్విరామంగా చేస్తున్న కృషికి అనతికాలంలనే ఫలితాలు లభిస్తున్నాయి. పట్టణంలోని పాతకొత్తగూడెం నుంచి చుంచుపల్లి మండలంలోని పెనుబల్లి రహదారిలో గోదుమవాగుపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టిసారించిన కూనంనేని, ప్రతిపాదనలు అందించిన ఫలితంగా బ్రిడ్జి, రోడ్డు నిర్మాణానికి రూ.6.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. నాన్య తండా మీదుగా బేతంపూడి నుంచి నల్లవాగు వరకు రోడ్డు, బ్రిడి నిర్మాణంకోసం రూ.1.80కోట్లు మంజూరు లభించింది, పాల్వంచ మండలంలోని సోములగూడెం రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.4కోట్లు, లక్ష్మి దేవిపల్లి మండలంలో గడ్డిగుట్టతండా మీదుగా తెలగరామవరం నుంచి పులిగుండం తండా వరకు బిటి రోడ్డుకు రూ.ఒక కోటి, పాల్వంచ మండలంలో పుల్లాయిగూడెం నుంచి ప్రబాత్‌నగర్ వరకు గతంలో రూ.కోటి మంజూరుకాగా మరో రూ.70లక్షలు, లక్ష్మి దేవిపల్లి మండలంలోని సీతారాంపురం గ్రామం నుంచి రూప్లాతండా రోడ్డులో రూ.ఒక కోటితో బ్రిడి నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంఓ రవాణా వ్యవస్థను మెరుగుపర్చేందుకు కృషిచేస్తున్నానని, నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరిన ప్రధాన, గ్రామీణ రహదారులు, బ్రిడ్జిల పునఃనిర్మాణానికి సంబంధిత మంత్రులు, అధికారులకు ప్రతిపాదనలు అందించి నిధులు మంజూరు చేయించడం జరిగిందని, తాజాగా రూ.16.70 కోట్ల సిఆర్‌ఆర్ నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. మారుమూల పల్లెల అభివృద్ధి, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నానని కూనంనేని పునరుద్ఘాటించారు.

## పేదలకు అండ సిఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : పేదలకు అండ సిఎంఆర్‌ఎఫ్ అని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్‌లోని నార్త్ హస్తినాపురం కాలనీకు చెందిన బిధిత తండ్రి అరవింద్ గుండె చికిత్సకు ఎల్‌ఒసిని బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో రమావత్ శ్రీనివాస్‌నాయక్, భీమానాయక్ పాల్గొన్నారు.

# మహానగరి

హైదరాబాద్ రంగారెడ్డి

## వ్యాపారుస్తులు అద్దెకు ఇస్తే రద్దు చేస్తాం



ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాళీ మందిర్ మార్కెట్‌లో వీధి వ్యాపారులకు కేటాయించిన షెడ్లను ఇతరులకు అద్దెకు ఇస్తే వారికి కెటాయించిన షెడ్డును రద్దు చేస్తానని కమిషనర్ బి.శరత్ చంద్ర హెచ్చరించారు. మంగళవారం అధికారులతో కలిసి మార్కెట్‌ను తనిఖీ చేశారు. కెటాయించిన షెడ్లను వీధి వ్యాపారులే నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

మునిసిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ



ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ : పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో అన్ని కాలనిలకు మౌళిక సౌకార్యల కల్పనకు కృషి చేస్తొనాని చైర్ పర్సన్ పండుగుల జయశ్రీ రాజు అన్నారు.పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డులో పోలీస్ కాలనిలో మంగళవారం డ్రైనేజీ పనులకు అమె శకుస్దాపన చేసినారు.ఈ సంధర్బంగా అమె మాట్లాండుతూ.. పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డులలో ప్రజల కనిస అవసరలైనా త్రాగునీరు విద్యుత్ రోండ్లు డ్రైనేజీ పనుల కోరకు అత్యదిక ప్రాధన్యత ఇస్తున్నాట్లు తెలిపినారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ రవింద్రర్‌రెడ్డి,కౌన్సిలర్‌లు సిద్దేక్కి క్రిష్ణరెడ్డి,పసుల రాజేంద్రర్,డిఇ శివానందం, నాయకులు విజేంద్రర్ రెడ్డి,కాలని వాసులు పాల్గొన్నారు.

## పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎస్‌ఐలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: సమాజంలో పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని, శాంతి భద్రతల పరిపక్షణ కోసం నిరంతరం పోరాడే ఎకైకయ శాఖ పోలీస్ అని ఎస్‌ఐలు బలరాంనాయక్, శరత్‌లు అన్నారు. మంగళవారం సైబరాబాద్ పోలీప్ కమీషనర్ అవినాత్ మహంతి ఆధ్వర్యంలో శంషాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో షాద్‌నగర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. రక్తదానం ప్రాణదానమని, ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అమర వీరుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళాల్సిన అవపరం ఎంతైనా ఉందని అన్నారు. సమాజంలో ప్రశాంతత ఉందంటే, ఎవరి పనులు వారు చేసుకుంటున్నారంటే అందుకు పోలీసులేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని సూచించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను నిప్పక్షపాతంగా అమలు చేయడం జరుగుతుందని, అందులో కీలకం పోలీసులదేనని అన్నారు. అమరులైన పోలీసుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని యువ పోలీసులు ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. సమాజం కోసం, భవిష్యత్ తరాల కోసం, ప్రజా రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా ఆహోర్నిశలు విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోలీసులు లేని సమాజం ఊహించలేమని, అమరుల కుటుంబాలకు ఆదర్శంగా నిలువాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## వరద ప్రభావ కాలనీలకు శాశ్వత పరిష్కారం

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్‌: వరద ప్రభావ ప్రాంత కాలనీలకు శాశ్వత పరిష్కారం దిశగా ట్రంక్ లైన్ నిర్మిస్తున్నామని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తూర్పు వనస్థలిపురంలోని కమలా నగర్ కాలనీలో నిర్మిస్తున్న వరద కాలువ లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాపు నీరు కాలనీలపై వరద ప్రభావం లేకుండా పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో కాలనీలు ముంపుకు గురికాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారులు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారుల పరివేక్షణ ఉండాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిఇ దామోదర్, ఏఇ హేము నాయక్, జలమండలి మేనేజర్ రాజు, వర్క్ ఇన్సెపెక్టర్ సురేష్, కాలనీ అధ్యక్షులు టివి రావు, కాలనీ వాసులు సుబ్బారావు, మదన్, కిషన్ రావు, గణేష్, పార్టీ నాయకులు గోవింద చారి తదితరులు పాల్గొన్నారు.

## మూసీ బాధితులకు అండగా ఉంటాం



ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : రాజేంద్ర నగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్,బైరాగిగూడ,గంధం గూడ,విఘ్నేశ్వర కాలనీ,శివపురి కాలనీ,దత్తత్రేయ కాలనీ,కిస్మత్‌పూర్ ప్రాంతాల్లో ఇండ్లు కోల్పోతున్న మూసీ బాధితులకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందిని రాజేంద్ర నగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బిజెపి బిజేఎంసీ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశానికి తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఈనెల 23వ తేదీన మూసీ బాధితులకు అండగా నిలిచేందుకుగాను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి,చెవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,అదిలాబాద్ శాసన సభ్యులు పాయల్ శంకర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్,కొమురయ్య, మల్లేష్ యాదవ్,బుక్క వేణుగోపాల్, బిజెపి బిజేఎంసీ అధ్యక్షులు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీసే మతోన్మాద కుట్రలు అడ్డుకోవాలి

ఇటి నరసింహ్మా



ఘనంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో మతోన్మాద శక్తులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అల్లరు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని, వీటిని ప్రభుత్వం కఠినంగా అణిచివేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈ.టి.నరసింహ్మా విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లోని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. నేర్లకంటి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమాశానికి ముఖ్య అతిధిగా ఈటి నరసింహ్ హాజరై మాట్లాడుతూ హైదరాబాద్ ఐటి రంగంలో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్న క్రమంలో ప్రశాంతంగా ఉన్న నగరంలో ప్రజల మధ్య మతవిద్వేషాలు సృష్టిస్తున్న శక్తుల పట్ల ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, నిఘా వ్యవస్థ అప్రమత్తంగా ఉండంతో పాటు ఘటనలు జరగకముందే అరెస్టు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి నుండి మొదలుకొని మొన్న జరిగిన ముత్యాలమ్మ ఆలయం విగ్రహ విధ్వంసం వరకు జరిగిన ఘటనలను అసరాగా చేసుకుని మతోన్మాదశక్తులు మతవిశ్వాసాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఘర్షణలు సృష్టిస్తురన్నారు. మతోన్మాద శక్తులు ఇతర మతాల విశ్వాసాలకు వ్యతిరేకంగా యువతను కేంద్రంగా చేసుకుంటూ అబద్దాలను ప్రచారం చేస్తూ, నిరంతరం తమ ఉపన్యాసాల ద్వారా రెచ్చగొడుతూ అమాయకులైన యువకులను బలిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మత శక్తుల చేతుల్లోకి పోకుండా ఉండాలంటే లౌకిక ప్రజాస్వామ్య శక్తులు నిరంతరం ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ఈ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉన్నదని తెలిపారు. భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పడి 100 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈటి నరసింహ్మా తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా పార్టీ చేసిన త్యాగాలు పోరాటాలను స్మరించుకుంటూ వివిధ ప్రాంతాలలో సెమినార్లు సభలు సమావేశాలు ర్యాలీలు నిర్వహించాలని, ప్రజల కోసం త్యాగాలు చేసిన నాయకుల చరిత్రను పుస్తకాల రూపంలో ప్రజల వద్దకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లాకార్యదర్శి ఛాయాదేవి, సహాయకార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, బి.వెంకటేష్, శంకర్ నాయక్, చంద్రమోహన్‌గౌడ్, నళిని, కాంపల్లి శ్రీనివాస్, ఉమర్ ఖాన్, మహమూద్, కొమురెల్లి బాబు, లక్ష్మి బాయి, బొడ్డుపల్లి కిషన్, పి.వెంకటయ్య, బాలకృష్ణ, నర్సింగ్‌రావు, గ్యార నరేష్ చైతన్య, మాజిద్, ఇమ్రాన్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో గంజాయి సరఫరా

ముగ్గురి అరెస్టు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆన్‌లైన్‌లో గంజాయిని హైదరాబాద్‌కు తెప్పించుకుని విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను ఎస్‌టిఎఫ్ డీ టీమ్ సిఐ నాగరాజు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి కిలో గంజాయితో పాటు రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బోడుప్పలకు చెందిన నక్క వినిత్, బ ల్కంపేట్కు చెందిన మోక తేజష్ కృష్ణ, దామ్మాయిగూడకు చెందిన గరికల అనుదీప్ ఈ ముగ్గురు చిరుద్యోగులు. అధిక లాభాల కోసం ఆశపడిన ఈ ముగ్గురు ఒక ముఠాగా ఏర్పాడ్డారు. ఆన్‌లైన్‌లో గంజాయిని బుక్ చేసుకుని ఒడిశా, ఆంధ్రా నుంచి గంజాయిని హైదరాబాద్‌కు రప్పిస్తున్నారు. ఇక్కడికి వచ్చిన గంజాయిని ఈ ముగ్గురు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు వల పని పట్టుకున్నారు.

## 'ప్రజావాణి' కార్యక్రమం అద్భుతం

ప్రజాభవన్ సందర్శించిన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందం



ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం అద్భుతంగా ఉందని, ప్రజలు ప్రజాభవన్‌లో తమ సమస్యలు విన్నవించేందుకు భారీగా తరలి వస్తుండటం విశేషం అని ఇండియన్ ఆర్మీ, నేవీ, ఏయిర్ ఫోర్స్, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందం అభిప్రాయపడింది. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జీ డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవారాజన్ లతో ఈ బృందం అధికారులు సమావేశమయ్యారు. ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా చిన్నారెడ్డి, దివ్య ఆ బృందానికి వివరించారు. బృందంలోని కొంత మంది అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు చిన్నారెడ్డి, దివ్య సమాధానాలు ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అర్జీలు అందజేసిన వెంటనే సమస్యలు ఓపికతో విని సిఎం ప్రజావాణి పోర్టల్ ద్వారా సంబంధిత శాఖల అధికారులకు పంపుతామని, సిఎం ప్రజావాణి పేరిట రసీదు ఇస్తామని, ప్రజల సమస్య పరిష్కారం అయ్యేవరకు నిరంతరంగా ఫాలోఅప్ ఉంటుందని చిన్నారెడ్డి, దివ్య తెలిపారు. అర్జీలు స్వీకరించి వాటిపై ఎండార్స్‌మెంట్ చేసి, సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని బృందానికి వివరించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రాంతాన్ని బృందం సందర్శించింది. ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించిన బృందం... ప్రజావాణి కార్యక్రమం అధ్భుతం అని కొనియాడింది. కార్యక్రమంలో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి అధికారి మాధవీ రావులపాటి పాల్గొన్నారు.

## 'ఒటిఎస్' సద్వినియోగం చేసుకోవాలి

వినియోగదారులకు జలమండలి ఎండి అశోక్‌రెడ్డి విజ్ఞప్తి

అసలు మొత్తం చెల్లిస్తే ఆలస్య రుసుం, వడ్డీపై రాయితీ



ప్రజాపక్షం/హైదరాబాద్ : వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకంతో పెండింగ్ బిల్లులను చెల్లించి, ఆలస్య రుసుముతో పాటు వడ్డీపై రాయితీ పొందాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా బిల్లులు చెల్లించని వినియోగదారులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈపథకం ఈనెల 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు. చాలాకాలంగా పెండింగ్ ఉన్న నల్లా బిల్లుల్ని చెల్లించి, నగర ప్రజలకు తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ సేవలు అందిస్తున్న జలమండలికి సహకరించాలని కోరారు.

**చెల్లింపు విధానం...** జలమండలి కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్ల వద్దకు నేరుగా వెళ్లి బిల్లు చెల్లించవచ్చు. ఆన్ లైన్ విధానంలో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్ ద్వారా చెల్లించవచ్చు. 3. నెట్, ఆర్‌టిజిఎస్, బిపిపిఎస్ ద్వారా చెల్లించే అవకాశం కూడా ఉంది. జలమండలి అధికారిక వెబ్ సైట్ www.hyderbadwater.gov.in కు లాగిన్ అయి.. చెల్లింపులు చేయవచ్చు. లైన్ మెన్లు మీ గృహాల్ని సందర్శించినప్పుడు వారి దగ్గర ఉండే యంత్రం ద్వారానూ బిల్లు చెల్లించవచ్చు. మీ సేవ, ఏపీ ఆన్ లైన్ కేంద్రాల ద్వారా సైతం బిల్లు చెల్లించే అవకాశాన్ని కల్పించారు. జలమండలి అందించే క్యూర్ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సలుభంగా బకాయి మొత్తం చెల్లించవచ్చు.

**వడ్డీ మాఫీ పరిధి ఇలా...** నల్లా బిల్లుల బకాయిలపై వడ్డీ మాఫీ కోసం అధికారులకు స్థాయిని బట్టి అమౌంట్ పరిధిని నిర్ణయించారు. దీని ప్రకారం, మేనేజర్ స్థాయిలో రూ.2000 వరకు, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.2001 నుంచి రూ.10,000వరకు, జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.10,001 నుంచి రూ.1,00,000వరకు, చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.1,00,001నుంచి అంతకంటే ఎక్కువ బిల్లు మాఫీ చేసే అధికారం ఉంది. 13.50 లక్షలు నల్లా కనెక్షన్లు ఉన్న జలమండలిలో ఈ వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకం ద్వారా 7 లక్షలకు పైగా వినియోగదారులకు లబ్ది చేకూరనుంది. వీరి వద్ద నుంచి అసలు మొత్తం దాదాపు రూ.1706 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. కాగా, రూ.1189 కోట్ల బకాయిలు మాఫీ అవుతాయి. జలమండలి వినియోగదారుల క్యాన్ నంబర్‌కు అనుసంధానమై ఉన్న మొబైల్ నంబరుకు బకాయి మొత్తం, ఎంత చెల్లించాలి, ఎంత మాఫీ అవుతుంది తదితర వివరాలన్ని ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతోంది. అలాగే సామాజిక మాధ్యమాలైన ట్విటర్, ఫేస్ బుక్, ఎలక్ట్రానిక్ మీడియా, ఎఫ్ఎం రేడియో, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఓటీఎస్2024 పథకం గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తోంది. ఒటిఎస్ పథకంపై ఏవైనా సందేహాలుంటే.. జలమండలి 155313 నంబరుకు ఫోన్ చేసి వాటిని నివృతి చేసుకోవచ్చు.

**నిబంధనలు...**ఒటిఎస్ ఈ నెల 31 వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. గతంలో ఓటిఎస్ పథకాన్ని వినియోగించుకోని వారు, ఒకేసారి బిల్లు చెల్లిస్తే, ఆలస్య రుసుం, వడ్డీ మాఫీ అవుతాయి. గతంలో ఓటిఎస్ పథకం ద్వారా ప్రయోజనం పొందిన వినియోగదారులకు 50 శాతం వరకు బిల్లు మాఫీ అవుతుంది. ఈ పథకం కింద ప్రయోజనం పొందాలనుకునే వినియోగదారులు.. భవిష్యత్తులో 24 నెలల పాటు తప్పనిసరిగా క్రమంగా బిల్లులు చెల్లిస్తామని హామీ పత్రం ఇవ్వాలి. అంతేకాకుండా.. బిల్లు చెల్లింపుల విషయంలో వారు విఫలమైతే, ఈ పథకం కింద వారు పొందిన ప్రయోజనాన్ని రద్దు చేస్తారు. తమ నల్లా కనెక్షన్.. డిస్ కనెక్షన్ స్థితిలో ఉన్న వినియోగదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాలనుకుంటే.. ఇప్పటి దాకా పెండింగ్ లో ఉన్న బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.

## విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి

బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువుల డిమాండ్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్‌: విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గడియగౌరారం గ్రామానికి చెందిన పాతమోని జంగయ్య (32) బిఎన్‌రెడ్డి డివిజన్ లోని సాగర్ కాంప్లెక్స్‌లో నివసిస్తున్నాడు. రెండు నెలలుగా బిఎన్‌రెడ్డినగర్ డివిజన్లోని హైరైస్ కన్స్టేషన్ భవనంలో పనిచేస్తున్నాడు. మంగళవారం విద్యుత్ పనిచేస్తుండగా ప్రమాదశాత్తు కరెంట్ షాక్ తగిలి జంగయ్య మృతిచెందారు. బాధితుడి కుటుంబసభ్యులకు బిల్డర్ సమాచారం ఇవ్వకుండా హైరైస్ కన్స్ట్రక్షన్ యజమాని వైద్యం కోసం ప్రయత్నించకుండా మృతిదేహాన్ని దహనం చేయడానికి ప్రయత్నించారని బాధితుల బంధువులు ఆరోపిస్తున్నారు. కరెంట్ షాక్ కొట్టగానే ఆసుపత్రికి తరలించిన జంగయ్య బతికేవారని, కనీసం సమాచారం ఇవ్వలేని హైరైస్ కన్స్ట్రక్షన్ యజమానిపై క్రిమినల్ కేసులు పెట్టాలని బంధువులు ఆందోళన నిర్వహించారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వనస్థలిపురం పోలీసులు చేరుకుని ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెప్పి విరమింపచేశారు. అనంతరం మృతిదేహాన్ని పోస్టుమార్టం కొరకు ఉస్మానియాకు తరలించారు. బాధితునికి ఒక సంవత్సరం పాప, భార్య ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## మంత్రి ఉత్తమ్‌కు లేఖ పంపాం: వడ్లమూరి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : ఎస్‌సి వర్గీకరణ, క్రీమీ లేయర్ అమలు చేయొద్దని కోరుతూ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఆన్‌లైన్‌లో లేఖపంపించినట్టు ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ కమిటీ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని కేంద్ర సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ, క్రీమీలేయర్ అమలైతే మొత్తం దళిత జాతులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కు పంపిన లేఖలో పేర్కొన్న అంశాలపై రాష్ట్రప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి కుల, తెగ గణనను శాస్త్రీయంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డాక్టర్ వి.ఎల్. రాజు, జెఎన్‌రావు, పబ్బతి శ్రీకృష్ణ, మహిళావిభాగం అధ్యక్షురాలు రోజా పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఎఐఎస్‌ఎఫ్ షాద్‌నగర్ అధ్యక్షుడు విజయ్‌చారి






ప్రజాపక్షం/షాద్‌నగర్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఐఎస్‌ఎఫ్ షాద్‌నగర్ అధ్యక్షుడు ఏ.విజయ్‌చారి ఆరోపించారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఎఐఎస్‌ఎఫ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ చారి మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదునెలలు గడుస్తున్నా నేటికి సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదినెలలు కావస్తున్నా నేటికి విద్యాశాఖ మంత్రిని నియమించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కానికి ఈనెల 23న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ కార్యదర్శి నరేష్ రాథోడ్, ఉపాధ్యక్షులు రమేష్, గణేష్, తరుణ్, విజయ్ పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి:** పెండింగ్ ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ శేలింగంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బిహెచ్ఎల్ లింగంపల్లి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి ధర్మతేజ, అధ్యక్షులు నితీష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, బకాయిలు కడితేనే ఇస్తామని కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం విద్యార్థులను ఆదుకోవాలని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఉదయ్, గణేష్, కిరణ్, కార్తీక్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## పార్కులను వినియోగించుకోండి

### కార్పొరేటర్ గున్నాల సునీత



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్న పార్కులను వినియోగించుకొంటూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతా శేఖర్‌యాదవ్ అన్నారు. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగళవారం డివిజన్‌లోని ఎంజె కాలనీ పార్కును కాలనీ వాసులు ప్రసాద్ చౌదరి, శాంతారామ్, సాయిబాబా, శివగౌడ్, శ్రీనివాస్ యాదవ్, దివ్యలతో కల్సి సందర్శించారు.

# మహానగరి

మేడ్చల్ మల్కాజ్‌గిరి వికారాబాద్

## కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వినతి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఓల్డ్ మీర్ పేట కాలనీలో త్రీ ఫేజ్ సప్లయితో కూడిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని హెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ కోరారు. గత కొద్ది రోజులుగా డివిజన్‌లోని ప్రజలు విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని మల్లాపూర్ విద్యుత్ విభాగ ఏఈ నాగరాజు కు వివరించారు. సమస్య పరిష్కరిస్తానని ఏఈ హామీ ఇచ్చారు. కాలనీ సంక్షేమ సంఘ నాయకులు అంజి, దండెం నరేందర్‌తదితరులు కార్పొరేటర్ వెంట ఉన్నారు.



## భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి : కార్పొరేటర్

**ప్రజాపక్షం/అల్వాల్:** భవిష్యత్ తరాలు భూమిపై మనుగడ సాగించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం అల్వాల్ డివిజన్‌లోని అయ్యార్ బస్తిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మునిసిపల్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత లోపించడం వల్ల పకృతిలో అతివృష్టి అనావృష్టి లాంటి అనార్ధాలు లాంటివి సంభవిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు ఏ ఎమ్ హెచ్ ఓ రజిని, శానిటేషన్ సూపర్వైజర్ ప్రభాకర్, కాలనీవాసులు నరసింహ, నరేందర్, స్వామి, స్థానిక నాయకులు మల్లేష్ గౌడ్, యాదగిరి గౌడ్, తదితరుల పాల్గొన్నారు.



## ఔట్‌సోర్సింగ్ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రొఫసర్ కోదండరాం నివాసంలో కలిసి ఔట్సోర్సింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఔట్సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను ఎత్తివేసి కార్పొరేషన్ ద్వారా జీతభత్యాలను చెల్లించాలని కోరారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ ఔట్సోర్సింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ నాయకులు వెంకటేష్, సాయిలు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఐస్ ఫ్యాక్టరీ రోడ్డులో వెలుగులు



**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్ ఐస్ ఫ్యాక్టరీ రోడ్డులో వీధి దీపాలు లేకపోవడంతో చీకటిగా ఉండి ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో డివిజన్ బిజెపి ఉపాధ్యక్షులు రాజిరెడ్డి నేతృత్వంలో అల్వాల్ మున్సిపల్ కార్యాలయం ప్రజావాణిలో వీధి స్తంభాలు లైట్లు ఏర్పాటు చేయాలని దరఖాస్తు స్వీకరించడం జరిగింది. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను గమనించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి పనులు చేశారు. వారికి పలు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



## పాఠశాలల బలోపేతానికి కృషి

### విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తన్నట్లు తెలంగాణ విద్యా కమిషన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమక్షంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించి పాఠశాల స్థితిగతులపై ఆరా తీశారు. విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక వసతులు, క్రీడా ప్రాంగణం, లైబ్రరీ, తాగునీటి వసతి, మరుగుదోడ్లు వంటి అనేక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ బడులను మరింత మేరుగుపర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. ముందుగా కడ ప్రత్యేక కార్యాయలంలో విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యారంగ సమస్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అదేవిధంగా అంగన్ వాడీ స్కూల్స్‌పై అప్‌గ్రేడ్ పై కొడంగల్ సిడిపివో రజితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కమిషన్ సభ్యులు విశ్వేశ్వరరావు, సిహెచ్. వెంకటేష్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, కడ ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి రాంరెడ్డిలతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులున్నారు.



# లింక్ రోడ్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య దూరం

### ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**ప్రజాపక్షం/దుండిగల్ :** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని లింకు రోడ్ల పనులపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డిసిఎల్), జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ లింకు రోడ్ల అభివృద్ధితో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతోపాటు దూరం తగ్గుతుందన్నారు.

లింక్ రోడ్డు పనుల అభివృద్ధిపై అధికారులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎవ్వరికీ అసౌకర్యం కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసిపి సురేందర్ రెడ్డి, టిపిఎస్ రమేష్, న్యాక్ ఇంజనీర్ జయశ్రీ, విజయ్ కుమార్, విట్టలయ్య, హెచ్ఆర్డి సిఎల్ అధికారులు జెరేమయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ :** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన రిపోర్టర్లు,ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



## బిసి హక్కుల సాధన సమితి 3వ మహాసభలు జయప్రదం చేయండి

### మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా నాయకులు పాలబిందెల శ్రీనివాస్ పిలుపు

**ప్రజాపక్షం/దుండిగల్:** ఈ నెల 23న బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా 3వ మహాసభలను నీలం రాజశేఖర్ రెడ్డి భవన్, కాప్రలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 15 మండలాల నుండి బీసీ ప్రతినిధులు, బీసీ నాయకులు అధిక సంఖ్యలో ఈ మహాసభలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు.

ఈ మహాసభలకు ముఖ్య అతిధులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర బాద్యులు, ఎన్.బాలమల్లేష్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి పాల్గొంటున్నారని అన్నారు. ఈ మహాసభలో ముఖ్యంగా బీసీ సమస్యలపై చర్చించి భవిషత్తు ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన వెంటనే చేపట్టి పూర్తి చేయాలనీ, స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీ లకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి గ్రామ పంచాయితీ సర్ పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయితీల్లో గత 7, 8 నెలల నుండి అధికారుల పాలనతో ప్రజా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నారని తెలిపారు. బీసీల అభివృద్ధి, సంక్షే మం, స్వయం ఉపాధి అవకాశల కోసం, తదితర సమస్య పరిస్కారం కోసం సమావేశంలో చర్చిందే భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని, మేడ్చల్ జిల్లాలోని మండల, గ్రామాల నుండి బీసీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ నెల 23న నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ కాప్రలో జరుగు బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలనీ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు పాలభిందెల శ్రీనివాస్ తెలిపారు.




నిజాంపేట్ పరిధిలోని ఇంద్రన్న కాలనీలో సిపిఐ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు కొమరం భీమ్ జయంతి ఘనంగా నిర్వహించరు . ఈ కార్యక్రమనికి సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అడివిలో పుట్టి, అడవిలో బతికి, అడవి కోసం పోరాటం చేసి అడవిలో చనిపోయిన అడవి బిడ్డ గిరిజన జాతి పోరాట యోధు డు, ఆదిలాబాద్ గోండు జాతి ఉద్యమ నాయకుడు, తెలంగాణ సాయుద పోరాట విప్లవ వీరుడు కొమరం భీమ్ అని కొనియాడారు. జల్ జంగిల్ జమిన్ నినాదాన్ని ఆయుధంగా చేసుకొని ఆదివాసుల హక్కులకు ప్రతికగా నిలిచి, ఆదివాసులకు జీవన ధారమైన భూమిని, అడవులను, నిరును కాపాడేందుకై బలమైన పోరాటం చేసిన ఆదివాసీ మణిపూస కొమరం భీమ్ అని అన్నారు. కనుక అయన ఆశయా సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఆశీ.యాదయ్య, శేషయ్య, సైదులు, ఖాజా, రసీద్ లక్ష్మయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జన వ్యర్థాలు తొలగించేదెన్నడో?

### శామీర్‌పేట చెరువు పట్టించుకోని మున్సిపల్ కమిషనర్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట పెద్ద చెరువులో వ్యర్థాలు నిండిపోయి పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్న వాటిని తీసివేయడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని శామీర్‌పేట మండల ప్రజలు వాపోతున్నారు. ఇటీవల వినాయక చవితి పండగను పురస్కరించుకుని శామీర్ పేట మండలం చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాకుండా నగరం నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి వినాయక విగ్రహాలతో పాటు పూజా సామాగ్రిని శామీర్‌పేట చెరువులో నిమర్జనం చేశారు. అలాగే దుర్గామాత నవరాత్రుల సందర్భంగా అమ్మవారి విగ్రహాలను చెరువులో నిమర్జనం చేశారు. అయితే నిమర్జనం ఏర్పాట్లపై చూపిన శ్రద్ధ నిమర్జనం అనంతరం వ్యర్థాలను తీసేయడంలో అధికారులు ఆసక్తి చూపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శామీర్‌పేట పెద్ద చెరువు నిండి జళకళ సంతరించుకుంది. రాజీవ్ రహదారికి ఆనుకుని చెరువు పరిసరాలు ఉండటంతో పర్యాటకులు శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున శామీర్‌పేటకు వస్తుంటారు. ఈ క్రమంలో ప్రజలు అహ్లాదకరంగా, ఆనందంగా గడపడానికి వస్తే చెరువు పరిసరాలు అపరిశుభ్రంగా, కంపు కొడుతు దుర్వాసన రావడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. తూంకుంట మున్సిపల్‌లో కలిసిపోయిన శామీర్‌పేటలో పారిశుద్యంపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు బావిస్తున్నారు. ఇప్పటికైన మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించి శామీర్‌పేట పెద్ద చెరువులో పేరుకపోయిన చెత్త చెదారాన్ని తీసివేయాలని మండల ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.



## అయోడిన్ లోపం వల్ల వ్యాధులు రాకుండా అప్రమత్తత

### జిల్లా ఇన్‌చార్జి డిఎంహెచ్‌ఓ శోభారాణి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** అయోడిన్ లోపం వల్ల మానసిక అభివృద్ధి లోపం, హైపో థైరాయిడిజం, క్రెటినిజం, గోయిటర్, నవజాతి శిశువులు, పిల్లల్లో బుద్ధి మాంద్యం, జన్యుపరమైన లోపాలు, వృద్ధి మందగింపు, మూత్రపిండాల సమస్యలు, వంధ్యత్వం లాంటి పలు వ్యాధులు సంభవిస్తాయని జిల్లా ఇన్‌చార్జి వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శోభారాణి తెలిపారు.

గ్లోబల్ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవ సందర్భంగా మల్కాజిగిరిలో ర్యాలీ నిర్వహించిన అనంతరం మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహనా సదస్సులో మాట్లాడారు. అయోడిన్ లో పం ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రానున్న వారంరోజుల పాటు విద్యా సంస్థలు,ఆరోగ్య కేంద్రాల్లో అవగాహనా సదస్సులు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టాలని ఆదేశించారు. అయోడిన్ కల్గిన ఉప్పును వినియోగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా.విజయ నిర్మల, డా.వినోద్, లింగాల అక్షయ కుమార్, థెరిస్సా, రిపోర్టింగ్ అధికారులు వేణుగోపాల్, రాము, బాలరాజు, జోసెఫ్ జానకమ్మ, వెంకటేశ్వర్లు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.






## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామానికి చెందిన రజిని అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 42 వేలు మంజూరు అయ్యాయి.చెక్కును మంగళవారం మాజి మంత్రి చామకూర మల్లారెడ్డి బాదిత కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు ముక్కెర్ల సంజవ్‌యాదవ్, బిఆర్ఎస్ మూడుచింతలపల్లి మండల అద్యక్షుడు మల్లేష్‌గౌడ్, సీనియర్ నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

# వరి ధాన్యం కోనుగోలుకు జాగ్రత్తలు

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఖరీఫ్ వరి పంట ధాన్యం కోనుగోలుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ మంగళవారం సంంధిత అధికారలను అదేశించారు. కార్యక్రమంలో బాగంగా కలెక్టరెట్ కార్యలయంలో వానా కాలం 202425 వరి ధాన్యం కోనుగోలు పై సన్నాహక మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు గ్రేడ్ ఎ రకం కు రూ.లు 2320/ రూ.లు సాధారణ రకానికి రూ.లు 2300/ మరియు సన్న రకానికి అదనంగా 500/ రూ.లు చెల్లించడం జరుగుతుందని, కోనుగోలు కేంద్రాల వారు సన్న రకవ వరి ధాన్యం గుర్తించడంలో ఎఓ, ఏఈఓ వ్యవసాయ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. కొనుకోలు కేంద్రాల యందు సన్న ధ్యానం, దొడ్డు ధాన్యం వేరువేరు కేంద్రాలు ఏర్పాటే చేయడం జరిందని, కొనుగోలు కేంద్రంలో సన్న ధాన్యం నింపు గోనె సంచులకు ఎర్ర ధారంతో కుట్టి వేయాలని దానని " S " అనే అక్షరం దాని పై ముద్రించాలని, దొడ్డు ధాన్యం నింపు గెనె సంచులలో అకు పచ్చ ధారంతో కుట్టి వేయాలని, సన్న దాన్యం, దొడ్డు ధాన్యం వేర్వేరు లారీలో నింపి రైస్ మిల్లులకు రవాణా చేయాలన్నారు. జిల్లా మొత్తంలో మొత్తం 130 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో 18 సన్న రకం ధన్యం కొనుగోలు కేంద్రాలు మిగతావి దొడ్డు రకం దొడ్గు రకం కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుందన్నారు. వరి ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద త్రాగు నీరు ఉండేలా చుడాలని వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల అధికారులు సమన్వయంతో సమిష్టిగా పనిచేసి ధాయం సేకరణ సజావుగా జరిగేలా చుడాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టేంట్ కలెక్టర్ ఉమా హరతి, డిఆర్‌డిఓ శ్రీనివాస్ రెడ్డి, డిసిఎస్ఓ మోహన్‌బాబు, డిఎంసిఎస్ విజయలక్ష్మీ, వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, మార్కెట్ అధికారి సరంగా ఫాణి డిసిఓ నా లింగా చారి, తదితరులు పాల్గోన్నారు.




## ఆలయ కమిటీ ముసుగులో ప్రభుత్వ ఉద్యోగి నిధుల దుర్వినియోగం

### ప్రశ్నించిన కాలనీ కమిటీ, ధర్మకర్తలపై దురుసు ప్రవర్తన

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ఆలయ కమిటీ ముసుగులో ప్రభుత్వ ఉద్యోగి అయిన దేవాలయ నిధుల దుర్వినియోగం చేస్తున్నారని శ్రీశ్రీరామాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త పోన్నం తరుణ్ గౌడ్, సాయి మారుతి నగర్ కాలనీ కాలనీ అధ్యక్షుడు రాంబాబు గౌడ్ ఆరోపించారు. సోమవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి మారుతి నగర్ కాలనీలోని శ్రీ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ దేవాలయ నిధుల దుర్వినియోగంపై కాలనీ అధ్యక్షుడు రాంబాబు గౌడ్ కాలనీ వాసులతో కలిసి మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా విలేకర్లతో పొన్నం తరుణ్ మాట్లాడుతూ కాలనీలోని శ్రీ శ్రీ రామాంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ తన ఇష్టానుసారంగా కాలనీ కమిటీకి ఎలాంటి సమాచారం లేకుండా ఆలయ పూజారులను మారుస్తూ నేడు ఆలయాన్ని పూజలు లేకుండా పూర్తిగా తాళం వేశాడని, అతని వైఖరి పై హిందూవాదులుగా ఖండిస్తూ మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు ఫోన్ చేయగా వెంటనే తీస్తున్నామని చెప్పి ఇప్పటికీ తాళాలు తీయకపోవడం హిందూ ధర్మానికి విరుద్ధమన్నారు. ఆలయ నిర్మాణంలో భాగంగా తన తండ్రి పొన్నం మురళిగౌడ్ అన్నివిధాలుగా చేయుతనిస్తూ, తమ సొంత భూమిని ఆలయ నిర్మాణానికి ఇచ్చామని తెలిపారు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలలో ఆలయ ధర్మకర్తగా రెండు మూడు లక్షల రూపాయలు విరాళంగా అందజేస్తామన్నారు. గత రెండు సంవత్సరాల నుండి ఆలయ అధ్యక్షుడు సత్యనారాయణ గతంలో కాలనీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అవకతవకలకు పాల్పడంతో తొలగించడంలో కక్షగా ఆలయ ధర్మకర్త అయిన తమ కుటుంబానికి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పదవిని అడ్డం పెట్టుకొని దేవాలయ బ్రహ్మోత్సవాల పేరుతో ఆలయ కమిటీ ప్రతినిధులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారన ఆరోపించారు. అనంతరం కాలనీ కమిటీ మాట్లాడుతూ దేవాలయానికి సంబందించిన ఆదాయ వ్యయం లెక్కల వివరాలను అడిగితే చెప్పకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆలయానికి సంబందించిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న సత్యనారాయణ గతంలో కాలనీ అధ్యక్షుడి హోదాలో ఉన్నప్పుడు చట్ట విరుద్ధంగా దేవాలయానికి సం బందించి సేకరించిన విరాళాలను తన స్వంత ఖాతాలోకి వేసుకున్నాడన్నారు. అతని ప్రవర్తన మార్చుకోవాలని గతంలో కాలనీవాసులు పదవి నుండి తీసివేస్తే దేవాలయ కమిటీ పేరుతో సేకరించిన నిధుల వివరాలు తెలపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దుర్వినియోగం చేస్తున్నాడని తెలిపారు. దీనిపై రిటైర్డ్ దేవాదాయ శాఖ అధికారితో ఆదాయ వ్యయాలపై విచారణ చేయిస్తే లక్షల రూపాయల నిధుల తప్పుడు లెక్కలు చూపించి తన స్వప్రయోజనాలకు వాడుకున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా దేవాలయ కమిటీ ఆలయ ఆదాయ విజయాలపై ఖర్చులను చూపెట్టి ఆదాయ వ్యయాల లెక్కలు చూపెట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.













# టాలీవుడ్ నిర్మాత శివరామకృష్ణ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

లింగంగౌడ్‌ను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా రాయదుర్గంలో దాదాపు 84 ఎకరాల భూమిని సొంతం చేసుకోవాలని చూసిన ఆయన... స్టేట్ ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ నుంచి ఆ భూమికి సంబంధించిన పత్రాలు తెప్పించుకున్నారు. అలాగే ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ సీనియర్ అసిస్టెంట్ కొత్తిని చంద్రశేఖర్ సాయంతో నకిలీ పత్రాలు సృష్టించారు. అనంతరం సదరు 84 ఎకరాల భూమి తనదేనంటూ శివరామకృష్ణ క్లయిమ్ చేశాడు. అనంతరం ఆ భూమిలో బిల్డర్ మారగొని లింగం గౌడ్ సాయంతో పాగా వేశాడు. కాగా ఈ వివాదంపై 2003లో అప్పటి ప్రభుత్వం నకిలీ పత్రాలపై కోర్టులో కేసు వేసింది. నాటి నుంచి ఈ కేసు కొనసాగుతుండగా.. సదరు ప్రభుత్వ భూమి కోసం హైకోర్టు నుండి సుప్రీంకోర్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయపోరాటం చేసింది. పూర్తి వాదనలు, సాక్షాదారాలను పరిశీలించిన తర్వాత.. శివరామకృష్ణ కోర్టుకు సమర్పించినవి నకిలీ పత్రాలు అని సుప్రీం కోర్టు తేల్చింది. సుప్రీంకోర్టు తీర్పుతో శివరామకృష్ణ తో పాటు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం శివరామకృష్ణతో పాటు చంద్రశేఖర్, లింగం గౌడ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసును ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్ఐసి చేతికి ధరణి

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వ పెద్దలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ధరణి పేరుతో తెలంగాణకు చెందిన 1.56 కోట్ల ఎకరాల భూమిని తాకటుపెట్టారని తెలిపారు.. గతంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ రెవిన్యూ శాఖ బాధ్యతలను చూడడం, దీనిని అడ్డపెట్టుకుని ఆయన కుమారుడు, మాజీ ఐటీ శాఖ మంత్రి న కెటిఆర్ ఏకపక్షంగా యదేచ్ఛగా విదేశీ కంపెనీలకు అప్పగించారన్నారు. దీంతో ఐదేళ్ల పాటు ధరణి పోర్టల్ రైతులను నానా ఇబ్బందులు పడ్డారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను విదేశీ కంపెనీల చేతుల్లోతీసుకుని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి అప్పగించడం ద్వారా 71, 00,000 ఖాతాల రైతుల భూములకు పూర్తి రక్షణ కల్పించిందని తెలిపారు. ధరణి కారణంగా ఇంతకాలం భూ సమస్యలతో ఇబ్బందులు పడ్డా బాధితులందరకి పరిష్కారం లభించనుందని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వం 2020 అక్టోబర్‌లో తీసుకువచ్చిన లోపభూయిష్టమైన ఈ దరణి పోర్టల్‌తో జరిగిన మోసాలా కారణంగా తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 ఏళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను సమాధి చేసిందని మండిపడ్డారు. ఆ నాటి ప్రభుత్వ పెద్దల దాష్టీకానికి ప్రజలు అనుభవించిన బాధలకు కాంగ్రెస్ ప్రభుత్వం చరమ గీతం పాడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో నాలుగైదు రాష్ట్రాలకు నిధులను సమకూర్చిన బిఆర్ఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల నేపథ్యంలో నాలుగైదు రాష్ట్రాలకు బిఆర్ఎస్ నిధులను సమకూర్చిందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి ) ఆరోపించారు. ఢిల్లీకి డబ్బులు పంపిస్తున్నారని కెటిఆర్ తమపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. కుమార స్వామి, నవీన్ పట్నాయక్‌లకు డబ్బులను పంపించారని, కేజ్రీవాల్‌కు డబ్బులు పంపించిన కేసులోనే కెటిఆర్ చెల్లెలు జైలుకు వెళ్లిందన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహిళా ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి,టిపిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్‌తో కలిసి జగ్గారెడ్డి మాట్లాడుతూ సముద్ర మట్టానికి ఎత్తులో దామగుండం ఉన్నదని, అందుకే రాడార్ పెట్టారని, రాడార్ వ్యవస్థలో వెయ్యి కిలోమీటర్లలో ఉన్న సిగ్నల్ అందిస్తుందని, ఈ విషయాలు కెటిఆర్‌కు తెలియదని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ఏం మాట్లాడినా వక్రీకరించి మాట్లాడే పనిలో బావ,బామ్మర్దులు ఉన్నారని, వారికి రాజకీయ జ్ఞానం ఉందో ,లేదో అర్థం కావడం లేదని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి, ఇప్పుడు ఏది మాట్లాడాలి?, ఏం మాట్లాడొద్దనే విషయాన్ని కూడా వారు తెలుసుకోవడం లేదన్నారు. కెటిఆర్ నాలుకకు నరం లేదని, తెలివి లేకపోవడంతోనే రాడార్‌కు సంబంధించి జిఒను జారీ చేశారా అని జగ్గారెడ్డి నిలదీశారు. మూసి అక్కడే పుట్టిందని చెబుతున్న కెటిఆర్‌కు ఆ జిఒను జారీ చేసినప్పుడు మూసీ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. దామగుండం భూమి కేటాయించినప్పుడు అక్కడ 9 లక్షల చెట్లు ఉన్నాయనే విషయం కెటిఆర్‌కు ఎందుకు గుర్తు కు రాలేదని మండిపడ్డారు. పదేళ్లు రాజభోగాలు అనుభవించారని, ఇప్పుడు అవన్నీ దూరంకావడంతోనే పిచ్చి లేసి మాట్లాడుతున్నారని జగ్గారెడ్డి అన్నారు.



























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com